
తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
# జనంసాక్షి
www.janamsakshi.org
శుక్రవారం 28.08.2026 | సంపుటి :13 సంచిక : 39 | పేజీలు :12 వెల : రూ. 4/-
RNI NO.TELTEL / 2013 /50370
హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698

సామాన్యుని స్వరం
జనంసాక్షి tv
JANAMSAKSHI TV

# తుంగభద్ర డెడ్‌స్టోరేజ్‌కు.. తుమ్మిళ్ల వెలవెల



## ఎగువన వర్షాభావంతో నిలిచిన ఇన్‌ఫ్లో

- ఆర్డీఎస్ దిగువ ఆయకట్టుకు నీటి విడుదల ప్రశ్నార్థకం
- పంటలపై పెట్టుబడులు పెట్టిన రైతుల్లో తీవ్ర ఆందోళన
- 16.9 టీఎంసీల నీటి వాటా రాక రైతులపై తీవ్ర ప్రభావం

ప్రస్తుత నీటిమట్టం 0.5 టీఎంసీలు




తుమ్మిళ్ల దగ్గర పంపింగ్ కు సరిపడని నీరు



నది ఎండితే నీరు మాత్రమే పోతుంది.. రైతు ఆశ ఎండితే ఒక కుటుంబం కాదు.. ఒక ప్రాంతం భవిష్యత్తే ఎండిపోతుంది. నది ఎండిపోయింది.. నీటి వాటా దూరమైంది.. తుమ్మిళ్ల ఆశలు అడుగంటాయి. పొలాలు నీటి కోసం నోళ్లు తెరిచాయి.. రైతు కళ్లలో మాత్రం కన్నీళ్లు నిండాయి. నిన్నటివరకు పచ్చదనంతో కళకళలాడిన నేల.. నేడు ఎండిన పగుళ్ళతో రైతు గుండెలా మారింది. గింజను నాటిన చేతులే.. ఇప్పుడు ఎండిపోతున్న పంటను తడిమి చూస్తున్నాయి. పంటపై పెట్టిన పెట్టుబడులు కళ్లముందే కరిగిపోతుంటే.. రైతు మాత్రం ఆకాశంవైపు ఆశగా చూస్తున్నాడు.



నీరు రాక ఎండిపోయిన ఆర్డీఎస్ కెనాల్



నది నుంచి నీటిని తీసుకునే అప్రోచ్ కెనాల్

**రాజోలి/వడ్డేపల్లి, ఆగస్టు 27 (జనంసాక్షి):** తుంగభద్ర నది వెలవెలబోతోంది. ఎగువ ప్రాంతాల్లో ఆశించిన స్థాయిలో వర్షాలు లేకపోవడంతో నదిలోకి వరద ప్రవాహం పూర్తిగా తగ్గిపోయింది. దీంతో నది గర్భం ఇసుక తిన్నెలు, రాళ్లతో దర్శనమిస్తూ కాలిబాటను తలపిస్తోంది. ఈ ప్రభావం తుమ్మిళ్ల ఎత్తిపోతల పథకంపైనా తీవ్రంగా పడింది. నీటిమట్టం డెడ్ స్టోరేజ్ స్థాయికి చేరడంతో ఆర్డీఎస్ ఆయకట్టుకు నీటి విడుదలపై అనిశ్చితి నెలకొంది. జోగులాంబ గద్వాల జిల్లాలోని తుమ్మిళ్ల ఎత్తిపోతల పథకాన్ని తుంగభద్ర దిగువ ప్రాంత రైతులకు సాగునీటి భరోసా కల్పించేందుకు ప్రారంభించారు. ఈ పథకం ద్వారా సుమారు 87,000 నుండి 87,500 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించి స్థిరీకరించాలన్నది ప్రధాన లక్ష్యం. ముఖ్యంగా ఇందులో భాగంగా రాజోలిబండ డైవర్షన్ స్కీం పరిధిలో ఎండిపోతున్న సుమారు 55,600 ఎకరాల చివరి ఆయకట్టును తక్షణమే స్థిరీకరించడం ఈ ప్రాజెక్టు కీలక ఉద్దేశ్యంగా ఉంది. గద్వాల, అలంపూర్ నియోజకవర్గాల పరిధిలోని రైతులకు దీనిద్వారా జీవనాధార సాగునీరు అందాల్సి ఉంది. ఈ పథకం ప్రభావం గద్వాల తాలూకాలోని 7 గ్రామాలు, అలంపూర్ పరిధిలోని 67 గ్రామాలపై నేరుగా పడుతోంది. మొత్తం ప్రాంతం తుంగభద్ర నది దిగువ బేసిన్‌లో ఉండటంతో ప్రతి నీటి చుక్కపై రైతుల జీవనం ఆధారపడి ఉంది. తుమ్మిళ్ల పథకానికి ప్రధాన నీటి వనరు తుంగభద్ర నది. ముఖ్యంగా సుంకేసుల బ్యారేజీ వెనుక నీటి నిల్వల నుండి నీటిని ఎత్తిపోసే విధంగా ఈ ప్రాజెక్టును రూపొందించారు.

**ప్రస్తుత నీటిమట్టం**

సుంకేసుల జలాశయంలో ప్రస్తుతం కేవలం 0.5 టీఎంసీల నీటి నిల్వ మాత్రమే ఉన్నట్లు పరిస్థితి స్పష్టం చేస్తోంది. మిగతా 2లో..

### ప్రభుత్వమే ఆదుకోవాలి : శాంతిరాజు, తుమ్మిళ్ల



*నేను నాలుగు ఎకరాల్లో పత్తి పంట సాగు చేశాను. పంట చేతికొచ్చే సమయంలో వర్షాలు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాను. తుంగభద్ర నదిలో నీరు లేకపోవడంతో పంటలకు సాగునీరు అందడం లేదు. దీంతో పత్తి పంట ఎండిపోతూ, పెట్టుబడులు కూడా తిరిగి వచ్చే పరిస్థితి కనిపించడం లేదు. అధికారులు స్పందించి రైతులకు అవసరమైన సాగునీరు అందించడంతో పాటు, పంట నష్టాన్ని అంచనా వేసి నష్టపరిహారం అందించాలి*

### పూత రాలింది..దిగుబడి కష్టమే
- రవికుమార్, తుమ్మిళ్ల



*ఈ సీజన్‌లో వర్షాలు లేకపోవడంతో తుమ్మిళ్ల లిఫ్ట్ దిగువన సాగు చేసిన పంటలు దెబ్బతిన్నాయి. 3 ఎకరాల్లో పత్తి సాగు చేశాను. సుమారు రూ.70 వేల వరకు పెట్టుబడి పెట్టిన వర్షాభావ పరిస్థితులతో పూత రాలిపోవడంతో దిగుబడి తగ్గే పరిస్థితి నెలకొంది. పెట్టిన పెట్టుబడి కూడా వచ్చేలా లేదు*

# నేపాల్ వరద విలయంలో 826 మంది గల్లంతు..

- వారిలో 300 మంది భారతీయులు
- ఇప్పటి వరకు మృతులు 359
- వేలమంది నిరాశ్రయులయ్యారు.
- ఈ భారీ విపత్తు తీవ్రతను అంచనా వేస్తున్నాం
- వరద మరింత దిగువకు ప్రవహించి ఉంటే.. భారత రాష్ట్రాలపైనా ప్రభావం పడేది
- ప్రకటించిన నేపాల్ విదేశాంగ శాఖ మంత్రి శిశిర్ ఖనాల్

**ఖాట్మండు(జనంసాక్షి):** నేపాల్ ప్రకృతి విలయంలో గల్లంతైనవారి సంఖ్య అంతకంతకూ పెరుగుతోంది. ఈ జలప్రళయంలో 300 మంది వరకు భారతీయులు కొట్టుకుపోయినట్లు నేపాల్ విదేశాంగ శాఖ మంత్రి శిశిర్ ఖనాల్ గురువారం వెల్లడించారు. ఈ విషాదంలో మృతుల సంఖ్య 175కు పెరిగింది. నేపాల్ లోని విపత్తు నిర్వహణ సంస్థ ప్రకటన ప్రకారం.. ఈ ఆకస్మిక వరదల కారణంగా 826 మంది ఆచూకీ గల్లంతయ్యింది. వారిలో 85 మంది భద్రతా సిబ్బంది కాగా.. 162 మంది వివిధ హైడ్రోపవర్ కేంద్రాల్లో మిగతా 2లో..



నేపాల్‌లో చిక్కుకున్న తెలంగాణ పౌరులు
## 22 మంది
వారి ఆచూకీ తెలియాల్సి ఉంది : మంత్రి పొంగులేటి 2లో..

## మంచు చరియలు విరగడంతోనే..
నేపాల్‌లో జలప్రళయంపై ఎన్‌ఆర్‌ఎస్‌సీ అంచనా 2లో..

## 3 రోజుల్లో మరో ముప్పు!..
నేపాల్‌కు చైనా అలర్ట్

# 'తుమ్మిడిహట్టి'పై ముందడుగు

### బ్యారేజ్‌పై సెప్టెంబర్ 1న ఢిల్లీలో కీలక సమావేశం

**హైదరాబాద్(జనంసాక్షి):** ప్రాణహిత నదిపై తెలంగాణ ప్రభుత్వం ప్రతిపాదించిన తుమ్మిడిహట్టి బ్యారేజ్ నిర్మాణానికి సంబంధించిన సాంకేతిక, అంతర్రాష్ట్ర అంశాలపై సెప్టెంబర్ 1న ఢిల్లీలో కీలక సమావేశం జరగనుంది. కేంద్ర జల సంఘం ఛైర్మన్ అధ్యక్షతన ఉదయం 11 గంటలకు సేవా భవన్‌లో జరిగే ఈ సమావేశంలో తెలంగాణ, మహారాష్ట్ర జలవనరుల శాఖల ఉన్నతాధికారులు పాల్గొంటారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేసిన నిరంతర ప్రయత్నాల నేపథ్యంలోనే కేంద్ర జల సంఘం ఈ సమావేశాన్ని ఏర్పాటు చేసింది. తుమ్మిడిహట్టి ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్లేందుకు సీఎం రేవంత్‌రెడ్డి మే 26న మహారాష్ట్ర ముఖ్యమంత్రికి లేఖ రాసి, రెండు రాష్ట్రాల మధ్య సమావేశం ఏర్పాటు చేసి పరస్పర ఆమోదయోగ్యమైన పరిష్కారం సూచించాలని కోరారు. ఈ అంశాన్ని ప్రధానమంత్రి దృష్టికి కూడా తీసుకెళ్లగా, ప్రధానమంత్రి కార్యాలయం జలశక్తి మంత్రిత్వ శాఖకు పంపించింది. అనంతరం ఆగస్టు 5న కేంద్ర జలశక్తి మంత్రి మిగతా 2లో..



### పర్యాటక కేంద్రంగా
# మీరాలం చెరువు



**వాటర్ స్పోర్ట్స్, ఐ ల్యాండ్ అభివృద్ధి చేయాలి**

- ఐకానిక్ సస్పెన్షన్ బ్రిడ్జి నిర్మాణం మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్
- కార్పొరేషన్ ఆధ్వర్యంలో పనులు మీరాలం చెరువును ఆకస్మికంగా సందర్శించిన సీఎం రేవంత్‌రెడ్డి

**హైదరాబాద్,ఆగస్ట్27(జనంసాక్షి):** హైదరాబాద్ నగరంలోని చారిత్రక ప్రాధాన్యం కలిగిన మిర్ ఆలం చెరువుకు తెలంగాణ ప్రభుత్వం సరికొత్త హంగులు అద్దబోతోంది. కుటుంబ సమేతంగా వచ్చి రోజంతా ప్రకృతి అందాలు, జలక్రీడలు , వినోదాన్ని ఆస్వాదించేలా దీనిని అంతర్జాతీయ స్థాయి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని నిర్ణయించింది. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గురువారం మిర్ ఆలం చెరువును అకస్మికంగా పరిశీలించారు. మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న సుందరీకరణ పనులు , సస్పెన్షన్ బ్రిడ్జి నిర్మాణ పురోగతిని అధికారులతో సమీక్షించిన సీఎం, పనులన్నింటినీ నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. చెరువుపై నిర్మిస్తున్న ఐకానిక్ సస్పెన్షన్ బ్రిడ్జి పనులు శరవేగంగా సాగుతున్నాయి. లక్ష్యంగా పెట్టుకున్న 544 పైల్స్‌లో 273 (50.18 శాతం) పైల్స్ పూర్తి కాగా, 62 పైల్ క్యాప్స్‌లో 28 (45.16 శాతం) పనులు పూర్తయ్యాయని అధికారులు సీఎంకు వివరించారు. చెరువు పునరుజ్జీవనం, చెరువు పరిసర ప్రాంతాలు , ఐలాండ్ల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించారు. ముఖ్యంగా చెరువులోకి ఎలాంటి మురుగు నీరు చేరకుండా పటిష్ఠమైన చర్యలు తీసుకోవాలని, వర్షపు నీరు మూసీ నదిలోకి సాఫీగా వెళ్లేలా నాలాలను విస్తరించి నీటి నాణ్యతను పెంచాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. వివరాలు 3లో..

**ఉత్తమ అవార్డులు ..**
# అదే చేత్తో ఆమ్యామ్యాలు



### రూ.100 కోట్లకు పైగా అక్రమ ఆస్తులు కూడబెట్టిన భూగర్భగనుల శాఖ ఏడీ జయరాజు

**భూపాలపల్లి(జనంసాక్షి):** జయశంకర్ భూపాలపల్లి జిల్లా భూగర్భగనుల శాఖ ఏడీ జయరాజు నివాసాల్లో ఏసీబీ అధికారులు చేపట్టిన సోదాల్లో సుమారు రూ.100 కోట్ల విలువ చేసే ఆస్తులు గుర్తించారు. దీంతో ఆయనను అరెస్టు చేశారు. ఆదాయానికి మించిన ఆస్తుల ఆరోపణల నేపథ్యంలో భూపాలపల్లి, హైదరాబాద్, సూర్యాపేట, తాండూరు సహా 12 ప్రాంతాల్లో అవినీతి నిరోధక శాఖ అధికారులు ఈరోజు సోదాలు చేపట్టారు. ఈ క్రమంలో జయరాజుకు హైదరాబాద్‌లోని బోడుప్పల్‌లో రెండంతస్తుల భవనం, కేపీహెచ్‌బీలో ఫ్లాట్, కీసర, సూర్యాపేట, తూప్రాన్, తుంగతుర్తిలో ప్లాట్లు, సూర్యాపేటలో 3.21 ఎకరాల భూమి ఉన్నట్లు గుర్తించారు.జయరాజ్ నివాసాల్లో రూ.10 లక్షల నగదును అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఇళ్లల్లో భారీగా గృహోపకరణాలు, రూ.71 లక్షల బ్యాంకు నిల్వలు ఉన్నట్లు తేలింది. డ్రైవర్‌కు పలు దఫాలుగా రూ.24 లక్షలు బదిలీ చేసినట్లు గుర్తించారు. ఇసుక రవాణా మామూళ్లను ఏడీ జయరాజ్ తన ఖాతాకు బదిలీ చేసినట్లు డ్రైవర్ వెల్లడించాడు. ఆ డబ్బును జయరాజు కుమార్తెకు బదిలీ చేసినట్లు తెలిపాడు. ఉత్తమ అధికారిగా అవార్డు అందుకోవడం గమనార్హం.

# ఎన్నికల హామీలు నెరవేర్చండి

- కదం తొక్కిన ఉద్యోగులు
- మహాధర్నా సక్సెస్
- గాల్లో దీపంలాగా ఈహెచ్‌ఎస్ అమలు..
- ఉద్యోగులకు మాత్రం జీతంలో కోత:హరీశ్ రావు



**హైదరాబాద్(జనంసాక్షి):** తమ సమస్యలపై ఉద్యోగులు నిరసన గళం వినిపించారు. చాలా కాలంగా పరిష్కారం కాకుండా ఉన్న డీఏలు, పీఆర్సీ, పెన్షన్ విధానం, హెల్త్ కార్డులు తదితర అంశాలపై ప్రభుత్వం వెంటనే స్పందించాలని డిమాండ్ చేస్తూ ఉద్యోగ సంఘాలు కదం తొక్కాయి. రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు కరీంనగర్ కలెక్టరేట్ ఎదుట ఉద్యోగ సంఘాల ఆధ్వర్యంలో మహాధర్నా నిర్వహించగా.. ఉద్యోగులు, సంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా టీఎన్‌జీఓ జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాసరెడ్డి, జిల్లా కన్వీనర్ కాళీ చరణ్ మాట్లాడుతూ.. ఉద్యోగులు ప్రభుత్వం ముందు ఎలాంటి గొంతెమ్మ కోరికలు పెట్టడం లేదని అన్నారు. రాజ్యాంగబద్ధంగా తమకు దక్కాల్సిన హక్కులనే కోరుతున్నామని స్పష్టం చేశారు. ఆరు నెలలకోసారి రావాల్సిన డీఏ, ఏడాదికోసారి ఇవ్వాల్సిన ఇంక్రిమెంట్, ఐదేళ్లకోసారి అమలు చేయాల్సిన పీఆర్సీ విషయంలో ప్రభుత్వం ఇకనైనా స్పష్టమైన నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న తమ సమస్యల సాధన కోసం జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయం ఎదుట ఉద్యోగులు మహా ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మిగతా 2లో..

**మరో 25 ఏళ్లపాటు లోక్‌సభ స్థానాలు**
# మార్చొద్దు



- ప్రస్తుత సంఖ్యనే కొనసాగించాలి
- పస్తుత సీట్లకు అనుగుణంగా 33శాతం మహిళా రిజర్వేషన్లు
- తక్షణం అఖిలపక్షం ఏర్పాటు చేసి చర్చించాలి
- ప్రధాని మోడీకి కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే లేఖ

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** లోక్‌సభ నియోజకవర్గాలను యధావిధిగా కొనసాగిస్తూ, మహిళా రిజర్వేషన్లను అమలు చేయాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేసింది. అలాగే డిలిమిటేషన్‌పై వెంటనే అఖిలపక్షం ఏర్పాటు చేసి, మీరు ఏమనుకుంటున్నారో చర్చించాలని కూడా అన్నారు. నియోజకవర్గాల పునర్విభజనపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ప్రధాని నరేంద్ర మోదీకి లేఖ రాశారు. ప్రస్తుత లోక్‌సభ స్థానాల సంఖ్య 543 మరో 25 ఏళ్లపాటు ఇలాగే ఉండాలని పేర్కొన్నారు. పార్లమెంట్‌లో డీలిమిటేషన్‌కు మిగతా 2లో..



# ఖనిజాలను వెలికితీద్దాం.. దేశ సంపదను పెంచుదాం

- దేవదుర్గగనిలో కాపర్, గోల్డ్ మైనింగ్ అన్వేషణ కార్యక్రమాన్ని ప్రారంభించిన డిప్యూటీ సీఎం భట్టి
- అక్కడ సైట్ క్యాంప్ ఆఫీస్ ఏర్పాటు చేయాలని సింగరేణి అధికారులను ఆదేశించిన ఉపముఖ్యమంత్రి
- స్థానికుల సహకారంతో త్వరితగతిన ఖనిజ అన్వేషణ కార్యక్రమాన్ని పూర్తి చేయాలని సూచన

వార్త 2 లో

# నేపాల్ వరద విలయంలో 826 మంది గల్లంతు..

పనిచేస్తోన్న ఉద్యోగులు ఉన్నారు. 579 పర్యాటకులు ఉన్నారని ఆ సంస్థ పేర్కొంది. "వేలమంది నిరాశ్రయులయ్యారు. ఈ భారీ విపత్తు తీవ్రతను అంచనా వేస్తున్నాం" అని ఖనాల్ పేర్కొన్నారు. అటు టిబెట్ వైపు 588 మంది గల్లంతయ్యారు. వారిలో 260 మంది విదేశీయులే. హిమాలయాల్లో కరిగిన మంచు జలవనరుల్లో నీటి మట్టాలను పెంచుతుందని, నిన్న మనందరం చూసింది అదేనని నేపాల్ మంత్రి అన్నారు. ఈ వరద మరింత దిగువకు ప్రవహించి ఉంటే.. భారత రాష్ట్రాలపైనా ప్రభావం పడేందని తెలిపారు. గతంలోనూ ఇలా జరిగిన సందర్భాలున్నాయని గుర్తుచేశారు. భారత్, చైనా, నేపాల్, భూటాన్ పర్యావరణపరంగా అనుసంధానమై ఉన్నాయని, ఈ దేశాలు తమ విభేదాలను పక్కనపెట్టి కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. మంచు చరియలు విరగడంతో టిబెట్ వైపు సంభవించిన వరద గురించి చైనాకు ముందే తెలిసినా నేపాల్‌ను అప్రమత్తం చేయలేదని తీవ్ర ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో మంత్రి స్పందన వచ్చింది.

**చైనాకు జగ్గీ వాసుదేవ్ రిక్వెస్ట్..**

ఈ వరదల్లో ఈశా ఫౌండేషన్‌కు చెందిన దాదాపు 80 మంది గల్లంతైన సంగతి తెలిసిందే. దీనిపై సద్గురు జగ్గీ వాసుదేవ్ స్పందించారు. సహాయకచర్యల్లో సహకరించేందుకు తనతోపాటు మరికొంతమంది వాలంటీర్లను అనుమతించాలని చైనా అధికారులను కోరారు.

**భారత్ ఆపన్నహస్తం..**

ప్రకృతి విపత్తుతో అల్లకల్లోమైన హిమాలయ దేశానికి భారత్ ఆపన్న హస్తం అందించింది. రెండు విమానాల్లో 47.5 టన్నుల సహాయక సామగ్రితో పాటు రెస్క్యూ బృందాలను కాఠ్‌మాండూకు పంపింది.

## మంచు చరియలు విరగడంతోనే..

న్యూఢిల్లీ(జనంసాక్షి):మంచు చరియలు విరిగిపడటంతోనే నేపాల్‌లో ఆకస్మిక వరద విలయం చోటుచేసుకుందని హైదరాబాద్‌లోని నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ ధ్రువీకరిస్తోంది. ఈ విలయంపై ఇస్రో సహకారంతో ఎన్ఆర్ఎస్సీ అధ్యయనం చేసింది. భారత ఉపగ్రహం తీసిన ఛాయాచిత్రాల ఆధారంగా విలయం ఎలా సంభవించిందో అంచనా వేసింది. మంచుతో కప్పేసిన కొండచరియలు విరిగి సరస్సులో పడటంతో త్రిశూల్ నదికి వరద పోటెత్తిన్నట్లు శాస్త్రవేత్తలు అంచనా వేస్తున్నారు.

## మూడు రోజుల్లో మరో ముప్పు!..


బీజింగ్(జనంసాక్షి):ఆకస్మిక వరదలు సృష్టించిన విలయంతో నేపాల్‌లో అనేక గ్రామాలు నేలమట్టమయ్యాయి. వందలాది మంది ఆచూకీ గల్లంతు కావడంతోపాటు ప్రాణనష్టం కూడా క్రమంగా పెరుగుతోంది. ఇదే సమయంలో రసువా జిల్లాలో భోటే కోషి నదీ ప్రవాహం మొదలయ్యే దగ్గర కొత్తగా ఓ సరస్సు ఏర్పడిందని చైనా అధికారులు వెల్లడించారు. రెండు, మూడు రోజుల్లో అది తెగిపోయే ప్రమాదం ఉందని, దిగువ ప్రాంతాలకు మరో వరద ముప్పు ఉందని హెచ్చరించారు. టిబెట్‌లో ప్రారంభమయ్యే చోచెన్ ఖోలా, పురేపు త్సాంగ్పో నదులు తరువాత సంగమమై నేపాల్‌లోకి ప్రవహిస్తాయి. ఈ నదులు కలిసే ప్రాంతానికి సమీపంలోనే కొత్తగా ఓ సరస్సు ఏర్పడిందని చైనా అధికారులు గుర్తించారు. గురువారం నాటికి ఆ సరస్సులో 20లక్షల క్యూబిక్ మీటర్ల నీరు చేరిందని, మూడు రోజుల్లో మరో 30లక్షల క్యూ.మీ నీరు చేరవచ్చని అంచనా వేశారు. దీంతో అది తెగిపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. సరస్సును ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్న చైనా అధికారులు.. గండి పడితే ఎదురయ్యే పరిమాణాలు, అత్యవసర ప్రతిస్పందన చర్యలపై చర్చిస్తున్నట్టు తెలుస్తోంది. ఇందుకు సంబంధించి చైనా నుంచి సమాచారం వచ్చినట్లు నేపాల్ జల విజ్ఞాన, వాతావరణ విభాగం వెల్లడించింది. ఈ విషయాన్ని నేపాల్ విదేశాంగ శాఖకు చైనా ప్రభుత్వం అధికారికంగా తెలియజేసిందని తెలిపింది. భోటేకోషి, త్రిశూలి నదులకు మరోసారి వరద ముప్పు ఉందని, స్థానిక ప్రజలు ఆయా నదుల తీరానికి దూరంగా ఉండాలని హెచ్చరించినట్లు పేర్కొంది. తదుపరి సమాచారం ఇచ్చే వరకు సురక్షిత ప్రాంతాల్లో ఉండాలని సూచించింది. వరదల ముప్పు దృష్ట్యా సెర్చ్, రెస్క్యూ ఆపరేషన్‌లో పాల్గొంటున్న వారితోపాటు ప్రయాణికులు, సెక్యూరిటీ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించింది.

## నేపాల్‌లో చిక్కుకున్న తెలంగాణ పౌరులు 22 మంది

హైదరాబాద్(జనంసాక్షి): నేపాల్ వరదల పరిస్థితులపై మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. నేపాల్‌లో తెలంగాణకు చెందిన 23 మంది చిక్కుకున్నట్లు గుర్తించామని తెలిపారు. వీరిలో ఆరుగురు రాష్ట్ర వాసులు కాగా, 17 మంది ప్రవాస తెలంగాణ వారని మంత్రి తెలిపారు. రంగారెడ్డి జిల్లాకు చెందిన ఓ పర్యాటకుడు సురక్షితంగా ఉన్నట్లు తెలిసిందన్నారు. మిగతా 22 మంది ఆచూకీ కోసం ప్రయత్నిస్తున్నట్లు మంత్రి చెప్పారు. చిక్కుకున్నవారి వివరాలు విదేశాంగశాఖకు పంపించినట్లు పేర్కొన్నారు. కేంద్రం, నేపాల్‌లోని రాయబార కార్యాలయంతో సమన్వయం చేస్తున్నట్లు వెల్లడించారు. దిల్లీ, హైదరాబాద్‌లో హెల్ప్‌లైన్, కోఆర్డినేషన్ సెంటర్లు ఏర్పాటు చేశామన్నారు.

## సగానికిపైగా క్రీడల్లో మన ప్రాతినిధ్యం లేదు

**ఒలింపిక్స్‌లో భారత్ వెనుకబాటుకు ఇదే కారణమట!.. మోదీ వ్యాఖ్యలు**



న్యూఢిల్లీ(జనంసాక్షి):క్రీడల ద్వారా జీవితాలు ఎలా మారిపోతాయనే దానికి పారా అథ్లెట్లే ప్రత్యక్ష ఉదాహరణ అని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. శనివారం జాతీయ క్రీడా దినోత్సవం నేపథ్యంలో నేడు 'ఖేలో ఇండియా డైలాగ్' కార్యక్రమం జరిగింది. వందలాది మంది అథ్లెట్లు, విద్యార్థులు, వాలంటీర్లతో ప్రధాని వర్చువల్‌గా మాట్లాడారు. ఒలింపిక్స్ లోని సగం విభాగాల్లో భారత్ నుంచి ప్రాతినిధ్యమే లేదని గుర్తు చేశారు. ఆ విషయంటలో మరింత మెరుగవ్వాల్సిన అవసరం ఉందని తెలిపారు ."ఒలింపిక్స్‌లో చాలా క్రీడాంశాలు ఉంటాయి. అందులో సగం క్రీడల్లో భారత అథ్లెట్లు పాల్గొనడం లేదు. పతకాలు ఎక్కువగా వచ్చే విభాగాల్లో మనం ఆడట్లేదు. ఇది దశాబ్దాలుగా జరుగుతోంది. 2012లో మనం కేవలం 13 క్రీడల్లోనే తలపడ్డాం. మరో 20 ఈవెంట్స్‌లో అడుగే పెట్టలేదు. అందులో కొన్ని పోటీలు ఎలా ఉంటాయో కూడా దేశంలోని చాలా మందికి తెలియదు. ఇది వినేందుకు కఠినంగా ఉన్నా.. చేదునిజం. ఇతర దేశాల ప్లేయర్లు అందులోనే ఎక్కువగా పతకాలు సాధిస్తున్నారు. ఒలింపిక్స్‌లో మన పతకాల సంఖ్య పెరగాలంటే ఈ క్రీడల్లోనూ ప్రాతినిధ్యం ఉండాలి" అని మోదీ తెలిపారు.

**2028 ఒలింపిక్స్‌లో...**

ఇప్పటి వరకు ఒలింపిక్స్‌లో సర్ఫింగ్, స్పోర్ట్ క్లైంబింగ్ పోటీల్లో భారత్ నుంచి ఎవరూ పాల్గొనలేదు. ఈ రెండింటిని ఉదహరిస్తూ ప్రధాని మాట్లాడారు. "మనకు అద్భుతమైన కోస్తా తీరం ఉంది. అలాగే కొండ ప్రాంతాలూ ఉన్నాయి. సహజ సిద్ధంగానే వనరులు ఉన్నప్పుడు ఇలాంటి క్రీడల్లో మన ప్రాతినిధ్యం పెరగాలి. అప్పుడే పతకాలను ఎక్కువ సాధించేందుకు అవకాశాలు మెరుగ్గా ఉంటాయి" అని ప్రధాని సూచించారు. 2028లో లాస్ ఏంజెలెస్ ఒలింపిక్స్‌లో మరిన్ని ఈవెంట్లలో పాల్గొనేలా చూడాలని ఇప్పటికే అథ్లెట్లకు మోదీ దిశానిర్దేశం చేశారు.

**వారి విజయం..**

"ఒక అథ్లెట్ సక్సెస్ అయితే.. కేవలం వారి వరకే ఆ ఫలితాలు ఉండవు. కుటుంబం, పాఠశాల, కళాశాల, జిల్లా, రాష్ట్రం, దేశం గురించి ప్రపంచం మొత్తం తెలుసుకుంటుంది. అందుకు పారా అథ్లెట్ల జీవితమే ప్రత్యక్ష ఉదాహరణ. కామన్వెల్త్ గేమ్స్‌లో పతకాలు సాధించిన వీరంతా నాలో స్ఫూర్తి నింపారు" అని మోదీ వెల్లడించారు.

# తుంగభద్ర డెడ్ స్టోరేజ్‌కు.. తుమ్మిళ్ల వెలవెల



**ప్రస్తుత నీటిమట్టం 0.5 టీఎంసీలు**

వర్షాలు ముఖం చాటేయడం, ఎగువ నుంచి ఆశించిన స్థాయిలో ఇన్‌ఫ్లో లేకపోవడంతో నిల్వలు తగ్గిపోతున్నాయి. కొత్తగా నీరు చేరకపోతే రానున్న రోజుల్లో సాగునీటి పరిస్థితి మరింత తీవ్రంగా మారే అవకాశం ఉంది.నీటి వినియోగ అంచనా (సైడ్ నోట్): 0.5 టీఎంసీ నీటితో సుమారు 5,000 ఎకరాల వరి సాగు మాత్రమే సాధ్యం. వరి పంటకు నీటి అవసరం అధికంగా ఉండటంతో నిల్వ నీరు పరిమితంగా ఉన్న ప్రస్తుత పరిస్థితుల్లో 0.5 టీఎంసీలతో 5,000 ఎకరాలకు మాత్రమే సాగు అవకాశం ఉంటుంది.

**వర్షాల కోసం ఎదురుచూపులు**

ఈ సీజన్‌లో సమృద్ధిగా వర్షాలు కురుస్తాయని ఆశించిన రైతులకు నిరాశే ఎదురవుతోంది. పంటలు వేసిన సమయంలో కురిసిన వర్షాలతో ఆశలు పెంచుకున్న రైతులకు ఆ తర్వాత వరుణుడు ముఖం చాటేయడంతో పరిస్థితి తారుమారైంది. పొలాల్లో పంటలు ఎదుగుతున్న దశలో నీటి అవసరం పెరుగుతుండగా, వర్షాలు లేకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

**ఎగువన రాజోలిబండ డైవర్షన్ స్కీం ప్రభావం**

ఎగువ ప్రాంతాల్లో ఉన్న రాజోలిబండ డైవర్షన్ స్కీం ద్వారా తుంగభద్ర ప్రవాహం పెద్ద మొత్తంలో మళ్లించబడుతోంది. దీంతో దిగువ ప్రాంతాలకు రావాల్సిన నీటి ప్రవాహం తగ్గిపోతోంది. ఫలితంగా తుమ్మిళ్ల పథకానికి అవసరమైన నీటి లభ్యత తీవ్రంగా దెబ్బతింటోంది. రాజోలిబండ ఆనకట్ట ద్వారా కేటాయించిన సుమారు 16.9 టీఎంసీల నీటి వాటా పూర్తిస్థాయిలో దిగువ ప్రాంతాలకు చేరడం లేదు. ఈ కారణంగా తుమ్మిళ్ల పథకం, ఆర్డీఎస్ ఆయకట్టు రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఈ నీటి వాటా సక్రమంగా అందితే లక్షల ఎకరాల భూమి సస్యశ్యామలమయ్యే అవకాశం ఉంది.

**తుమ్మిళ్ల లిఫ్ట్ దిగువన తీవ్ర ఇబ్బందులు**

తుమ్మిళ్ల లిఫ్ట్ దిగువ ప్రాంతాల్లోని రైతుల పరిస్థితి మరింత దయనీయంగా మారిందని వారు వాపోతున్నారు. లిఫ్ట్ ద్వారా సాగునీరు అందుతుందన్న ఆశతో పంటలు సాగు చేసిన రైతులకు ప్రస్తుతం నీటి కొరత ఎదురవుతోంది. పొలాల్లో పంటలు నీటి కోసం ఎదురుచూస్తున్నప్పటికీ నీరు అందకపోవడంతో పంటలు ఎండిపోయే పరిస్థితి ఏర్పడుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**నీటి కొరతతో పంటలపై ప్రభావం**

ప్రస్తుతం నీటి లభ్యత లేకపోవడంతో పంటలు ఎండిపోయే ప్రమాదం నెలకొంది. సుమారు 70 వేల నుంచి 1 లక్ష ఎకరాల వరకు పంట నష్టం జరిగే అవకాశం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పత్తి, మిరప, వరి వంటి ప్రధాన పంటలు తీవ్రంగా దెబ్బతినే పరిస్థితి ఉంది. ఒకవైపు వర్షాలు లేకపోవడం, మరోవైపు జలాశయంలో నీటి నిల్వలు తగ్గిపోవడంతో రైతుల్లో భయం పెరుగుతోంది. పంటలను కాపాడుకోవడానికి అదనంగా నీటిని సమకూర్చుకునే పరిస్థితి కూడా లేదని పలువురు రైతులు చెబుతున్నారు. సాగునీటి కోసం బోర్లు, ఇతర నీటి వనరులపై ఆధారపడాల్సి వస్తుండటంతో అదనపు ఖర్చులు భరించాల్సి వస్తోందని పేర్కొంటున్నారు. సకాలంలో వర్షాలు కురవకపోతే పంటల దిగుబడిపై తీవ్ర ప్రభావం పడుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ముఖ్యంగా పూత, కాయ దశకు చేరుకునే సమయంలో తగినంత నీరు అందకపోతే దిగుబడి గణనీయంగా తగ్గే ప్రమాదం ఉందని రైతులు చెబుతున్నారు.



**ప్రభుత్వం తక్షణ చర్యలు అవసరం**

తుమ్మిళ్ల పథకం, ఆర్డీఎస్ ఆయకట్టు పరిస్థితిపై ప్రభుత్వం తక్షణమే సమీక్ష జరపాలని రైతులు కోరుతున్నారు. రాజోలిబండ డైవర్షన్ స్కీం ద్వారా జరుగుతున్న నీటి మళ్లింపుపై స్పష్టత తీసుకురావాలని, 16.9 టీఎంసీల నీటి వాటా పూర్తిగా దిగువకు చేరేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. సుంకేసుల జలాశయంలో నీటి పరిస్థితిని అధికారులు వెంటనే పరిశీలించి, అందుబాటులో ఉన్న నీటిని పంటలకు అవసరమైన విధంగా వినియోగించేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. తుమ్మిళ్ల లిఫ్ట్ దిగువ ప్రాంతాలకు సాగునీరు అందేలా చర్యలు తీసుకుని పంటలను కాపాడాలని విజ్ఞప్తి చేస్తున్నారు. అవసరమైతే ప్రత్యామ్నాయ నీటి వనరులను ఏర్పాటు చేయడంతో పాటు, పంట నష్టాన్ని ముందస్తుగా అంచనా వేసి రైతులకు తగిన పరిహారం అందించాలని కోరుతున్నారు.

**రూ.2 లక్షలకు పైగా పెట్టుబడి పెట్టా**

**– పింజారి ఖాజా హుస్సేన్, ముండ్లదిన్నె**



తుమ్మిళ్ల లిఫ్ట్ కింద 8 ఎకరాల్లో కౌలుకు తీసుకుని పత్తిపంట సాగు చేశాను. పంట సాగు కోసం ఇప్పటివరకు రూ.2 లక్షలకు పైగా పెట్టుబడి పెట్టాను. అయితే ఈ ఏడాది వర్షాలు సక్రమంగా కురవకపోవడం, సాగునీరు అందకపోవడంతో పత్తిపంట తీవ్రంగా దెబ్బతింది. కౌలు రైతుగా ఈ ఏడాది భారీగా నష్టం చేకూరింది. ప్రభుత్వం పంట నష్టాన్ని పరిశీలించి, నష్టపరిహారం అందించి ఆదుకోవాలి.

**10 ఎకరాలు వరి వేసాను**

**– పరుశరాముడు, రాజోలి రైతు**



పది ఎకరాల్లో వరి పంట వేశా. నేటికీ నదిలో నీరు రాలేదు. నాట్లు వేసే సమయానికి నదిలో ఉన్న కొద్దిపాటి నీరుతో అప్పటివరకు నీటిని వాడుకున్నాం. కర్ణాటక ప్రాంతంలో వర్షాలు కురిసిన అక్కడి నుంచి తుంగభద్ర నదికి వరద నీరు వచ్చినా కూడా కొంత ఊరట కలుగుతుంది. ఇటు వర్షాలు లేక, అటు వరద లేక ఏమి చేయాలో పాలు పోవడం లేదు.

## పర్యాటక కేంద్రంగా మీరాలం చెరువు

యువతతో పాటు కుటుంబాలను ఆకట్టుకునేలా మిర్ ఆలం చెరువులో బోటింగ్, వాటర్ స్పోర్ట్స్, అడ్వెంచర్ కార్యకలాపాలను అందుబాటులోకి తేనున్నారు. పర్యావరణ భద్రతా ప్రమాణాలకు అనుగుణంగా చెరువు చుట్టూ ఫుడ్‌కోర్టులు, పచ్చని పార్కులు, చిన్నారుల కోసం ప్రత్యేక ఆట స్థలాలు , వాకింగ్ ట్రాక్‌లు ఏర్పాటు కానున్నాయి. అంతేకాకుండా, చెరువులో ఉన్న ఐలాండ్లను ప్రకృతి ఆధారిత విశ్రాంతి కేంద్రాలుగా, టెంట్లు వేసుకునే గ్లాంపింగ్ స్పాట్లుగా , డెస్టినేషన్ వెడ్డింగ్స్, ఈవెంట్లకు అనుకూలమైన వేదికలుగా రూపుదిద్దనున్నారు. ఈ నాణ్యమైన సౌకర్యాల కోసం పిపిపి విధానంలో ప్రైవేటు భాగస్వామ్యాన్ని ప్రోత్సహించి స్థానికులకు ఉపాధి కల్పిస్తారు. సమీపంలోనే ఉన్న నెహ్రూ జూలాజికల్ పార్కుతో మిర్ ఆలం ట్యాంక్ అభివృద్ధిని సమగ్రంగా అనుసంధానించాలని సీఎం రేవంత్ రెడ్డి దిశానిర్దేశం చేశారు. దీనివల్ల జూ పార్క్ సందర్శనకు వచ్చే పర్యాటకులు ఒకే పర్యటనలో చెరువు అందాలు, జలక్రీడలు , కుటుంబ వినోదాన్ని పొందగలుగుతారు. విమానాశ్రయానికి సమీపంలో ఉండే ఈ చారిత్రక ప్రాంతం అభివృద్ధి చెందితే, హైదరాబాద్ నగరవాసులతో పాటు దేశ, విదేశీ పర్యాటకులకు మిర్ ఆలం ట్యాంక్ ఒక ప్రధాన పర్యాటక గమ్యస్థానంగా మారనుంది.

**రాఖీ పౌర్ణమి పండుగ సందర్భంగా ముఖ్యమంత్రి శుభాకంక్షలు**

రాష్ట్రంలోని అక్కచెల్లెళ్ళకు శుభాకాంక్షలు తెలిపారు. అన్నాచెల్లెళ్ళు, అక్కాతమ్ముళ్ల అనుబంధానికి ప్రతీకైన ఈ పండుగను అందరూ ఆనందంగా జరుపుకోవాలని ఆయన ఆకాంక్షించారు. ప్రతి ఇంట్లో సుఖసంతోషాలు, ఆరోగ్యం వెల్లివిరియాలని అన్నారు. మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసి, ఆడబిడ్డలను కోటీశ్వరులను చేయాలనే లక్ష్యంతో ప్రజా ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోందన్నారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనే బృహత్ సంకల్పంలో భాగంగా అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తోందని సీఎం తెలిపారు.

## ఎన్నికల హామీలు నెరవేర్చండి

టీజీఈజేఏసీ జిల్లా ఛైర్మన్ వెలమల ప్రభాకర్ మాట్లాడుతూ..ఉద్యోగ, ఉపాధ్యాయులు, పెన్షనర్లకు రెండో పీఆర్సీని వెంటనే ప్రకటించాలని, పెండింగ్‌లో ఉన్న ఆరు డీఏలను విడుదల చేయాలని కోరారు. సీపీఎస్ విధానాన్ని రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని, పెండింగ్‌లో ఉన్న బిల్లులను చెల్లించడానికి ప్రభుత్వం ప్రతినెలా రూ. 2వేల కోట్లను కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ మహా ధర్నాకు భాజపా, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, గెజిటెడ్ అధికార సంఘం నాయకులు మద్దతు ప్రకటించారు.ప్రభుత్వం మాటలు చెప్పింది తప్ప.. ఈ రాష్ట్రంలో ఈహెచ్ఎస్ అమలు కావడం లేదని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు అన్నారు. గురువారం హన్మకొండ కలెక్టరేట్ వద్ద ఉద్యోగులు చేపట్టిన నిరసన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.

## 'తుమ్మిడిహట్టి'పై ముందడుగు

సి.ఆర్.పాటిల్‌కు సీఎం ప్రత్యేకంగా లేఖ రాసి కేంద్రం జోక్యం చేసుకోవాలని కోరారు. మహారాష్ట్ర గతంలో అంగీకరించిన 148 మీటర్ల ఎత్తుకు బదులుగా 152 మీటర్ల ఎత్తు ఉండేలా అంగీకారం సాధించేందుకు తెలంగాణ ప్రయత్నిస్తోంది. 148 మీటర్ల వద్ద అవసరమైన నీటిని గ్రావిటీ ద్వారా తీసుకోవడం సాధ్యం కాదని, భారీ పంపులు వినియోగిస్తే విద్యుత్ వ్యయం పెరుగుతుందని తెలంగాణ కేంద్రానికి వివరించింది. తక్కువ విద్యుత్ వ్యయంతో, దీర్ఘకాలికంగా రాష్ట్రానికి ప్రయోజనం కలిగేలా ప్రాజెక్టును నిర్మించాలన్నదే తెలంగాణ ప్రభుత్వ ప్రధాన వాదన. సీడబ్ల్యూపీఆర్ఎస్ అధ్యయనాల ప్రకారం జలమట్టం పెంపుతో అదనపు ముంపు పరిమితంగానే ఉంటుందని కూడా ప్రభుత్వం కేంద్రం దృష్టికి తీసుకెళ్లింది. వెనుకబడిన, కరవు ప్రభావిత ప్రాంతాలకు సాగునీరు అందించే ఈ కీలక ప్రాజెక్టును త్వరగా కార్యరూపంలోకి తీసుకురావాలనే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం కేంద్రం, మహారాష్ట్రతో వరుసగా సంప్రదింపులు కొనసాగిస్తోంది.

## ఈవీ పథకం కింద ఆటో డ్రైవర్లకు సాయం

**రూ.200 కోట్లు కేటాయిస్తూ**

**జీవో జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం**

హైదరాబాద్,ఆగస్ట్27(జనంసాక్షి): ఆటో డ్రైవర్లకు తెలంగాణ ప్రభుత్వం శుభవార్త తెలిపింది. ఆటోరిక్షా డ్రైవర్లకు ప్రయోజనం కల్పించేలా రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. పెట్రోల్, డీజిల్‌తో నడిచే ఆటోరిక్షాలను ఎలక్ట్రిక్ వాహనాలుగా మార్చేందుకు 'తెలంగాణ ఆటోరిక్షా ఎలక్ట్రిక్ కన్వర్షన్ స్కీమ్-2026'ను అమలు చేయాలని నిర్ణయించింది. ఇప్పటికే ఈ పథకం అమలుకు సిఎం గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఈ పథకం కింద రాష్ట్రవ్యాప్తంగా 18,766 పెట్రోల్, డీజిల్ ఆటోలను ఎలక్ట్రిక్ ఆటోలుగా మార్చేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టనుంది. ఇందుకోసం ఏకంగా రూ.200 కోట్ల బడ్జెట్‌ను కేటాయిస్తూ ప్రభుత్వం జీవో జారీ చేసింది.

## ఓయూకు రూ.వెయ్యి కోట్ల హామీ ఏమైంది?

**ఒక్క రూపాయి ఇవ్వలేదు: రామచందర్‌రావు**

హైదరాబాద్(జనంసాక్షి): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. ఉస్మానియా యూనివర్సిటీ (ఓయూ)కి రూ.వెయ్యి కోట్లు ఇస్తానని చెప్పి ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు విమర్శించారు. హైదరాబాద్ తార్నాకలోని నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. నిధులు ప్రకటించి ఏడాది గడిచినా.. రూపాయి కూడా మంజూరు చేయలేదన్నారు."టీచర్లకు జీతాలు ఇచ్చేందుకు డబ్బులు లేవని స్వయంగా సీఎం అన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం దారిలోనే.. కాంగ్రెస్ ప్రభుత్వం వెళ్తోంది. విద్యార్థుల విషయంలో మాట్లాడే అర్హత బీఆర్ఎస్‌కు లేదని చెప్తూనే ఉన్నాం. పాలిటెక్నిక్ కోర్సు కూడా స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సు. పాలిటెక్నిక్ విద్యార్థులు బీటెక్‌లోకి వెళ్లకుండా అడ్డుకోవటం సరికాదన్నారు

# ఖనిజాలను వెలికితీద్దాం.. దేశ సంపదను పెంచుదాం

బెంగుళూరు(జనంసాక్షి):కర్ణాటకలోని దేవదుర్గ గని నుంచి పెద్ద ఎత్తున బంగారం, రాగి ఖనిజాలను వెలికితీసి దేశ సంపదను పెంపొందించడానికి మనమందరం కలిసికట్టుగా కృషి చేద్దామని తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు.రాయచూరు జిల్లా, దేవదుర్గ తాలూకా లింగదహళ్ళి గ్రామంలో సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన కాపర్, గోల్డ్ మైనింగ్ అన్వేషణ కార్యక్రమాన్ని అధికారికంగా డిప్యూటీ సీఎం ప్రారంభించారు అనంతరం ఖనిజ అన్వేష ప్రదేశాలను ఆయన క్షేత్రస్థాయిలో స్వయంగా పరిశీలించారు. దాదాపు 136 సంవత్సరాల సుదీర్ఘ మైనింగ్ అనుభవం ఉన్న సింగరేణి కాలరీస్ సంస్థ, కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన టెండర్లలో దేవదుర్గ్ బ్లాక్ ఎక్స్‌ప్లోరేషన్ (అన్వేషణ) హక్కులను దక్కించుకున్న విషయాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తుచేశారు.ఈ క్షేత్రస్థాయి పరిశీలన అనంతరం ఆయన మాట్లాడుతూ, అన్వేషణ పనులను సింగరేణి సంస్థ త్వరలోనే వేగవంతం చేస్తుందని స్పష్టం చేశారు. ఈ ప్రాజెక్టు విజయవంతమై ఇక్కడ బంగారం, రాగి విరివిగా లభిస్తే ప్రాంతీయంగా నిరుద్యోగ యువతకు పెద్ద ఎత్తున ఉపాధి లభించడమే కాకుండా ఈ ప్రాంతం శీఘ్రగతిన అభివృద్ధి చెందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. పనుల పర్యవేక్షణ కోసం అధికారులు ఇక్కడే ఉండేలా సింగరేణి ఆధ్వర్యంలో త్వరలోనే ఒక సైట్ ఆఫీస్‌ను, అలాగే రాకపోకల సౌకర్యార్థం హెలిప్యాడ్‌ను కూడా ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. స్థానిక రెవెన్యూ అధికారులు స్థలాన్ని కేటాయించిన వెంటనే ఈ నిర్మాణ పనులు ప్రారంభమవు తాయన్నారు.అలాగే, కృష్ణానదికి ఇరువైపులా ఉన్న తెలుగు, కర్ణాటక ప్రజల మధ్య విడదీయరాని చారిత్రక, సాంస్కృతిక బంధం ఉందని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. ఒకప్పుడు ఈ ప్రాంతం హైదరాబాద్ రాష్ట్రంలోనే భాగమైనందున మన మూలాలు ఒక్కటేనని గుర్తుచేశారు., స్థానిక ప్రజల అండదండలతో ఈ ప్రాజెక్టును త్వరలోనే విజయవంతంగా పూర్తి చేసి దేశ సంపదను పెంచడానికి ఉపయోగపడదామని పిలుపునిచ్చారు. ఈ అన్వేషణ రెండు రాష్ట్రాల పురోగతికి, దేశ ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి ఎంతగానో దోహదపడుతుందని ఆకాంక్షించారు.దేవదుర్గ ప్రాంతంతో తనకు ప్రత్యేక అనుబంధం ఉందని సింగరేణి సిఎండి డాక్టర్ బుద్ధ ప్రకాష్ జ్యోతి అన్నారు. ఈ ప్రాంతంలో గతంలో సిఐగా పని చేసిన పని చేశానని ప్రస్తుతం సింగరేణి సంస్థ చైర్మన్ డైరెక్టర్ గా ఇక్కడ బంగారం రాగి కనీసం పనులను స్థానికుల సమక్షంలో ప్రారంభించుకోవడం ఆనందంగా ఉందన్నారు ఈ పరమానంద స్వామి గుట్ట పరమానంద స్వామి ఆశీస్సులతో ఇక్కడ బంగారు నిక్షేపాలు లభించాలని స్థానికులకు ఉపాధి అవకాశాలు కలగాలని ఆకాంక్షించారు

రాయచూర్ లో బంగారం, రాగి ఖనిజ బ్లాకును పరిశీలించిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

లింగదహళ్ళి గ్రామానికి చేరుకున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు కర్ణాటక మాజీ మంత్రి బోసురాజు తనయుడు, కాంగ్రెస్ నాయకుడు రవి బోసురాజు మరియు స్థానిక సర్పంచ్ ఎల్లమ్మ తదితరులు ఘనంగా స్వాగతం పలికారు. పర్యటనలో భాగంగా లింగదహళ్ళిలోని దేవదుర్గ బంగారు ఖనిజ బ్లాక్ వ్యూ పాయింట్ నుంచి ఖనిజ అన్వేషణ చేపట్టనున్న ప్రాంతాలను ఉప ముఖ్యమంత్రి క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం అక్కడి బ్లాక్ నుంచి సింగరేణి అధికారులు సేకరించిన వివిధ రకాల ఖనిజ నమూనాలతో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను తిలకించారు. ఈ సందర్భంగా అక్కడ నిర్వహించబోయే బంగారం, రాగి వెలికితీత, అన్వేషణ ప్రక్రియల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సింగరేణి అధికారులు మరియు కర్ణాటక రాష్ట్ర అధికార యంత్రాంగంతో డిప్యూటీ సీఎం సమీక్షా సమావేశం నిర్వహించి ఖనిజ అన్వేషణపై దిశా నిర్దేశం చేశారు. క్షేత్రస్థాయి పర్యటన ముగించుకుని లింగదహళ్ళి గ్రామంలోని చారిత్రక నేపథ్యం కలిగిన శ్రీ పరమానంద శివాలయాన్ని దర్శించుకున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అక్కడ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సింగరేణి సంస్థ ఛైర్మన్ మరియు ఎండీ డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి, డైరెక్టర్ సీకే వెంకటేశ్వర్లు, జీఎం పంకజ్ కుల శ్రేష్ట, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల ప్రజాప్రతినిధులు, సింగరేణి ఉన్నతాధికారులు మరియు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## మరో 25 ఏళ్లపాటు లోక్‌సభ స్థానాలు మార్చొద్దు

సంబంధించిన సవరించిన బిల్లును మళ్లీ ప్రవేశపెట్టనున్నారనే వార్తల నేపథ్యంలో కాంగ్రెస్ అధ్యక్షుడు, రాజ్యసభలో ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే ప్రధాని నరేంద్ర మోదీకి లేఖ రాశారు. రాష్ట్రాల వారీగా ఉన్న లోక్‌సభ స్థానాల్లోనూ ఎలాంటి మార్పులు చేయొద్దని సూచించారు. డీలిమిటేషన్ దేశ రాజకీయాలపై తీవ్ర ప్రభావం చూపే అత్యంత కీలకమైన విషయమని తెలిపారు. దీనిపై నిర్ణయం తీసుకునే ముందు అన్ని రాజకీయ పార్టీలతో అఖిలపక్ష సమావేశం నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రాల అభిప్రాయాలకూ ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. 2029 లోక్‌సభ ఎన్నికల నుంచే మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని ఖర్గే డిమాండ్ చేశారు. మహిళా రిజర్వేషన్ చట్టాన్ని వెంటనే అమల్లోకి తెచ్చేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. జనాభా నియంత్రణకు కృషి చేసిన రాష్ట్రాలకు అన్యాయం జరగకుండా రాజ్యాంగపరమైన రక్షణ కల్పించాలని పేర్కొన్నారు. డీలిమిటేషన్‌పై ఏకపక్ష నిర్ణయాలు తీసుకోకుండా విస్తృత రాజకీయ సంప్రదింపులు జరపాలన్నారు. డీలిమిటేషన్ ప్రతిపాదనలపై చర్చించేందుకు సర్వపక్ష సమావేశం నిర్వహించాలని, రాజకీయ పార్టీలు ప్రతిపాదనలను సమగ్రంగా పరిశీలించేందుకు తగిన సమయం ఇవ్వాలని ఆయన కోరారు. రాజ్యాంగ (131వ సవరణ) బిల్లు, 2026 ఏప్రిల్ 17వ తేదీన లోక్‌సభలో అవసరమైన మూడింట రెండొంతుల మెజారిటీని సాధించలేక పోయిందని పేర్కొన్నారు. అటువంటి విధానాన్ని మళ్లీ పునరావృతం చేయవద్దని కోరారు. 2029 లోక్‌సభ ఎన్నికల నుంచే మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని స్పష్టం చేశారు. ప్రస్తుతమున్న 543 లోక్‌సభ స్థానాల సంఖ్యను పెంచే ఎలాంటి నిర్ణయానికైనా కాంగ్రెస్, విపక్ష కూటమి మద్దతు ఇవ్వబోదని ఖర్గే తేల్చి చెప్పారు. లోక్‌సభ స్థానాలను పెంచేందుకు కేంద్రం ప్రయత్ని స్తోందని, ఇది కేవలం రాజకీయ ప్రయోజనాల కోసమేనని ఆరోపించారు. మహిళలకు చట్టసభల్లో కల్పించే 33 శాతం రిజర్వేషన్లను డీలిమిటేషన్ ప్రక్రియతో ముడిపెట్టడాన్ని ఖర్గే తప్పుపట్టారు. ఈ అంశంపై తాను గతంలో జులై 16న కూడా లేఖ రాశానని, కానీ ప్రభుత్వం నుంచి ఎలాంటి సానుకూల స్పందన రాకపోవడంతో తాజా పరిణామాల నేపథ్యంలో మోదీకి మళ్లీ లేఖ రాయాల్సి వచ్చిందని ఖర్గే పేర్కొన్నారు.

## పెళ్లి చేసుకున్నంత మాత్రాన భార్య బానిస కాదు

**కర్ణాటక హైకోర్టు సంచలన వ్యాఖ్యలు**

**బెంగళూరు(జనంసాక్షి):** వివాహ బంధంలో భార్యపై భర్త ఆధిపత్యం చెలాయించకూడదని కర్ణాటక హైకోర్టు స్పష్టం చేసింది. పెళ్లి చేసుకున్నంత మాత్రాన భార్య ఇంటి పనులు చేయాలి, అత్తమామలను తప్పనిసరిగా చూసుకోవాలి, పుట్టింటికి వెళ్లాలంటే భర్త అనుమతి తీసుకోవాలనే నిబంధన ఏదీ లేదని పేర్కొంది. వివాహం అంటే పరస్పర గౌరవం, నమ్మకం, సమానత్వంతో కొనసాగాల్సిన బంధమని కోర్టు వ్యాఖ్యానించింది. జస్టిస్ చిల్లకూరు సుమలత ధర్మాసనం ఈ అంశంపై కీలక వ్యాఖ్యలు చేసింది. మహిళల వ్యక్తిగత స్వేచ్ఛ, ఆత్మగౌరవాన్ని కాపాడాల్సిన అవసరాన్ని కోర్టు తన తీర్పులో ప్రస్తావించింది.బెంగళూరు రూరల్ జిల్లాకు చెందిన సతీష్ అనే వ్యక్తి తన భార్య, కుమార్తెకు కుటుంబ న్యాయస్థానం నెలకు రూ.9,000 చొప్పున భరణం చెల్లించాలని ఇచ్చిన ఆదేశాలను సవాల్ చేస్తూ హైకోర్టును ఆశ్రయించాడు. తన భార్య ఇంటి పనులు చేయడం లేదని, తన తల్లిదండ్రులను పట్టించుకోవడం లేదని, తన అనుమతి తీసుకోకుండానే తరచూ పుట్టింటికి వెళ్తోందని అతడు పిటిషన్‌లో పేర్కొన్నాడు. ఈ వాదనలపై కోర్టు తీవ్రంగా స్పందించింది. భర్త చేసిన ఆరోపణలను పరిశీలిస్తే భార్యను కుటుంబ సభ్యురాలిగా కాకుండా ఇంటి పనుల కోసం ఉంచుకున్న వ్యక్తిగా భావిస్తున్నట్లు కనిపిస్తోందని వ్యాఖ్యానించింది. భార్య తన తల్లిదండ్రులను కలవడానికి పుట్టింటికి వెళ్లాలంటే భర్త లేదా అత్తమామల అనుమతి తీసుకోవాలనే ఆలోచనను కోర్టు ప్రశ్నించింది. ఒక మహిళ తన తల్లిదండ్రులను కలవడానికి ఎవరి అనుమతి తీసుకోవాల్సిన అవసరం లేదని స్పష్టం చేసింది. భార్య ఎక్కడికి వెళ్లాలి, ఎవరిని కలవాలి అనే విషయాలను పూర్తిగా భర్త నియంత్రించడం సరైన పద్ధతి కాదని కోర్టు పేర్కొంది. ఇలాంటి ఆంక్షలు మహిళ వ్యక్తిగత స్వేచ్ఛను దెబ్బతీసే అవకాశం ఉందని అభిప్రాయపడింది. ఇంటి పనులన్నీ భార్యే చేయాలనే భావన సరికాదని హైకోర్టు స్పష్టం చేసింది. కుటుంబ జీవితంలో భార్యాభర్తలు ఇద్దరూ బాధ్యతలను పరస్పరం పంచుకోవాలని పేర్కొంది. అలాగే వృద్ధ తల్లిదండ్రులను చూసుకోవాల్సిన బాధ్యత ప్రధానంగా వారి సొంత పిల్లలపై ఉంటుందని కోర్టు తెలిపింది. అత్తమామలను చూసుకోవడాన్ని కోడలిపై తప్పనిసరి బాధ్యతగా మోపడం సమంజసం కాదని స్పష్టం చేసింది.

## మీర్ ఆలమ్ చెరువును పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలి

- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశం
- రూ.430 కోట్లతో నిర్మిస్తున్న ఐకానిక్ బ్రిడ్జి పనుల పరిశీలన





**రాజేంద్రనగర్,ఆగస్టు27(జనంసాక్షి) :** మీర్ ఆలమ్ చెరువును పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. గురువారం ఆయన అధికారులతో మీరాలం చెరువును సందర్శించారు. మీర్ ఆలమ్ చెరువు పై రూ.430 కోట్లతో నిర్మిస్తున్న ఐకానిక్ బ్రిడ్జి పనులను ముఖ్యమంత్రి పరిశీలించారు. చింతల్‌మెట్ మీర్ ఆలమ్ పార్కు నుంచి మీర్ ఆలమ్ చెరువు మీదుగా శాస్త్రిపురం చౌరస్తా వరకు నిర్మిస్తున్న ఈ బ్రిడ్జికి 58 పిల్లర్లు ఏర్పాటు చేయనుండగా, ఇప్పటికే 33 పిల్లర్లకు ఫౌండేషన్ పనులు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి అధికారులను పలు అంశాలపై ఆదేశించారు. చెరువును పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని, చెరువులోకి మురుగు నీరు చేరకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. గుర్రపు డెక్క పెరగకుండా ఎప్పటికప్పుడు తొలగించాలని, చెరువు మధ్యలోని ఐలాండ్లను గార్డెనింగ్, లైటింగ్, థీమ్ పార్కులతో అభివృద్ధి చేయాలని ఆదేశించారు. చింతల్‌మెట్ నుంచి కిషన్‌బాగ్ వరకు రహదారిని విస్తరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జలమండలి మేనేజింగ్ డైరెక్టర్ అశోక్ రెడ్డి, మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఎంఆర్ఎఫ్‌డీసీఎల్) మేనేజింగ్ డైరెక్టర్ ఈవీ నరసింహ రెడ్డి, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి, ఎంఆర్ఎఫ్‌డీసీఎల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సోలిపేట శ్రీనివాస్ రెడ్డి, జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ గౌతమి, ముఖ్యమంత్రి కార్యాలయ కార్యదర్శి మాణిక్య రాజ్ తదితరులు పాల్గొన్నారు. ఐకానిక్ బ్రిడ్జి నిర్మాణ పనుల పురోగతిని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు.

# ఎంజీఎం ఆసుపత్రిలో రోగుల వెతలు!

- చేతులే సెలైన్ బాటిల్ స్టాండ్లు
- సేవలు అద్వాన్నం..!
- రోగులబు పడుతున్న ఇబ్బందులు
- అధికారులు పట్టించుకోవాలని వేడుకోలు



**వరంగల్ బ్యూరో, ఆగస్టు 27 (జనం సాక్షి) :** ఉత్తర తెలంగాణకే పెద్ద దిక్కుగా ఉన్న వరంగల్ మహాత్మా గాంధీ మెమోరియల్ హాస్పిటల్ (ఎంజీఎం) లో రోగులకు అందించే సేవలు రోజురోజుకు అధ్వానంగా మారుతున్నాయి. నిత్యం పేద ప్రజలు వైద్యం కోసం వచ్చే ఎంజీఎం హాస్పిటల్ సరైన వైద్య సేవలు అందకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్న పరిస్థితి ఏర్పడుతుంది. తరచుగా వరంగల్ జిల్లా కలెక్టర్ తో పాటు, ఇతర వైద్యాధికారులు, ఎంజీఎం వైద్యులు వైద్యాధికారులు పర్యవేక్షణ చేస్తున్న కూడా మార్పు రావడం లేదు. దీంతో సర్కార్ దవాఖానకు రోగులు రావాలంటేనే భయపడుతున్న పరిస్థితి ఏర్పడుతుంది. తాజాగా వరంగల్ ఎంజీఎం ఆసుపత్రిలో స్ట్రెచర్ అందుబాటులో లేకపోవడం, లేదా స్ట్రెచార్ పైన తీసుకుపోయేవాళ్లు లేకపోవడం వల్లనేమో ఓ తల్లి తన కూతురికి సెలైన్ ఎక్కించే క్రమంలో చేతిలో సెలైన్ బాటిల్ పట్టుకొని డాక్టర్ వద్దకు వెళ్లే దృశ్యాలు కనిపించాయి. అదేవిధంగా కొందరు వృద్ధులు కూడా ఓ చేత్తో సెలైన్ బాటిల్ పట్టుకొని కూర్చున్న దృశ్యాలు, అలాగే సెలైన్ స్టాండ్లు లేకపోవడంతో కిటికీ కట్టుకొని సెలైన్ ఎక్కించుకునే పరిస్థితి కనిపించింది. ఈ ఒక్క సమస్య కాకుండా నడవలేని స్థితిలో ఉన్నటువంటి రోగులను ఏదైనా టెస్టుల కోసం సంబంధిత గదులకు తీసుకెళ్లాలని అనుకుంటే సంబంధిత సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో రోగుల బంధువులే స్టట్చర్ మీద తీసుకెళ్లి తిరిగి తమ వార్డుల్లోకి తీసుకొచ్చే పరిస్థితి కనిపిస్తుంది. అంతేకాకుండా ఆయా వార్డుల్లో టాయిలెట్స్ బాత్రూంలో పారిశుధ్యం సరిగా లేకపోవడంతో కానంగా తయారయ్యాయి. ఇక పిల్లల వార్డులో పరిస్థితి చెప్పలేం. ఒక్కో సందర్భంలో ఒక బెడ్ మీద ఇద్దరు ముగ్గురు పిల్లల్ని పెట్టి వైద్యం చేసే పరిస్థితి కనిపిస్తుంది. అదేవిధంగా ఓపిక వచ్చినటువంటి రోగులు ఆయా వైద్యుల గదుల వద్ద వద్ద గంటల తరబడి ఉండే పరిస్థితి కనిపిస్తుంది. ఈ విషయంలో వృద్ధులు ఎక్కువగా ఇబ్బందులు పడడం జరుగుతుంది. ఇక ఎమర్జెన్సీ వార్డులో పరిస్థితి అయోమయంగా ఉంటుంది. అటు అత్యవసర సేవలు పొందుతున్న పేషెంట్లు, కొత్తగా వస్తున్న ఎమర్జెన్సీ కేసులు, అటు వైద్యులు ఇటు నర్సులు ఇరుకైనటువంటి వార్డులో అంతా గందరగోళంగా కనిపిస్తుంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, వైద్యులు సర్కార్ దవాఖాన పై నమ్మకం కలిగేలా వైద్య సేవలు అందించాలని రోగులు, రోగుల బంధువులు, ప్రజలు కోరుతున్నారు.

## హనుమకొండ కలెక్టరేట్‌లో తీవ్ర ఉద్రిక్తత

- టీఎన్జీవోల ఆందోళనకు మద్దతు.. హరీష్ రావు అరెస్ట్
- పాలిటెక్నిక్ కాలేజీలు ప్రభుత్వంలోనే కొనసాగాలి
- అక్రమ అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరు : హరీష్ రావు





హనుమకొండ ప్రతినిధి ఆగస్టు 27 (జనం సాక్షి) : హనుమకొండ కలెక్టరేట్ వద్ద టీఎన్జీవోలు చేపట్టిన ఆందోళనకు మద్దతుగా మాజీ మంత్రి శాసనసభ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీష్ రావు పాల్గొన్నారు హరీష్ రావు రాకతో బిఆర్ఎస్ నేతలు పెద్ద ఎత్తున నినాదాలు చేయడంతో హనుమకొండ కలెక్టరేట్ వద్ద మాజీ మంత్రి,శాసనసభ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, బీఆర్ఎస్ నేత హరీష్ రావును పోలీసులు అరెస్ట్ చేశారు. ఆయనతో పాటు ఆందోళనకు మద్దతుగా అక్కడికి చేరుకున్న పలువురు ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులు, ఎంపీలు, బీఆర్ఎస్ నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలతో పాటు తెలంగాణ రాష్ట్ర రైతు రుణ విమోచన కమిషన్ మాజీ చైర్మన్ పోలీసులు అరెస్ట్ చేశారు. టీఎన్జీవోల డిమాండ్లకు మద్దతు తెలుపుతూ నాయకులు కలెక్టరేట్ వద్ద తమ అభిప్రాయాలను వెల్లడించారు.ఆందోళన నేపథ్యంలో కలెక్టరేట్ పరిసరాల్లో పోలీస్ లు భారీగా బందోబస్తు ఏర్పాటు చేశారు. నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకుని అక్కడి నుంచి పోలీస్ స్టేషన్ తరలించారు. దీంతో కలెక్టరేట్ పరిసరాల్లో కొంతసేపు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.టీఎన్జీవోల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని, ఉద్యోగుల డిమాండ్లపై సానుకూలంగా స్పందించాలని నాయకులు డిమాండ్ చేశారు. అరెస్టులను బీఆర్ఎస్ నాయకులు ఖండించారు. ఈ సందర్భంగా హరీష్ రావు మాట్లాడుతూ ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తున్న ప్రతిపక్షాన్ని ఈ కాంగ్రెస్ ప్రభుత్వం అణిచివేయాలని చూస్తోంది అని మండిపడ్డారు పాలిటెక్నిక్ ను స్కిల్ యూనివర్సిటీలో కలిపితే చూస్తూ ఊరుకునేది లేదు అని ఆగ్రహం వ్యక్తం చేశారు ఇప్పటికే విద్యార్థుల ఉద్యోగుల జీవి తాల తో ఆడుకుంటున్న రేవంత్ రెడ్డి వారి చేతి లోనే పతనం ఖాయమని హెచ్చరించారు.

## చమురు సంస్థల కార్యకలాపాలు మరింత విస్తరించాలి

- బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ లీడర్ వద్దిరాజు రవిచంద్ర
- అధ్యయన యాత్రలో భాగంగా సీపీసీఎల్ సందర్శన



**న్యూఢిల్లీ (జనంసాక్షి) :** చమురు సంస్థలు తమ కార్యకలాపాలను మరింత విస్తరించే దిశగా తగు చర్యలు తీసుకోవాల్సిందిగా బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ లీడర్ వద్దిరాజు రవిచంద్ర సంబంధిత అధికారులను కోరారు. పెట్రోలియం, సహజవాయువు శాఖ పార్లమెంటరీ స్థాయీ సంఘం అధ్యయన యాత్ర గురువారం తమిళనాడు రాజధాని చెన్నై,ఆ తర్వాత దాని సమీపాన ఉన్న మణలిలో కొనసాగింది. ఈ సందర్భంగా జరిగిన సమావేశాలలో ఎంపీ రవిచంద్ర మాట్లాడుతూ, దేశంలోని వినియోగదారుల భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని,ఉద్యోగ,ఉపాధి అవకాశాలను పెంపొందించేందుకు గాను తమ కార్యకలాపాల విస్తరణతో పాటు ప్రాంతీయ కార్యాలయాల సామర్థ్యాన్ని పెంచే విధంగా ప్రణాళికలు రూపొందించాల్సిందిగా సలహాలిచ్చారు. తమ అధ్యయన యాత్రలో భాగంగా స్థాయీ సంఘం సభ్యులు గురువారం మధ్యాహ్నం మణలిలోని చెన్నై పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (సీపీసీఎల్) ప్రధాన రిఫైనరీని సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులు దాని కార్యకలాపాలు,పనితీరు గురించి సభ్యులకు వివరించారు. సందర్భంగా ఎంపీ రవిచంద్ర చమురు సంస్థలు వినియోగదారులకు నాణ్యతా ప్రమాణాలతో కూడిన సత్వర సేవలందించేందుకు, కార్యకలాపాల విస్తరణతో పాటుగా సామర్థ్యాన్ని మరింత మెరుగు పర్చుకునేందుకు ప్రాధాన్యత ఇవ్వాల్సిందిగా అధికారులకు పలు సూచనలు చేశారు,సలహాలిచ్చారు. అధికారులు ఎంపీ వద్దిరాజుకు పూలమాల వేసి కండువాలతో సత్కరించి జ్ఞాపికలు ప్రదానం చేశారు. స్థాయీ సంఘం అధ్యయన యాత్ర ఈనెల 21వతేదీన మహారాష్ట్రలోని రాయ్ గఢ్ జిల్లా ఉరాన్ వద్ద ప్రారంభమై,అటు తర్వాత ముంబాయి,ఊటీ,చెన్నైలలో కొనసాగి గురువారం మణలిలోని సీపీసీఎల్ సందర్శనతో ముగిసింది.

### రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు

రాఖీ పౌర్ణమి (శ్రావణ పున్నమి) సందర్భంగా అక్కాతమ్ముళ్లు,అన్నాచెల్లెళ్లకు బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ లీడర్ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి ఏటా శ్రావణ మాసంలో వచ్చే పౌర్ణమి రోజున ఈ పండుగను దేశమంతటా ఘనంగా జరుపుకుంటారని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాఖీ పౌర్ణమి అనేది అక్కాతమ్ముళ్లు, అన్నాచెల్లెళ్ల మధ్య ఉన్న ప్రేమానురాగాలు,రక్షణకు ప్రతీకగా జరుపుకునే అత్యంత ముఖ్యమైన హైందవ పండుగ అని ఎంపీ రవిచంద్ర చెప్పారు.





## మహాధర్నాకు నాయకుల హాజరు

**కరీంనగర్ (జనంసాక్షి) :** కరీంనగర్‌లో నిర్వహిస్తున్న మహాధర్నా కార్యక్రమానికి టీఎన్‌జీఆర్ఈఏ జిల్లా అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు మహమ్మద్ ఉస్మాన్ పాషా , జాలి మహేందర్ రెడ్డి హాజరయ్యారు. ఉద్యోగుల ఉపాధ్యాయ పెన్షనర్ల సమస్యల పట్ల ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ రాష్ట్రవ్యాప్తంగా టీజీజేఏసీ ఆధ్వర్యంలో 206 సంఘాలు నిర్వహిస్తున్న ధర్నా కార్యక్రమం విజయవంతమైనది. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి పెండింగ్ లో ఉన్న 6 డిఎలను, పిఆర్‌సిను వెంటనే అమలు చేయాలని, పదవీ విరమణ పొందిన ఉద్యోగుల బకాయిలను వెంటనే చెల్లించాలని, హెల్త్ కార్డులను వెంటనే జారీ చేయాలని, అన్ని కార్పొరేట్ ఆస్పత్రుల్లో వైద్య సౌకర్యం కల్పించాలని, లేకుంటే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామన్నారు.

### అధిక లాభాలు ఇస్తానని మోసం

- పెట్టుబడి పెట్టించుకుని మోసం చేసిన వ్యక్తి అరెస్టు

**పెద్దవంగర ఆగస్టు 27(జనం సాక్షి) :** మండలంలోని గంట్లకుంట గ్రామానికి చెందిన నిందితుడు బండి సతీష్ తండ్రి బుచ్చి రాములు అను వ్యక్తి, తనకు హనుమకొండలో ఎస్ ఎల్ ఏ ఇంఫ్రాస్ట్ర అని రియల్ ఎస్టేట్ కంపెనీకి చెందిన గుంట శివప్రసాద్, దాసరి అశోక్ లు తెలుసు అని, వారి కంపెనీలో పెట్టుబడి పెడితే రెండు సంవత్సరాలు 10 శాతం ఇంట్రెస్ట్ తో వడ్డీ ఇప్పిస్తానని, రెండు సంవత్సరాల తర్వాత మీ అసలు మీకు ఇప్పిస్తామని మాయమాటలు చెప్పి నమ్మించి పెద్ద వంగర మండలం అమర్ సింగ్ తండా రామోజీ తండా కు చెందిన జాటోతు రవి,వద్ద 14 లక్షలు, గంట్ల కుంట గ్రామానికి చెందిన చింతల శారద భర్త మహేందర్ 5 లక్షలు పెట్టుబడి పెట్టించి వారికి ఎటువంటి లాభాలు ఇవ్వకుండా, అసలు ఇవ్వమని చెప్పిన కూడా నాన్న ఇబ్బందులకు గురిచేస్తున్న పై ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసి గంట్ల కుంటా గ్రామానికి చెందిన ఏ1 బండి సతీష్ ను అరెస్ట్ చేసి రిమాండ్ తరలించామని ఎస్సై ప్రమోద్ కుమార్ గౌడ్ తెలిపారు.


## తెలంగాణ యువజన సంఘం ఉచిత హెల్త్ క్యాంప్‌నకు విశేష స్పందన



**సూర్యాపేట (జనంసాక్షి) :** సూర్యాపేట జిల్లా తిరుమలగిరి మండలం తొండ గ్రామంలో తెలంగాణ యువజన సంఘం ఆధ్వర్యంలో సింధు హాస్పిటల్ సహకారంతో హెల్త్ క్యాంప్ నిర్వహించారు. ఈ హెల్త్ క్యాంప్ కి ప్రజల నుంచి విశేష స్పందన లభించిందని సింధు వైద్యశాల వైద్యుల బృందం తెలిపారు. తెలంగాణ యువజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనంతుల మధు, సింధు హాస్పిటల్ (హైదరాబాద్) చైర్మన్ బండి పార్థ సారథి రెడ్డి సహకారంతో తెలంగాణ యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన హెల్త్ క్యాంప్‌లో వైద్యుల బృందం క్యాన్సర్, కార్డియాక్, గైనిక్ తదితర సమస్యలతో పాటు వివిధ రకాల వైద్య పరీక్షలు ఉచితంగా నిర్వహించారు. ఉచిత హెల్త్ క్యాంప్ కి హాజరైన వారందరికీ అన్ని పరీక్షలు పూర్తి చేసినమని ఇంకా ఏమైనా సమస్యలుంటే సింధు వైద్యశాల హైదరాబాద్ వారిని సంప్రదించాలని ఇంత మంచి అవకాశాన్ని పేదలకు అందించిన తెలంగాణ యువజన సంఘము కమిటీ సభ్యులను హాస్పిటల్ వైద్య బృందం గ్రామ ప్రజలు అభినందించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బాషామల్ల స్వాతి భాస్కర్, తెలంగాణ యువజన సంఘము సూర్యాపేట జిల్లా అధ్యక్షులు పోరెళ్ల విప్లవ్ కుమార్, సింధు హాస్పిటల్ (హైదరాబాద్ )వైద్యులు కోటిరెడ్డి, హానిష, శ్రీ రామ్ మార్కెటింగ్ మేనేజర్ విజయ్, ఉప సర్పంచ్ గొలుసుల వెంకటయ్య పంచాయతీ కార్యదర్శి యాకూబ్ రెడ్డి, గ్రామ పరిపాలన అధికారి ఇస్మాయిల్, వార్డు సభ్యులు నవీన్, నాయకులు నాగులగాని హరీష్,అనగందుల సంపత్ తదితరులు పాల్గొన్నారు..

## రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కానిస్టేబుల్ కుటుంబానికి రూ.95 లక్షల బీమా పరిహారం

- డీజీపీ సీవీ ఆనంద్ చేతుల మీదుగా కుటుంబ సభ్యులకు అందజేత



**హైదరాబాద్ ఆగస్టు 27 (జనంసాక్షి) :** విధి నిర్వహణ అనంతరం రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన మల్కాజిగిరి కమిషనరేట్‌కు చెందిన కానిస్టేబుల్ కంబాల శంకర్ కుటుంబానికి రూ.95 లక్షల బీమా పరిహారాన్ని గురువారం డీజీపీ సీవీ ఆనంద్ చేతుల మీదుగా కానిస్టేబుల్ కుటుంబ సభ్యులకు అందించారు. మల్కాజిగిరి కమిషనరేట్‌లో ఏఆర్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న కంబాల శంకర్ (31) మార్చి 28న విధులు ముగించుకుని ద్విచక్ర వాహనంపై ఇంటికి వెళ్తుండగా వాడపర్తి గ్రామం వద్ద అదుపుతప్పి ప్రమాదానికి గురయ్యారు. తీవ్ర గాయాలతో తొలుత ఎయిమ్స్‌కు, అనంతరం సికింద్రాబాద్ యశోద ఆసుపత్రికి తరలించగా.. మార్చి 31న మృతి చెందారు. శంకర్ జీతం బ్యాంక్ ఆఫ్ బరోడా పోలీస్ శాలరీ ప్యాకేజీ ఖాతాలో జమయ్యేది. ప్రమాదంపై బ్యాంకుకు సమాచారం అందడంతో బీమా క్లెయిమ్ ప్రక్రియ చేపట్టారు. జీటీఎల్ కింద రూ.15 లక్షలు, గ్రూప్ పర్సనల్ యాక్సిడెంట్ (జీపీఏ) కింద రూ.80 లక్షలు కలిపి మొత్తం రూ.95 లక్షల పరిహారం మంజూరైంది. ఈ కార్యక్రమంలో ఐజి వెల్ఫేర్ గజరావు భూపాల్, బ్యాంక్ ఆఫ్ బరోడా జనరల్ మేనేజర్, జోనల్ హెడ్ ఎం.వి.ఎస్. సుధాకర్, ఎస్ కె ప్రసాద్, రవి పాల్గొనగా, రూ.95 లక్షల చెక్కును డీజీపీ సి.వి. ఆనంద్ చేతుల మీదుగా మృతుడి తల్లిదండ్రులకు అందజేశారు.

## గణేష్ ఉత్సవాలను పర్యావరణహితంగా నిర్వహించాలి

- హైదరాబాద్‌లో లక్ష మట్టి విగ్రహాలు ఉచితం

**హైదరాబాద్, ఆగస్టు 27 (జనంసాక్షి) :** గణేష్ ఉత్సవాలను పర్యావరణహితంగా నిర్వహించాలని జీహెచ్ఎంసీ పిలుపునిచ్చింది. ఇందులో భాగంగా ఈ ఏడాది మొత్తం లక్ష మట్టి వినాయక విగ్రహాలను.. నగరవ్యాప్తంగా ఉచితంగా అందజేసేందుకు ఏర్పాట్లు చేస్తోంది. నిమజ్జనం కారణంగా నీటి వనరుల్లో కాలుష్యాన్ని తగ్గించడమే లక్ష్యం. జీహెచ్ఎంసీ పరిధిలోని సర్కిల్, జోనల్ కార్యాలయాల ద్వారా సెప్టెంబర్ రెండో వారంలో ఈ మట్టి గణనాథులను అందుబాటులోకి తీసుకురావాలని అధికారులు నిర్ణయించారు. భక్తులతో పాటు కాలనీ సంక్షేమ సంఘాలు, గణేష్ మండపాల నిర్వాహకులు కూడా వీటిని పొందేందుకు అవకాశం కల్పించనున్నారు. మొత్తం లక్ష విగ్రహాలను మూడు సైజుల్లో సిద్ధం చేయనున్నారు. ఇందులో 70 వేల విగ్రహాలను 8 అంగుళాల ఎత్తులో.. 20 వేల విగ్రహాలను ఒక అడుగు ఎత్తులో, 10 వేల విగ్రహాలను 1.5 అడుగుల ఎత్తులో తయారు చేయనున్నారు.

## రైతుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యం

- ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్



**కామారెడ్డి, ఆగస్టు 27 (జనంసాక్షి) :** మాచారెడ్డి మండల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకారోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి తెలంగాణ ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ ముఖ్య అతిథిగా హాజరై నూతన పాలకవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నూతన ఛైర్మన్‌గా నౌసిలాల్ నాయక్ తోపాటు పాలకవర్గ సభ్యులు పమాణ స్వీకారం చేసి బాధ్యతలు స్వీకరించారు. అనంతరం మహమ్మద్ అలీ షబ్బీర్ మాట్లాడుతూ.రైతుల సంక్షేమమే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు. రైతు బాగుంటేనే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుందని, రైతులకు అవసరమైన రుణాలు, విత్తనాలు, ఎరువులు, ఇతర వ్యవసాయ సేవలు సకాలంలో అందించడంలో పీఏసిఎస్‌లు కీలక పాత్ర పోషించాలని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతుల ప్రయోజనాలకు పెద్దపీట వేస్తూ పలు కీలక కార్యక్రమాలను అమలు చేస్తోందని షబ్బీర్ అలీ తెలిపారు. రైతు భరోసా, పంట రుణమాఫీ, ఉచిత విద్యుత్, సాగునీటి వనరుల అభివృద్ధి, రైతు బీమా వంటి కార్యక్రమాలతో పాటు వ్యవసాయ రంగాన్ని మరింత బలోపేతం చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. మాచారెడ్డి పీఏసిఎస్ నూతన చైర్మన్ నౌసిలాల్ నాయక్‌కు ప్రత్యేకంగా అభినందనలు తెలిపిన షబ్బీర్ అలీ రైతులు పాలకవర్గంపై పెట్టిన నమ్మకాన్ని నిలబెట్టుకోవాలని, రాజకీయాలకు అతీతంగా ప్రతి రైతుకు సమానంగా సేవలు అందించాలని సూచించారు. సంఘంను ఆర్థికంగా బలోపేతం చేస్తూ రైతులకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు నూతన పాలకవర్గం సమష్టిగా కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాచారెడ్డి మాజీ ఎంపీపీ సురేష్ నర్సింగరావు, కామారెడ్డి మున్సిపల్ చైర్మన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ మద్ది చంద్రకాంత్ రెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి బద్దం ఇంద్రకరణ్ రెడ్డి, మాజీ డీసీసీ అధ్యక్షులు కైలాస్ శ్రీనివాస్, మాచారెడ్డి సర్పంచ్ సంతోష్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు బాలరాజు, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షులు రెడ్డి నాయక్, భిక్నూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ రాజు, తిప్పాపూర్ సొసైటీ చైర్మన్ భీంరెడ్డి, కామారెడ్డి సొసైటీ చైర్మన్ గూడెం శ్రీనివాస్ రెడ్డి, లక్ష్మారెడ్డి, చుక్కాపూర్ లక్ష్మీనర్సింహ ఆలయ చైర్మన్ కమలాకర్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు సుదర్శన్, కౌన్సిలర్ మోతిలాల్, డీసీసీ ఉపాధ్యక్షులు గంప ప్రసాద్, కామారెడ్డి పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు సందీప్, మాజీ సొసైటీ చైర్మన్లు పూల్ చంద్, స్వామిగౌడ్, రాజమౌళి, సత్యనారాయణ, బాలరాజుగౌడ్, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షులు రాజిరెడ్డి తదితర నాయకులు, కార్యకర్తలు, మహిళలు, రైతులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## మేమంతా క్షేమంగా ఉన్నాం: సతీష్ రెడ్డి

**హైదరాబాద్, ఆగస్ట్27 (జనంసాక్షి) :** భారీ వరదలతో నేపాల్ పరిసర ప్రాంతాలు అతలాకుతలం అవుతున్నాయి. ఈ వరదల వల్ల వంద మందికిపైగా మరణించారు. ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. ఇక వందలాది మంది గల్లంతయ్యారు. వారిలో విదేశీయులు కూడా ఉన్నారు. ఆ జాబితాలో భారతీయులు కూడా ఉన్నట్లు వార్తా కథనాలు వెలువడుతున్నాయి. దీంతో భారత్‌లోని వారి కుటుంబ సభ్యులు తీవ్ర కలత చెందుతున్నారు. భారత విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఇప్పటికే రంగంలోకి దిగి వారి ఆచూకీ కోసం చర్యలు చేపట్టింది. ఈ నేపథ్యంలో టిబెట్ పరిసర ప్రాంతాల్లో ఉన్న డీఆర్‌డీఓ మాజీ చైర్మన్ సతీష్ రెడ్డి స్పందించారు. ఆయన తాము క్షేమంగా ఉన్నామని, తాము వరదల్లో చిక్కుకోలేదన్నారు. తాము ఉన్న ప్రాంతంలో వరదల ప్రభావం లేదని తెలిపారు. తామంతా క్షేమంగా ఉన్నామని స్పష్టం చేశారు. ఆగస్టు 30వ తేదీన హైదరాబాద్ చేరుకుంటామని సతీష్ రెడ్డి చెప్పారు.

జనంసాక్షి
www.janamsakshi.org
శుక్రవారం
28 ఆగస్టు 2026

### చక్కెరతో సహా నిత్యావసరాలు ఆకాశంలో..

# ఇథనాల్ పెట్టిన చిచ్చేనా?

సంపాదకీయం

చక్కెర ధరలు మండిపోతున్నాయి.. నిత్యావసర ఆహార వస్తువుల ధరలు సామాన్యుడి నడుము విరుస్తున్నాయి. ఇంధనంలో ఇథనాల్ మిశ్రమం పెంచే విధానం అమలులోకి వచ్చినప్పటి నుంచీ ఆహార పంటలు ఇంధన తయారీకి మళ్లడం, దాని ప్రభావం ధరలపై పడుతుందన్న హెచ్చరికలు వినిపిస్తూనే ఉన్నాయి. ఇప్పుడు ఆ భయాలే నిజమవుతున్నాయా అన్న అనుమానం ప్రజల్లో బలపడుతోంది.

ఇథనాల్ ఉత్పత్తికి చెరకు, మొక్కజొన్న వంటి పంటలను పెద్ద ఎత్తున వినియోగించడం వల్ల ఆహార అవసరాలకు అందుబాటులో ఉండే పంటల పరిమాణం తగ్గే అవకాశం ఉందనే ఆందోళనలు ఉన్నాయి. ఒకవైపు పెట్రోల్‌లో ఇథనాల్ శాతం పెంచుతూ ఇంధన దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించాలని ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. మరోవైపు అదే విధానం ఆహార మార్కెట్‌పై ఒత్తిడి పెంచి ధరలను పెంచితే, లాభం కంటే నష్టం సామాన్యుడికే ఎక్కువయ్యే ప్రమాదం ఉంది.

చక్కెర ధరలు పెరిగిన ప్రతిసారీ దానికి ఇథనాల్ విధానమే కారణమని తేల్చడం శాస్త్రీయంగా సరైంది కాదు. ఉత్పత్తి, వాతావరణ పరిస్థితులు, మార్కెట్ డిమాండ్, ఎగుమతులు, ప్రభుత్వ నిర్ణయాలు వంటి అనేక అంశాలు ధరలను ప్రభావితం చేస్తాయి. కానీ ఇథనాల్ తయారీకి ఆహార పంటలను మళ్లించడం ధరలపై ఎంత ప్రభావం చూపుతోంది అన్న విషయాన్ని మాత్రం ప్రభుత్వం దాచిపెట్టకుండా ప్రజల ముందుంచాలి.

ఇదే సమయంలో ఇథనాల్ పరిశ్రమల నుంచి వెలువడే వ్యర్థాలు, వాటి వల్ల భూములు, నీటి వనరులు, స్థానిక పర్యావరణంపై పడే ప్రభావంపై రైతులు వ్యక్తం చేస్తున్న ఆందోళనలను కూడా విస్మరించలేం. హిమాచల్ ప్రదేశ్, తెలంగాణ వంటి రాష్ట్రాల్లో ఇథనాల్ పరిశ్రమలకు వ్యతిరేకంగా రైతులు, స్థానిక ప్రజలు ఆందోళనలు చేయడం పరిస్థితి తీవ్రతను తెలియజేస్తోంది.

ఇంధన స్వావలంబన దేశానికి అవసరం. రైతుకు అదనపు మార్కెట్ కూడా అవసరమే. కానీ ప్రజల కడుపు నింపే పంటను ఇంధనంగా మార్చే ముందు దాని సామాజిక ధరను కూడా లెక్కించాలి. పెట్రోల్ ధరను తగ్గించేందుకు తీసుకునే నిర్ణయం చివరకు వంటింటి ఖర్చును పెంచితే ఆ విధానాన్ని మరోసారి సమీక్షించాల్సిందే.

ఇథనాల్ వల్ల ధరలు ఎంత పెరిగాయి? ఆహార పంటలు ఎంత మేర ఇంధన తయారీకి మళ్లుతున్నాయి? పరిశ్రమల వ్యర్థాల వల్ల పర్యావరణానికి, ప్రజారోగ్యానికి ఎంత ప్రమాదం ఉంది? ఈ ప్రశ్నలకు ప్రభుత్వమే పారదర్శకమైన శాస్త్రీయ సమాధానాలు ఇవ్వాలి.

ఇంధనం కోసం ఆహార భద్రతను తాకట్టు పెట్టకూడదు. అభివృద్ధి పేరుతో రైతు భూమిని, ప్రజల నీటిని, సామాన్యుడి వంటింటిని బలిపెట్టకూడదు. పెట్రోల్‌లో ఇథనాల్ కలపడం అభివృద్ధికి సంకేతమే కావచ్చు.. కానీ దాని ధర సామాన్యుడి కడుపుపై పడితే మాత్రం ఆ విధానాన్ని ప్రశ్నించాల్సిందే.

## అలసిన అక్షరాలు

ఒక దేశంపై మరో దేశం
విజయకాంక్షతో పేల్చిన
బాంబుల శబ్దాలను
ఏ భాష అక్షరమాలలో
కూర్చగలను?
మిత్రదేశం శత్రుదేశమై
సాగించే ఆక్రమణ యుద్ధాలను
ఎన్ని అక్షరాల్లో లెక్కించను?
మనిషి నేర్చుకున్న
అమానవీయమైన ఆయుధ
హింసను
ఏ కొత్త లిపిలో రాయగలను?
అహంకార పాలకుల పాదాల
కింద నలిగిన కపాలాలకు
ఎన్ని పదాలతో
శవపేటికలు సిద్ధం చేయను?
యుద్ధానికి బందీలైన
బతుకులను,
విడిపోయిన ప్రేమలను
ఎన్ని పదబంధాలతో
కలపగలను?
ఎందరో కన్నతల్లుల
కడుపుకోతను ఎన్ని వాక్యాలతో
కన్నీటి కావ్యంగా
మలచగలను?
గుట్టలుగా పేరుకుపోయిన
శవాలను
ఏ కవి విజయగాథగా
రాయగలడు?
బాంబులు ఇళ్లను
కూల్చగలవు...
కానీ వాటి శిథిలాల్లో
మిగిలిన కన్నీళ్లను
ఏ ఆయుధం
తుడిచేయగలదు?
తల్లి ఒడిని ఖాళీ చేసి
బాల్యాన్ని అనాథగా మార్చే
ఈ యుద్ధంలో
ఎవరు గెలిచినట్టు?
బహుశా...
మూడో ప్రపంచ యుద్ధపు
చివరి మానవుడి
చావు ఆక్రందనతో
శూన్యంలో కలిసిపోయి
నా అలసిన అక్షరాలు
సేదతీరగలనేమో!
అంతకుముందే
మనిషి ఆగిపోవాలి...
తుపాకీని కిందపెట్టి
అక్షరాన్ని చేతిలోకి
తీసుకోవాలి.
ఎందుకంటే
యుద్ధం గెలిచిన దేశం కంటే
శాంతిని కాపాడిన మనిషే
నిజమైన విజేత.

నేపా సంతోష్ అచ్యుత్ కుమార్
అసిస్టెంట్ ప్రొఫెసర్
కాళోజీ ప్రతిభా పురస్కార గ్రహీత

# "కాక్రోచ్‌జనతా పార్టీ" భవిష్యత్తు ఎలా ఉండబోతోంది?



భారతదేశ రాజకీయ చరిత్రలో సామాజిక మాధ్యమాల ప్రభావం గురించి ఎన్నో విశ్లేషణలు వెలువడుతున్నాయి. ఇటీవలి కాలంలో మంచి ప్రాచుర్యం పొందిన 'కాక్రోచ్ జంటా పార్టీ' (సీజేపీ) ఈ ప్రభావానికి నిలువెత్తు ఉదాహరణ. అయితే, కేవలం వ్యంగ్యం, హాస్యం, అలాగే డిజిటల్ వేదికలతో మాత్రమే భారీ రాజకీయ శక్తిగా ఎదగడం ఎంతవరకు సాధ్యం అనేది ప్రశ్నార్థకం. ఈ అంశాన్ని స్థూలంగా పరిశీలిస్తే, ఒకవైపు నిరాశ మరియు అలసటతో ఉన్న యువతకు (సీజేపీ) ఒక వేదికగా నిలుస్తుండగా, మరోవైపు దీర్ఘకాలిక లక్ష్యాలు, సంస్థాగత నిర్మాణం, మరియు కుల రాజకీయాల వాస్తవాల ముందు ఈ ఉద్యమం తీవ్రమైన సవాళ్లను ఎదుర్కొంటోంది.

విద్యార్థుల దురవస్థలను నేరుగా వీడియోలుగా చిత్రీకరించి, సామాజిక మాధ్యమాల్లోకి విడుదల చేయడం ద్వారా ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకురావడం (సీజేపీ) యొక్క ప్రధాన వ్యూహం. 'స్కూల్ టీక్ కరో' వంటి క్యాంపెయిన్ల ద్వారా వారు అర్హులైన విద్యార్థులకు ప్రభుత్వ పాఠశాలల్లో చేరడానికి, మౌలిక సదుపాయాల్లో లోటును ఎత్తి చూపడానికి ప్రయత్నిస్తున్నారు. పాఠశాలల్లో తాగునీరు, మరుగుదొడ్లు, పుస్తకాలు లేకపోవడం వంటి చిన్న చిన్న సమస్యల్ని కూడా వారు రాజకీయ ప్రశ్నగా మార్చారు. విద్యార్థుల కష్టాల పట్ల ప్రభుత్వ ఉదాసీనతను బహిర్గతం చేయడంలో ఈ పార్టీ చాలా వరకు విజయం సాధించింది. ముఖ్యంగా పరీక్షల రద్దు, ఉద్యోగాల కల్పన వంటి అంశాల్లో వారు చేసిన పోరాటాలు విద్యార్థుల నుంచి గణనీయమైన మద్దతు పొందాయి. అయితే, ఈ విజయాలు కేవలం మరో 'ఒత్తిడి సమూహం' (ప్రెషర్ గ్రూప్)గా మాత్రమే పనిచేస్తాయి. సామాజిక మాధ్యమాల్లో (సీజేపీ) సంపాదించిన భారీ ఫాలోయింగ్‌ను చూసి చాలామంది దీన్ని వచ్చే ఎన్నికల్లో ప్రభావవంతమైన రాజకీయ పార్టీగా భావించడం సహజం. కానీ, ఎన్నికల రాజకీయాలు డిజిటల్ ప్రచారానికి మాత్రమే పరిమితం కావు. డేటా ప్రకారం, ప్రజాస్వామ్య వ్యవస్థలో ఎన్నికల్లో నిలబడటానికి, ఓట్లను గెలుచుకోవడానికి నిర్దిష్ట సంఖ్యలో సభ్యులు, స్థానిక నాయకత్వం, మరియు ముఖ్యంగా కుల, మత సమీకరణలు కీలక పాత్ర పోషిస్తాయి. భారతదేశంలోని అనేక ఎన్నికల ఫలితాలను కుల లెక్కలు ఎలా మారుస్తాయో (సీజేపీ) ఇంకా పూర్తిగా అర్థం చేసుకున్నట్లు కనిపించడం లేదు. 'ఇది రాజకీయ పార్టీ కాదు, ప్రజల ఉద్యమం' అని కేంద్ర ప్రధాన కార్యదర్శి అభిజీత్ దీపకే చెప్పినా, ఏదో ఒక రోజు ఎన్నికల బరిలోకి దిగక తప్పదు. అప్పుడు, డిజిటల్ ప్రపంచంలో వారికి ఉన్న ప్రతిష్ట, భౌతిక ప్రపంచంలో ఎన్నికల కమిషన్ నిబంధనలు, డబ్బు, అధికారం, మరియు భారీ ఏర్పాట్ల ముందు ఎంతవరకు నిలుస్తుందో చెప్పడం కష్టం.

(సీజేపీ)తీసుకురావాలనుకునే మార్పులు ఎంతో అవసరమైనవి. పారదర్శకత, వాగ్దానాలకు బదులు పనితీరు అనేది ప్రజలు ఎప్పుడూ కోరుకునే విషయం. అయినా, ఏదైనా ఒక అంశాన్ని మాత్రమే పట్టుకుని రాజకీయాలు చేయడం, తమ కార్యకర్తల ఆకాంక్షలను పెంచి, ఆ తర్వాత సరైన ఫలితాలు ఇవ్వలేకపోవడం వల్ల తీవ్ర నిరాశ ఏర్పడే ప్రమాదం ఉంది. విద్యార్థులు, ఉద్యోగాలు కోల్పోయిన యువత మాత్రమే కాకుండా, కార్పొరేట్ నిర్వహణలో ఉన్న వారు, అండర్ డాగ్ ప్రజలు కూడా ఈ ఉద్యమాన్ని చూస్తున్నారు. కేవలం కుప్పలుగా పడిన పుస్తకాల ఫోటోలు చాలు అనుకుంటే, అది తప్పు. మూలాల్లో ఉన్న లోతైన నిర్మాణాత్మక సమస్యలను పరిష్కరించాల్సిన అవసరం వారిపై ఉంది.

చివరికి మనం గ్రహించాల్సింది ఏమిటంటే, వాస్తవ ప్రపంచంలోని పెద్ద పెద్ద సమస్యలను ట్వీట్లు, వీడియోలతో మాత్రమే పరిష్కరించలేము. వీటిని రాజకీయ ఎజెండాగా మార్చుకోవడం ద్వారా, ఒక పార్టీ ప్రజల మద్దతు పొందగలదు. కానీ, ఆ ఎజెండాను అమలు చేయడానికి అధికారం అవసరం. అధికారం సంపాదించడానికి రాజకీయ పార్టీలా పనిచేయాల్సి ఉంటుంది. ఒకవేళ (సీజేపీ) ఏ దశలోనైనా రాజకీయ పార్టీగా మారి ఎన్నికల్లో నిలబడితే, దాని ముందున్న అతి పెద్ద సవాలు 'ఇమేజ్ మార్పు'. ప్రస్తుతం వారి పట్ల ఉన్న హాస్యం, నిరాశలో ఉన్న యువత మద్దతు, కేవలం భారీ ఓటు బ్యాంకుగా మారకపోవచ్చు. అందుకే ఇది మంచి ప్రాతినిధ్యాన్ని ఇవ్వడంలో విఫలమైతే, ఇది కేవలం సోషల్ మీడియా ట్రెండ్ గా, ఒక మంచి ప్రయోగంగా మిగిలిపోయే అవకాశమే ఎక్కువగా ఉంది. ప్రజలు అసలైన మార్పును డిమాండ్ చేస్తున్నారు, ఆ మార్పు కోసం పరిపాలనా యంత్రాంగంలో ఉండటం తప్పనిసరి అన్న విషయాన్ని ఈ ఉద్యమం గుర్తించాల్సిన సమయం ఆసన్నమైంది.



డాక్టర్ కోలాహలం
రామ్ కిశోర్
9849328496.

# గురువుపై దాడి అంటే.. సమాజ భవిష్యత్తుపై దాడే!

ఉపాధ్యాయుడు కేవలం పాఠాలు చెప్పే వ్యక్తి కాదు. విద్యార్థికి అక్షరజ్ఞానం అందించడంతో పాటు ఆలోచించే శక్తిని, మంచిని–చెడును గుర్తించే విచక్షణను, బాధ్యతతో జీవించే విలువలను నేర్పే మార్గదర్శి. అందుకే భారతీయ సంస్కృతిలో తల్లిదండ్రుల తర్వాత గురువుకు అత్యున్నత స్థానం ఇచ్చారు. అయితే ఇటీవలి కాలంలో విద్యార్థులు, తల్లిదండ్రుల నుంచి ఉపాధ్యాయులపై దాడులు, బెదిరింపులు, అవమానాలు చోటుచేసుకోవడం ఆందోళన కలిగిస్తోంది. గురువుపై చేయి చేసుకోవడం ఒక వ్యక్తిపై దాడి మాత్రమే కాదు.. అది విద్యా వ్యవస్థపై, జ్ఞానంపై, సమాజ భవిష్యత్తుపై దాడి.

కాలం మారింది. సాంకేతిక పరిజ్ఞానం విస్తరించింది. సమాచారం క్షణాల్లో అందుబాటులోకి వచ్చింది. సామాజిక మాధ్యమాలు యువత జీవితంలో భాగమయ్యాయి. కానీ సమాచారం పొందడం మాత్రమే విద్య కాదు. ఆ సమాచారాన్ని వివేకంతో ఉపయోగించడం, ఇతరులను గౌరవించడం, తప్పును అంగీకరించడం, కోపాన్ని నియంత్రించుకోవడం, బాధ్యతగా ప్రవర్తించడం కూడా విద్యలో భాగమే. ఈ విలువలు లేకుండా ఎన్ని డిగ్రీలు సాధించినా సంపూర్ణ వ్యక్తిత్వం ఏర్పడదు.

ఉపాధ్యాయులపై దాడులకు కుటుంబ పరిస్థితులు, పెరుగుతున్న ఒత్తిళ్లు, సామాజిక మాధ్యమాల ప్రభావం, తక్షణ కోపానికి లోనయ్యే స్వభావం, క్రమశిక్షణపై అవగాహన తగ్గడం, గురువు పట్ల గతంలో ఉన్న గౌరవ భావన తగ్గిపోవడం వంటి అనేక కారణాలు ఉండవచ్చు. కొన్నిసార్లు పిల్లల తప్పును ప్రశ్నించకుండా తల్లిదండ్రులు ఉపాధ్యాయుడినే నిందించడం పరిస్థితిని మరింత తీవ్రతరం చేస్తోంది. పిల్లలపై ప్రేమ అవసరమే.. కానీ ఆ ప్రేమలో బాధ్యత కూడా ఉండాలి. తమ పిల్లల తప్పును సమర్థించడం ద్వారా తాత్కాలికంగా వారిని కాపాడినట్లు అనిపించినా, భవిష్యత్తులో అది వారి వ్యక్తిత్వానికే నష్టం చేయవచ్చు.

విద్యార్థులు ఒక విషయాన్ని గుర్తుంచుకోవాలి. ఉపాధ్యాయుడు మీ శత్రువు కాదు. మీ భవిష్యత్తు కోసం పనిచేసే వ్యక్తి. మీరు తరగతికి ఆలస్యంగా వస్తే మందలించే గురువు, చదువులో నిర్లక్ష్యం చేస్తే ప్రశ్నించే గురువు, తప్పు చేస్తే హెచ్చరించే గురువు మీ జీవితాన్ని అణచివేయడానికి కాదు.. సరైన దారిలో నడిపించడానికి ప్రయత్నిస్తాడు. ప్రతి మందలింపులో ద్వేషాన్ని చూడకండి. కొన్నిసార్లు ఆ మందలింపు వెనుక మీ భవిష్యత్తుపై గురువుకు ఉన్న ఆందోళన ఉంటుంది.

అయితే ఉపాధ్యాయుల బాధ్యతను కూడా విస్మరించలేం. క్రమశిక్షణ పేరుతో విద్యార్థిని అవమానించడం, వ్యక్తిగతంగా దూషించడం, వివక్ష చూపడం లేదా శారీరకంగా శిక్షించడం సమర్థనీయం కాదు. ఆధునిక విద్యలో క్రమశిక్షణ అంటే భయం సృష్టించడం కాదు.. బాధ్యత పెంచడం. గురువు తన హోదాకు తగిన గౌరవాన్ని నిలబెట్టుకోవడంతో పాటు విద్యార్థి గౌరవాన్ని కూడా కాపాడాలి. విద్యార్థి–ఉపాధ్యాయ సంబంధం పరస్పర గౌరవం, నమ్మకం, సంభాషణపై నిర్మితమైతేనే విద్యా వాతావరణం ఆరోగ్యంగా ఉంటుంది. ఏ సమస్య వచ్చినా దానికి పరిష్కారం హింస కాదు. విద్యార్థికి అభ్యంతరం ఉంటే ఉపాధ్యాయుడితో మాట్లాడవచ్చు. యాజమాన్యాన్ని సంప్రదించవచ్చు. తల్లిదండ్రులకు చెప్పవచ్చు. అవసరమైతే చట్టపరమైన మార్గాన్ని ఆశ్రయించవచ్చు. కానీ దాడి చేయడం, బెదిరించడం, అవమానించడం లేదా సామాజిక మాధ్యమాల్లో వ్యక్తిగతంగా లక్ష్యంగా చేసుకోవడం ఏ సమస్యకూ పరిష్కారం కాదు. ఒక క్షణం కోపం జీవితాంతం పశ్చాత్తాపంగా మారే అవకాశం ఉంది.

విద్యాసంస్థలు కూడా ఈ సమస్యను కేవలం క్రమశిక్షణ అంశంగా చూడకూడదు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు కలిసి మాట్లాడే వేదికలు ఉండాలి.

తల్లిదండ్రులు కూడా పిల్లలకు ఒక ముఖ్యమైన విలువ నేర్పాలి–అభ్యంతరం చెప్పవచ్చు, ప్రశ్నించవచ్చు, విభేదించవచ్చు.. కానీ అవమానించకూడదు, హింసకు పాల్పడకూడదు. పిల్లలకు హక్కులు ఎంత ముఖ్యమో, బాధ్యతలు కూడా అంతే ముఖ్యమని చెప్పాలి. స్వేచ్ఛ అంటే ఇష్టమొచ్చినట్లు ప్రవర్తించడం కాదు; బాధ్యతతో వ్యవహరించడం.

విద్యార్థుల జీవితంలో గురువు పాత్ర పరీక్షల మార్కులతో ముగియదు. ఈరోజు తరగతి గదిలో కూర్చున్న విద్యార్థి రేపు వైద్యుడు కావచ్చు, ఇంజినీర్ కావచ్చు, శాస్త్రవేత్త కావచ్చు, అధికారి కావచ్చు, న్యాయవాది కావచ్చు, జర్నలిస్టు కావచ్చు, రాజకీయ నాయకుడు కావచ్చు, పారిశ్రామికవేత్త కావచ్చు. ఏ స్థాయికి వెళ్లినా అతని వ్యక్తిత్వ నిర్మాణంలో ఉపాధ్యాయుడి పాత్ర ఉంటుంది. మొదటి అక్షరం నేర్పిన గురువును, తన తప్పును సరిదిద్దిన గురువును, తనలోని ప్రతిభను గుర్తించిన గురువును గుర్తుంచుకోవడం విద్యార్థి సంస్కారానికి నిదర్శనం. ఈరోజు ఉపాధ్యాయుడు తరగతి గదిలో భయంతో నిలబడితే రేపటి విద్యార్థి ప్రశ్నించే స్వేచ్ఛను కోల్పోతాడు. గురువు తన అభిప్రాయాన్ని చెప్పడానికి భయపడితే సృజనాత్మకత తగ్గుతుంది. గురువు–శిష్య సంబంధంలో నమ్మకం పోతే విద్యా వ్యవస్థ పునాదులే బలహీనపడతాయి. అందుకే ఉపాధ్యాయుడికి గౌరవం, విద్యార్థికి గౌరవం, ఇద్దరికీ భద్రత, విద్యాసంస్థకు బాధ్యత అవసరం. సమాజం కూడా ఉపాధ్యాయుడిని కేవలం ఉద్యోగిగా చూడకూడదు. ఒక మంచి ఉపాధ్యాయుడు వందలాది విద్యార్థుల జీవితాలను ప్రభావితం చేయగలడు. ఒక మాటతో ఒక విద్యార్థి జీవితానికి దిశ మార్చగలడు. ఒక చిన్న ప్రోత్సాహంతో ఒక ప్రతిభను వెలికి తీయగలడు. అలాంటి వ్యక్తిపై దాడి జరిగితే నష్టం ఒక వ్యక్తికే కాదు.. అతని ద్వారా ప్రభావితమయ్యే ఎన్నో జీవితాలకు.

గురువు తప్పు చేస్తే ప్రశ్నించాలి. విద్యార్థి తప్పు చేస్తే సరిదిద్దాలి. తల్లిదండ్రులు తప్పు చేస్తే అవగాహన కల్పించాలి. వ్యవస్థలో లోపం ఉంటే దాన్ని సరిచేయాలి. కానీ ఏ సమస్యకైనా హింసను పరిష్కారంగా ఎంచుకోవద్దు. ప్రశ్నించే హక్కును కాపాడుకుందాం.. అదే సమయంలో గౌరవించే సంస్కృతిని కూడా కాపాడుకుందాం. రేపటి సమాజం ఈరోజు తరగతి గదుల్లోనే నిర్మితమవుతోంది. అక్కడ గురువు భయపడకుండా బోధించాలి. విద్యార్థి భయపడకుండా ప్రశ్నించాలి. ఇద్దరి మధ్య నమ్మకం ఉండాలి. జ్ఞానం పంచే వాతావరణం ఉండాలి. హింసకు, బెదిరింపులకు, అవమానాలకు చోటు ఉండకూడదు.

గురువుపై ఎత్తిన చేయి ఒక్క వ్యక్తిని మాత్రమే గాయపరచదు.. అది రేపటి సమాజాన్ని నిర్మించే విలువలను గాయపరుస్తుంది. అందుకే హింసకు కాదు.. సంభాషణకు ప్రాధాన్యం ఇవ్వాలి. భయానికి కాదు.. గౌరవానికి స్థానం కల్పించాలి.



డాక్టర్ రక్కిరెడ్డి ఆదిరెడ్డి
కాకతీయ విశ్వవిద్యాలయం

## కొలిమి ఆరకుండా.!

చుట్టూతా
ఎటు చూసినా
వెలుతురే అనుకున్నా..
కళ్ళు తెరిసే ఉన్నాయన్న
అచంచల భ్రమల
తెలియాడానేమో...
గుడ్లల్లో
నీళ్లు కమ్ముకున్నప్పుడు
పొరలన్నీ
కరిగి పోయాయేమో..
కడ కొంగుతో
కన్నీళ్లొత్తుకుని చూస్తే
అంతటా చీకటే..
దట్టంగా అలుముకుని
ప్రగాఢ అంధకారమే...
సూర్యచంద్రులే
అండై ఉండగా
ఇక దిగులేం
అనిపించేదప్పుడు..
నాలుగు
దిక్కులు తప్ప
దిక్కవుతాయనుకున్న
ముఖాలేవీ
అగుపించడంలేదిప్పుడు..
మబ్బుల్లో
కలగలిసిన మబ్బుల్ని
పోల్చుకోవడం
కుదరదేమో..
బోరున విలపించే
నడి ఆకాశంలో
తడుస్తున్నప్పుడు
చెక్కిళ్ల చెమ్మ
చేతికంటనట్లు...
బతుకు రాజేసిన
చెకుముకి
నిప్పురవ్వల్ని
చేతులడ్డం పెట్టి
సాదుకోవాలె
కొలిమి ఆరకుండా
కాపుగాయాలెప్పుడూ...

డా. ఇక్బాల్ పాషా
9440775732

# జైలు గోడల నుంచి ఉన్నత స్థానాలకు.. గతాన్ని మర్చిపోవడం ఎందుకు?



ప్రజా జీవితంలోనైనా, రాజకీయాల్లోనైనా, వ్యాపార రంగంలోనైనా ఒక వ్యక్తి ఎదగడం సహజం. కష్టాలను అధిగమించి ఉన్నత స్థానాలకు చేరుకోవడం ప్రతి ఒక్కరూ కోరుకునే విజయం. అయితే ఆ ఎదుగుదలలో తనకు అండగా నిలిచిన వారిని గుర్తుంచుకోవడం, కష్టకాలంలో పరిచయమైన మనుషులను గౌరవించడం అతని వ్యక్తిత్వానికి అసలైన కొలమానం. పదవి, అధికారం, సంపద వచ్చిన తర్వాత మన చుట్టూ కొత్త పరిచయాలు పెరగడం సహజమే. కానీ మన ప్రయాణంలో కష్టకాలంలో మనతో ఉన్నవారిని మర్చిపోవడం మాత్రం మన విలువలను ప్రశ్నించే అంశంగా మారుతుంది.

జైలు శాఖలో సుదీర్ఘకాలం పనిచేసిన అధికారిగా నాకు అనేక రకాల వ్యక్తులతో పరిచయం ఏర్పడింది. వారిలో కొందరు ఒకప్పుడు నిందితులుగా, మరికొందరు ఖైదీలుగా జైలు గోడల మధ్య జీవించారు. కాలం గడిచింది. పరిస్థితులు మారాయి. వారిలో కొందరు రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా ఉన్నత స్థానాలకు ఎదిగారు. ఒకప్పుడు జైలు గోడల మధ్య కనిపించిన వ్యక్తులే తర్వాత సమాజంలో గౌరవనీయులుగా, అధికార స్థానాల్లో ఉన్నవారిగా కనిపించడం జీవితంలో సహజమైన మార్పు.

అయితే, ఒక ఆసక్తికరమైన విషయాన్ని పలుమార్లు గమనించాను. తమ కష్టకాలంలో పరిచయమైన కొందరు జైలు అధికారులు, సిబ్బందిని ఉన్నత స్థానాలకు చేరుకున్న తర్వాత దూరంగా ఉంచడానికి ప్రయత్నిస్తారు. ఇది ప్రతి ఒక్కరికీ వర్తించే సూత్రం కాదు. ఎవరి మీదా వ్యక్తిగత ఆరోపణ కాదు. ఒక రిటైర్డ్ జైలు అధికారిగా నాకు ఎదురైన అనుభవాల ఆధారంగా చేసిన మానవ మనస్తత్వ పరిశీలన మాత్రమే.

జైలు జీవితం మన సమాజంలో ఇప్పటికీ ఒక రకమైన సామాజిక మచ్చగా పరిగణించబడుతుంది. ఒక వ్యక్తి తన జీవితంలో ఉన్నత స్థానానికి చేరుకున్న తర్వాత గతంలోని బాధాకరమైన అధ్యాయాలు బయటకు రావాలని కోరుకోకపోవచ్చు. తనను కొత్త గుర్తింపుతో సమాజం చూడాలని కోరుకోవచ్చు. అలాంటి సమయంలో తన జైలు జీవితాన్ని ప్రత్యక్షంగా చూసిన వ్యక్తి ఎదురుపడితే, అతనికి తన గతం గుర్తుకు రావచ్చు. జైలు అధికారి కేవలం ఒక వ్యక్తిగా కాకుండా, తన జీవితంలోని కఠినమైన కాలానికి ప్రతీకగా కనిపించవచ్చు. అందుకే కొందరు గతాన్ని గుర్తు చేసే వ్యక్తులకు దూరంగా ఉండటాన్ని ఎంచుకోవచ్చు.

మనిషి తన జీవితంలోని బాధాకరమైన అనుభవాలను వేరు చేసి, గతం--వర్తమానం మధ్య ఒక గోడను నిర్మించుకోవడం కూడా జరుగుతుంది. ఒకవైపు బాధాకరమైన గతం, మరోవైపు గౌరవప్రదమైన వర్తమానం. ఈ రెండు ప్రపంచాలు కలవకూడదని భావించినప్పుడు, గతానికి ప్రత్యక్ష సాక్షులైన వ్యక్తుల నుంచి దూరంగా ఉండవచ్చు. జైలులో ఉన్నప్పుడు ఎదురైన నిస్సహాయత, ఆంక్షలు, కుటుంబానికి దూరంగా ఉండటం, కేసులు, విచారణలు వంటి అనుభవాలు కూడా కొందరికి బాధాకరమైన జ్ఞాపకాలుగా మిగిలి ఉండవచ్చు. తర్వాత జీవితంలో శక్తివంతమైన స్థాయికి చేరుకున్నప్పుడు ఆ పాత పరిస్థితులను గుర్తుచేసుకోవడం అసౌకర్యంగా అనిపించవచ్చు.

ఇక్కడ మరో ఆసక్తికరమైన కోణం ఉంది. కొందరు మాజీ ఖైదీలు తర్వాతి జీవితంలో పోలీసు అధికారులు, ప్రముఖ న్యాయవాదులు, రాజకీయ నాయకులు, పారిశ్రామికవేత్తలతో సన్నిహిత సంబంధాలు కొనసాగిస్తుంటారు. కానీ జైలు అధికారులతో మాత్రం దూరంగా ఉంటారు. దీనికి వారి ప్రస్తుత సామాజిక గుర్తింపు కూడా ఒక కారణం కావచ్చు. పోలీసు అధికారి అధికారానికి ప్రతీకగా కనిపిస్తాడు. ప్రముఖ న్యాయవాది న్యాయపోరాటానికి ప్రతీకగా కనిపిస్తాడు. రాజకీయ నాయకుడు అధికారానికి ప్రతీకగా కనిపిస్తాడు. కానీ జైలు అధికారి మాత్రం నిర్బంధం, శిక్ష, గత కష్టాలకు ప్రతీకగా కనిపించే అవకాశం ఉంది. అందువల్ల మనిషి తన ప్రస్తుత ప్రతిష్టకు అనుకూలంగా కనిపించే సంబంధాలను కొనసాగిస్తూ, గతంలోని బాధాకరమైన జ్ఞాపకాలను గుర్తుచేసే సంబంధాలను దూరం చేసుకోవచ్చు.

అయితే ఇక్కడ జైలు అధికారుల మానవీయ పాత్రను కూడా గుర్తు చేసుకోవాలి. జైలు గోడల మధ్య ఉన్న వ్యక్తి కేవలం ఖైదీ కాదు. అతను కూడా ఒక మనిషే. అతనికి కుటుంబం ఉంటుంది, భావోద్వేగాలు ఉంటాయి, భయాలు ఉంటాయి, అనారోగ్యాలు ఉంటాయి, భవిష్యత్తుపై ఆశలు ఉంటాయి. జైలు అధికారులు, సిబ్బంది ప్రతిరోజూ ఈ మానవీయ కోణాలను ఎదుర్కొంటారు. ఆకలితో ఉన్నప్పుడు భోజనం అందించడం, అనారోగ్యంగా ఉన్నప్పుడు వైద్యం అందించడం, కుటుంబ సభ్యులను గుర్తుచేసుకుని బాధపడుతున్నప్పుడు ధైర్యం చెప్పడం, సమస్యలను వినడం వంటి బాధ్యతలు కూడా వారి విధుల్లో భాగమే.

ఒక ఖైదీ జీవితంలోని అత్యంత కఠినమైన సమయంలో పరిచయమైన జైలు అధికారి అతని విజయానికి భాగస్వామి కాకపోవచ్చు. కానీ అతని కష్టకాలానికి మాత్రం సాక్షి. అతని బాధను ప్రత్యక్షంగా చూసిన వ్యక్తి. అతని బలహీనతలను చూసిన వ్యక్తి. అతని కుటుంబం గురించి విన్న వ్యక్తి. అందుకే ఆ పరిచయానికి ఒక ప్రత్యేకమైన మానవీయ విలువ ఉంటుంది.

జీవితం ఎప్పుడూ ఒకేలా ఉండదు. నిన్నటి నిందితుడు రేపటి నాయకుడు కావచ్చు. నిన్నటి పేదవాడు రేపటి ధనవంతుడు కావచ్చు. నిన్నటి సాధారణ వ్యక్తి రేపటి ప్రముఖుడు కావచ్చు. నిన్న ఎవరి సహాయం అవసరమైన వ్యక్తి రేపు వందల మందికి సహాయం చేసే స్థాయికి చేరుకోవచ్చు. పరిస్థితులు మారడం తప్పు కాదు. గతాన్ని అధిగమించడం కూడా తప్పు కాదు. కానీ మన గతంలో మనతో నిలిచిన వారిని మర్చిపోవడం మాత్రం మనిషి విలువలను తగ్గిస్తుంది.

కృతజ్ఞతకు పదవి అవసరం లేదు. మన కష్టకాలంలో మనకు ఒక మాట ధైర్యం చెప్పిన వ్యక్తిని గుర్తుంచుకోవడం కూడా కృతజ్ఞతే. మన సమస్యను ఓపికగా విన్న వ్యక్తిని గౌరవించడం కూడా కృతజ్ఞతే. మనం బలహీనంగా ఉన్నప్పుడు మనల్ని మనుషులుగా చూసిన వారిని మర్చిపోకపోవడం మన సంస్కారం. సహాయం ఎంత పెద్దది అన్నది కాదు; అది అందిన సమయంలో మన పరిస్థితి ఎంత క్లిష్టంగా ఉందన్నదే ముఖ్యం. విజయం వచ్చిన తర్వాత మన చుట్టూ వందల మంది చేరవచ్చు. కానీ మన వైఫల్యాన్ని చూసిన వారు కొద్దిమందే ఉంటారు. విజయాన్ని చూసిన వారిని గుర్తుంచుకోవడం సులభం. కష్టకాలాన్ని చూసిన వారిని గుర్తుంచుకోవడం మాత్రం మనసుకు సంబంధించిన విషయం. అందుకే నిజమైన వ్యక్తిత్వం మనం ఎవరితో సన్నిహితంగా ఉన్నామన్నదానికంటే, మన గతాన్ని చూసిన వారితో ఎలా వ్యవహరిస్తామన్నదిలో కనిపిస్తుంది.

గతాన్ని మర్చిపోవడం కొన్నిసార్లు మానసిక రక్షణ కావచ్చు. బాధాకరమైన జ్ఞాపకాల నుంచి బయటపడటానికి మనిషి కొత్త జీవితాన్ని ఎంచుకోవచ్చు. అది తప్పు కాదు. కానీ గతాన్ని అధిగమించడం అంటే గతంలోని ప్రతి మనిషిని తిరస్కరించడం కాదు. గతంలో మనల్ని మానవత్వంతో చూసిన వారిని గౌరవిస్తూ కూడా మనం కొత్త జీవితాన్ని నిర్మించుకోవచ్చు.

పదవులు శాశ్వతం కావు. అధికారం శాశ్వతం కాదు. సంపద కూడా శాశ్వతం కాదు. కానీ మనం ఇతరులతో ఎలా ప్రవర్తించామన్న జ్ఞాపకం మాత్రం ఎక్కువకాలం నిలుస్తుంది. మనం ఎంతటి స్థాయికి ఎదిగామన్నదానికంటే, మన కంటే బలహీనంగా ఉన్న సమయంలో ఎవరికైనా మనం ఎలా ప్రవర్తించామన్నదే మన వ్యక్తిత్వానికి అసలైన అద్దం.

జైలు గోడలు నేరాన్ని బంధించగలవు. శిక్షను అమలు చేయగలవు. మనిషి స్వేచ్ఛను కొంతకాలం పరిమితం చేయగలవు. కానీ అతని భవిష్యత్తును శాశ్వతంగా నిర్ణయించలేవు. అలాగే ఆ గోడల మధ్య ఏర్పడిన మానవ సంబంధాలను కూడా ఒక వ్యక్తి తన విజయంతో చెరిపేయలేడు. ఆ సంబంధాలు అతని గతానికి సంబంధించినవే కావచ్చు. కానీ అవి అతని జీవితంలోని నిజమైన అనుభవాలు.

అందుకే గతాన్ని దాచుకోవడం కంటే గతం నుంచి నేర్చుకోవడం గొప్పది. గతాన్ని అధిగమించడం కంటే గతంలో మనతో నిలిచిన మనుషులను గౌరవించడం గొప్పది. ఒకప్పుడు మన బాధను చూసిన వ్యక్తిని ఇప్పుడు మన స్థాయిలో లేడని తక్కువగా చూడకపోవడం మన సంస్కారం. మనం ఎదిగిన తర్వాత కూడా మన ప్రయాణాన్ని గుర్తుంచుకోవడం మనిషి గొప్పతనం.

చివరికి జీవితం మనం ఎంత సంపాదించామన్నదానితో కాదు, ఎంతమంది జీవితాల్లో మనం మనిషిగా నిలిచామన్నదానితో విలువ పొందుతుంది. నిన్న మనతో ఉన్న వ్యక్తి ఈరోజు మనకు అవసరం లేకపోవచ్చు. కానీ అతని మానవీయత విలువ తగ్గదు. కష్టకాలంలో మనకు అండగా నిలిచిన వారిని గుర్తుంచుకోవడం మన విజయాన్ని చిన్నది చేయదు; దానికి మరింత గౌరవాన్ని తెస్తుంది.

ఎదగడం తప్పు కాదు. గతాన్ని అధిగమించడం తప్పు కాదు. కానీ మన కష్టకాలంలో మన పక్కన నిలిచిన మనుషులను మర్చిపోవడం మాత్రం నిజమైన ఎదుగుదల కాదు.

ఎందుకంటే జైలు గోడలు నేరాన్ని బంధించగలవు.. కానీ మనిషి మానవత్వాన్ని బంధించలేవు.

- కొలను వెంకటేశ్వర రెడ్డి
SP Jails (Retd.)

# రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నాణ్యమైన వైద్య సేవలు అందించాలి

- ఉద్యాన శాఖ ద్వారా ఎకరానికి రూ.4,200 ప్రభుత్వ సహాయం
- ఉపాధి హామీ పనులు, వ్యవసాయం, విద్య, వైద్యం, ఇందిరమ్మ ఇళ్ల పరిశీలన
- గురువారం మండలంలో కలెక్టర్ దీపక్ తివారి విస్తృత పర్యటన



**మర్పల్లి, ఆగస్టు 27 (జనంసాక్షి) :** వికారాబాద్ జిల్లా కలెక్టర్ దీపక్ తివారి గురువారం మర్పల్లి మండలంలో విస్తృతంగా పర్యటించి వివిధ ప్రభుత్వ పథకాల అమలు, అభివృద్ధి పనులు, వ్యవసాయ రంగ పరిస్థితులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. దామస్తాపూర్ గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పథకం కింద ఇంకుడు గుంత పనులను కలెక్టర్ దీపక్ తివారి పరిశీలించారు. పనిస్థలంలో పనిచేస్తున్న కూలీలతో నేరుగా మాట్లాడి హాజరు, పనిదినాలు, వేతనాలు, చేపడుతున్న పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. కూలీలకు పనిస్థలాల్లో అవసరమైన సౌకర్యాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఉపాధి హామీ పనులు నాణ్యతతో, పారదర్శకంగా జరిగేలా పర్యవేక్షించాలని సూచించారు.భూచన్పల్లి గ్రామంలో రైతు మోహన్‌రెడ్డి సాగు చేస్తున్న ఆయిల్‌పామ్, నిమ్మ తోటలను కలెక్టర్ పరిశీలించారు. ప్రధాన పంటలతో పాటు అనుకూలమైన అంతర పంటలను సాగు చేయడం ద్వారా భూమి ఉత్పాదకతను పూర్తిస్థాయిలో వినియోగించుకోవడంతో పాటు రైతులకు అదనపు ఆదాయం లభిస్తుందని తెలిపారు. వికారాబాద్ జిల్లా నేలలు ఆయిల్‌పామ్ సాగుకు అనుకూలంగా ఉన్నందున రైతులు ఈ సాగు వైపు ముందుకు రావాలని సూచించారు. ప్రభుత్వం ఆయిల్‌పామ్ మొక్కలు, బిందు సేద్యం తదితరాలకు రాయితీ సహాయం అందిస్తున్నందున అర్హత, ఆసక్తి ఉన్న రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆసుపత్రికి వచ్చిన రోగులతో మాట్లాడి వైద్య సేవలు, మందుల పంపిణీ, పరీక్షల నిర్వహణపై వివరాలు తెలుసుకున్నారు.రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నాణ్యమైన వైద్య సేవలు అందించాలని వైద్యాధికారులను ఆదేశించారు. అవసరమైన మందులు, వైద్య పరికరాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, ఆసుపత్రి పరిసరాల్లో నిరంతరం పరిశుభ్రత పాటించాలని సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న ఆరోగ్య పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. కలెక్టర్ పర్యటనలో ఎంపీడీవో శాంత, తహసిల్దార్ మనోహర చక్రవర్తి, జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ అధికారి ఎం.ఏ. సత్తార్, డీసీహెచ్ఎస్ డాక్టర్ ఆనంద్, డాక్టర్ మాధురి, హౌసింగ్ పీడీ ముక్రంబాబా, ఏపిఓ అంజిరెడ్డి, సంబంధిత అధికారులు, సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే అన్ని విధాల అభివృద్ధి

- స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంజయ్య



**రాయికోడు, ఆగస్టు 27 (జనం సాక్షి) :** కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే రాష్ట్రం అన్ని విధాల అభివృద్ధి జరిగిందని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ జి అంజయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ ఎం సుధాకర్ రెడ్డిలు స్పష్టం చేశారు. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహా ఆదేశాల మేరకు గురువారం మండల పరిధిలోని హులిగెర గ్రామంలో తాసిల్దార్ ఆశాజ్యోతి ఆధ్వర్యంలో డిసిఎంఎస్ మాజీ చైర్మన్ సిద్దన్న పాటిల్, మండల కాంగ్రెస్ అధ్యక్షులు బాలాజీ నర్సింలు, స్థానిక సర్పంచ్ నర్సింలు లతో కలిసి లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం మాటల ప్రభుత్వం కాదని ఇది చేతల ప్రభుత్వం అని తెలియజేశారు. రాష్ట్రవ్యాప్తంగా కోటి ఐదు లక్షల స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం ఉద్యమంలా కొనసాగుతుందని ఆయన గుర్తు చేశారు. ఈ అవకాశాన్ని లబ్ధిదారులందరూ సద్వినియోగ పరచుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు బసవరాజు పాటిల్, వీరభద్ర దేవాలయ కమిటీ చైర్మన్ సతీష్ కులకర్ణి, యూత్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు ఏ ప్రభాకర్, ఎంపీడీవో ఎంఏ షరీఫ్,డిప్యూటీ తాసిల్దార్ నరేష్, సర్పంచ్ రాజశేఖర్ గౌడ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ జి విట్టల్, పలు గ్రామాల సర్పంచులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ బ్లాస్టింగ్‌లపై చర్యలు తీసుకోవాలి

- పంట నష్టంతో రైతు ఆత్మహత్యాయత్నం



**గద్వాల, ఆగస్ట్ 27 (జనం సాక్షి) :** మండలంలోని సల్కాపురం శివారులో భారత్ మాల ప్రాజెక్టు కాంట్రాక్టర్లు క్రషర్ మిషన్తో చేపడుతున్న అక్రమ బ్లాస్టింగ్ల వల్ల తన పంట పూర్తిగా నష్టపోయిందని రైతు యేసు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. రాత్రింబవళ్లు కష్టపడి, అప్పులు తెచ్చి సాగు చేసిన పంట కళ్లముందే నాశనమవడంతో తట్టుకోలేకపోయానని ఆయన కన్నీరుమున్నీరయ్యారు. అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా ఎవరూ పట్టించుకోకపోవడంతోనే, ఇక బతికి దండగనే మనస్తాపంతో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు తెలిపారు. ప్రాణం కంటే మిన్నగా చూసుకున్న చేను రాళ్ల దిబ్బగా మారడం చూసి గుండె పగిలిందని, తమలాంటి పేద రైతుల ప్రాణాలంటే పాలకులకు, కాంట్రాక్టర్లకు లెక్కేలేకుండా పోయిందని ఆయన ఆసుపత్రి బెడ్‌పై నుంచే రోదించారు.ప్రస్తుతం గద్వాల జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న యేసును టీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్చార్జ్ రంజిత్ కుమార్ పరామర్శించారు.

## గ్రామీణ ప్రజలకు పట్టణ స్థాయిలో నాణ్యమైన వైద్యం అందించాలి

- కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్
- వెన్నచర్ల పీహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్
- వైద్య సేవల్లో నిర్లక్ష్యానికి తావులేదని స్పష్టం
- ఫారం పాండ్ పనులను ప్రారంభించిన జిల్లా కలెక్టర్



**నాగర్‌కర్నూల్ జిల్లా బ్యూరో, ఆగస్టు 27 (జనంసాక్షి) :** మారుమూల గ్రామాల్లో నివసించే ప్రజలకు పట్టణ ప్రాంతాల్లో లభించే స్థాయిలో నాణ్యమైన వైద్య సేవలు అందేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా ప్రజలకు సకాలంలో మెరుగైన వైద్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవల నాణ్యతను మరింత మెరుగుపరిచి, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.గురువారం కొల్లాపూర్ నియోజకవర్గంలోని పెద్దకొత్తపల్లి మండలం వెన్నచర్ల, నక్కలపల్లి గ్రామాల్లో జిల్లా కలెక్టర్ విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా వెన్నచర్ల గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేసి అక్కడ అందుతున్న వైద్య సేవలను పరిశీలించారు. ఆసుపత్రిలో రోగులకు అందుతున్న వైద్య సేవలు, అందుబాటులో ఉన్న సౌకర్యాలు, వైద్యులు, సిబ్బంది హాజరు, మందుల నిల్వలు, చికిత్స విధానం, ప్రసూతి సేవలు, అత్యవసర వైద్య సేవలపై వైద్య సిబ్బందిని అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఆసుపత్రికి వచ్చే ప్రతి రోగికి సకాలంలో వైద్యం అందించాలని, వైద్య సేవల్లో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు ఉండకూడదని కలెక్టర్ స్పష్టం చేశారు. ముఖ్యంగా మారుమూల గ్రామాల ప్రజలు వైద్యం కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా స్థానికంగానే మెరుగైన వైద్య సేవలు అందుబాటులో ఉండేలా చూడాలని సూచించారు. ప్రభుత్వ నిధులతో చేపడుతున్న ప్రతి అభివృద్ధి పనిలో నాణ్యతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని, ప్రజాధనం సద్వినియోగమయ్యేలా అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు.ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల ప్రయోజనాలు గ్రామీణ ప్రజలకు నేరుగా చేరేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రజలకు అందించే ప్రతి సేవలో పారదర్శకత, జవాబుదారీతనం, నాణ్యత ఉండేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.జిల్లా కలెక్టర్ వెంట ఆర్డీఓ బన్సీలాల్, తహశీల్దార్, గ్రామ సర్పంచ్, సంబంధిత శాఖల అధికారులు, వైద్య సిబ్బంది, గ్రామ ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## పారదర్శకంగా భూ రీ-సర్వే పనులు

- జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్



**నారాయణఖేడ్, ఆగస్టు 27 (జనంసాక్షి) :** భూ రీ-సర్వే పనులను ఎలాంటి తప్పిదాలకు తావులేకుండా, పూర్తిగా పారదర్శకంగా నిబంధనల ప్రకారం చేపట్టాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులను ఆదేశించారు. గురువారం మానూర్ మండల పరిధిలోని గట్ లింగంపల్లి గ్రామంలో కొనసాగుతున్న భూ రీ-సర్వే పనులను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. గ్రామంలో చేపడుతున్న భూముల కొలతలు, హద్దుల నిర్ధారణ, భూ వివరాల నమోదు తదితర ప్రక్రియలను కలెక్టర్ పరిశీలించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. రీ-సర్వేలో భూ యజమానులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వారి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు. భూ వివరాల నమోదులో పారదర్శకత పాటిస్తూ, నిబంధనల మేరకు రీ-సర్వే ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. గ్రామంలో భూ రీ-సర్వే ప్రక్రియను సజావుగా పూర్తి చేసేందుకు అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నారాయణఖేడ్ సబ్ కలెక్టర్ ఉమా హారతి, డిప్యూటీ కలెక్టర్ ప్రతిభ శేఖర్, సర్వే ల్యాండ్ ఏడీ, మానూర్ తహసీల్దార్ విష్ణు సాగర్, ఆర్ఐ శంకర్ రెడ్డి, సర్వేయర్ సుమలత, జూనియర్ అసిస్టెంట్ ఖాజా మొయినుద్దీన్, ఉప సర్పంచ్ ప్రతిభ అనిల్‌తో పాటు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## ఆగస్టు 31 చలో సెక్రటేరియట్‌ను విజయవంతం చేద్దాం



**కోహెడ, ఆగస్టు 27 (జనంసాక్షి) :** ఈ నెల 31న నిర్వహించబోయే మాలల చలో సెక్రటేరియట్ కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను కోహెడ మండల మాల కుల బాంధవుల సమక్షంలో కోహెడ గ్రామ మాలసంగం అధ్యక్షులు అరట్ల ఎత్తి మహేష్ అధ్యక్షతన ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జాతీయ మాల మహానాడు హుస్నాబాద్ నియోజకవర్గ ఇన్చార్జ్ ఆరె కిశోర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన విలేకరుల తో మాట్లాడుతూ ఆగస్టు 31 చలో సెక్రటేరియట్ మన బతుకు పోరాటం మన పిల్లల భవిష్యత్తు కోసం పోరాటం మన విద్యా-ఉద్యోగ హక్కుల కోసం పోరాటం అని నినదించారు. కోహెడ మండలంలోని ప్రతి గ్రామం నుంచి మాల కుల బంధువులు, విద్యార్థులు, ఉద్యోగులు, యువత, మహిళలు, మేధావులు, ప్రజా ప్రతినిధులు అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు తలారి నర్సయ్య, హుస్నాబాద్ నియోజకవర్గ మీడియా ఇంచార్జ్ జాల శ్రీనివాస్, హుస్నాబాద్ మండల సైనిక్ దళ్ బాధ్యులు దుండ్ర సుమన్, సైదాపూర్ మండల నాయకులు వేరంగి సాయి పరమేష్, మండల బాధ్యులు బందెల రాజమౌళి,గద్దల రమేష్, కోహెడ గ్రామ శాఖ అధ్యక్షులు ఎత్తి మహేష్, ఉపాధ్యక్షులు గూడ స్వామి తలారి శంకర్, రాగుల శ్రీనివాస్, గోగుల రామస్వామి, అంబటి నరసయ్య, జెల్ల శంకర్,మొగురం నర్సయ్య,డ్యాగాల రాజమౌళి, బల్లెం యాదగిరి, దొంత కనుకయ్య, దాసరి శ్రీనివాస్, బల్లెం శ్రీనివాస్, లింగం రాజు, తలారి దర్గస్వామి, గజ్జెల ప్రవీణ్, పాక శ్రీనివాస్, యాస రాజు, సుంకే సంపత్, సుంకే చంద్రయ్య, సుంకే సారయ్య, తలారి శంకర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

## కాపర్, అల్యూమీనియం వైరు దొంగల అరెస్ట్

- ఆటో, వైరు స్వాధీనం




**కోహెడ, ఆగస్టు 27 (జనంసాక్షి) :** మండల పరిధిలో కాపర్, అల్యూమినియం వైర్ దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరి నిందితులను పట్టుకుని రిమాండ్ కు తరలించిన కోహెడ పోలీసులు. పోలీస్ లు తెలిపిన వివరాల ప్రకారం కోహెడ మండల శివారులో వెంకటేశ్వరపల్లి, ఆరేపల్లి, బస్వాపూర్ గ్రామ శివారులో ట్రాన్స్ ఫార్మర్ పగలగొట్టి కాపర్, అల్యూమినియం వైర్‌లను తంగళ్ళపల్లి గ్రామాల శివారులో రైతుల వ్యవసాయ పొలాల వద్ద గల కరెంట్ మోటార్ వైర్‌లు దొంగతనాలకు పాల్పడుతున్న కరీంనగర్ జిల్లా సోమారం గ్రామానికి చెందిన లోకిని మహేష్, హన్మకొండ గోకుల్ నగర్‌కు చెందిన దేవర రాజశేఖర్‌లు గురువారం వారు దొంగతనం చేసిన కాపర్ వైర్ లను వారితో పాటు తెచ్చుకున్న ప్యాసెంజర్ ఆటోలో తీసుకువస్తుండగా కోహెడ పోలీస్ వారు సముద్రాల గ్రామం క్రాస్ రోడ్డు వద్ద పట్టుకొని వారి వద్ద నుండి ప్యాసింజర్ ఆటో టి ఎస్ 03 యు ఏ 0774 ,కరెంట్ మోటార్ స్టార్టర్, వైర్ అందాద 10 కిలోల ట్రాన్స్ ఫార్మర్ కాపర్ వైర్, అందాద 100 కిలోల అల్యూమినియం వైర్ పోలీస్ లు తెలిపిన వివరాల ప్రకారం నేరస్థుల వివరాలు ఏ 1. లోకిని మహేష్ లడ్డు తండ్రి రాజయ్య, వయసు 29 సం. కులం ఎస్టీ (ఎరుకల )వృత్తి కూలి, గ్రామం సోమారం మండలం సైదాపూర్ జిల్లా కరీంనగర్,ఏ 2. దేవర రాజశేఖర్ శేఖర్ తండ్రి రాజయ్య, వయసు 33 , కులం ఎస్టీ (ఎరుకల ), వృత్తి ఆటో డ్రైవర్ , గ్రామం ఇంటి నెంబర్ 2-6-1569, గోకుల్ నగర్ , హన్మకొండ , వరంగల్ , అలాగే మరి కొందరు దొంగలు పరారీలో ఉన్నారని ఎస్సై తెలిపారు. కేసు చేదనలో ప్రతిభ కనబర్చిన హుస్నాబాద్ సి . ఐ శ్రీధర్ ను , కోహెడ యస్.ఐ. పి అభిలాష్ ని, హెడ్ కానిస్టేబుల్ సంపత్, కానిస్టేబుల్ వేణు లను హుస్నాబాద్ ఏ సి.పి సదానందం అభినందించారు.

## ఉప్పల్‌లో సైబర్ మోసం

- లింక్ క్లిక్ చేయగానే నగదు మాయం

**ఉప్పల్, ఆగస్టు 27 (జనం సాక్షి) :** ఉప్పల్‌లో మరో సైబర్ మోసం వెలుగులోకి వచ్చింది. బ్యాంకు పేరిట వచ్చిన సందేశాన్ని నమ్మి లింక్‌పై క్లిక్ చేసిన ఓ వ్యక్తి ఖాతా నుంచి నగదు మాయమైంది. ఉప్పల్‌లోని గణేష్‌నగర్‌కు చెందిన నవీన్‌కు బ్యాంకు పేరుతో రూ.5 లక్షల రుణం, బంపర్ ఆఫర్ అంటూ ఓ సందేశం వచ్చింది. ఆ సందేశాన్ని నిజమని నమ్మిన నవీన్ అందులో ఉన్న లింక్‌పై క్లిక్ చేసి, సైబర్ నేరగాళ్లు అడిగిన వివరాలను నమోదు చేశారు. వివరాలు నమోదు చేసిన కొద్దిసేపటికే ఆయన బ్యాంకు ఖాతా నుంచి రూ.14,789 నగదు మాయమైంది. దీంతో మోసాన్ని గుర్తించిన నవీన్ పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. ఈ ఘటనతో అప్రమత్తమైన పోలీసులు, ప్రజలు గుర్తుతెలియని సందేశాలు, అనుమానాస్పద లింకులు, ఆకర్షణీయమైన రుణ ఆఫర్లను నమ్మవద్దని సూచిస్తున్నారు. బ్యాంకు పేరుతో ఎవరైనా లింకులు పంపినా వాటిపై క్లిక్ చేయకుండా, సంబంధిత బ్యాంకు అధికారిక మార్గాల ద్వారా మాత్రమే వివరాలను నిర్ధారించుకోవాలని హెచ్చరిస్తున్నారు.

# భూగర్భ వనరుల అన్వేషణకు సీఎస్ఐఆర్ - ఎన్‌జీఆర్ఐ, డీజీహెచ్ సహకారం



**ఉప్పల్/హబ్సిగూడ, ఆగస్టు 27 (జనం సాక్షి) :** దేశంలో పెరుగుతున్న ఇంధన అవసరాలకు అనుగుణంగా దేశీయ భూగర్భ వనరుల అన్వేషణను మరింత విస్తృతం చేసేందుకు కీలక ముందడుగు పడింది. భూగర్భ వనరుల అన్వేషణ, వనరుల అంచనా, ఆధునిక భూభౌతిక అధ్యయనాల్లో శాస్త్రీయ, సాంకేతిక సహకారాన్ని మరింత బలోపేతం చేసేందుకు సీఎస్ఐఆర్--జాతీయ భూభౌతిక పరిశోధనా సంస్థ (ఎన్‌జీఆర్ఐ), కేంద్ర పెట్రోలియం--సహజ వాయువు మంత్రిత్వ శాఖకు చెందిన హైడ్రోకార్బన్స్ డైరెక్టరేట్ జనరల్ (డీజీహెచ్) మధ్య గురువారం అవగాహన ఒప్పందం కుదిరింది. ఈ ఒప్పందం ద్వారా దేశంలోని భూగర్భంలో ఉన్న చమురు, సహజ వాయువు తదితర ఇంధన వనరులను శాస్త్రీయ పద్ధతుల్లో గుర్తించడం, వాటి లభ్యతను అంచనా వేయడం, అన్వేషణ ప్రక్రియను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు అవసరమైన సాంకేతిక సహకారాన్ని అందించనున్నారు. ఆధునిక భూభౌతిక సాంకేతిక పరిజ్ఞానం, శాస్త్రీయ పరిశోధనలు, నిపుణుల అనుభవాన్ని సమన్వయం చేయడం ద్వారా అన్వేషణ రంగంలో మెరుగైన ఫలితాలను సాధించేందుకు ఈ భాగస్వామ్యం దోహదపడనుంది. ఈ అవగాహన ఒప్పందంపై డీజీహెచ్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ శ్రీకాంత్ నాగులపల్లి, సీఎస్ఐఆర్ - ఎన్‌జీఆర్ఐ డైరెక్టర్ డాక్టర్ ప్రకాశ్ కుమార్ సంతకాలు చేశారు. ఈ కార్యక్రమంలో డీజీహెచ్ అదనపు డైరెక్టర్ జనరల్ డాక్టర్ శోభన్ పాఠక్, భూగర్భ శాస్త్రవేత్త దేవిదత్ సంగ్వార్‌తో పాటు సీఎస్ఐఆర్--ఎన్‌జీఆర్ఐకి చెందిన శాస్త్రవేత్తలు, అధికారులు పాల్గొన్నారు.

### దేశ ఇంధన అవసరాలు పెరుగుతున్నాయి

ఈ సందర్భంగా డాక్టర్ శ్రీకాంత్ నాగులపల్లి మాట్లాడుతూ భారతదేశంలో ఇంధన వినియోగం రోజురోజుకు పెరుగుతున్న నేపథ్యంలో దేశీయ వనరుల అన్వేషణకు మరింత ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. భవిష్యత్ ఇంధన అవసరాలను తీర్చేందుకు చమురు, సహజ వాయువు తదితర వనరుల అన్వేషణను వేగవంతం చేయడంతో పాటు అందుబాటులో ఉన్న ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని విస్తృతంగా వినియోగించుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు.

### ఆధునిక సాంకేతికతతో అన్వేషణ

సీఎస్ఐఆర్--ఎన్‌జీఆర్ఐ డైరెక్టర్ డాక్టర్ ప్రకాశ్ కుమార్ మాట్లాడుతూ ఈ అవగాహన ఒప్పందం శాస్త్రీయ పరిశోధనలకు, అన్వేషణ కార్యక్రమాలకు మధ్య మరింత సమన్వయాన్ని తీసుకువస్తుందని తెలిపారు. సీఎస్ఐఆర్--ఎన్‌జీఆర్ఐకి ఉన్న భూభౌతిక పరిశోధన నైపుణ్యాన్ని, డీజీహెచ్ అన్వేషణ బాధ్యతలను సమన్వయం చేయడం ద్వారా భూగర్భ వనరులపై సమగ్ర అధ్యయనాలు నిర్వహించేందుకు అవకాశం కలుగుతుందని చెప్పారు. భూగర్భ నిర్మాణాలను గుర్తించేందుకు ఆధునిక భూభౌతిక పద్ధతులు, వివిధ శాస్త్రీయ అధ్యయనాలను సమగ్రంగా వినియోగించడం ద్వారా వనరుల గుర్తింపు ప్రక్రియను మరింత వేగవంతం చేయవచ్చని తెలిపారు. అన్వేషణకు సంబంధించిన సమాచారాన్ని విశ్లేషించడం, శాస్త్రీయ ఆధారాలతో వనరుల లభ్యతను అంచనా వేయడం వంటి అంశాల్లో ఇరు సంస్థల సహకారం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని వివరించారు.

శాస్త్రీయ పరిజ్ఞాన మార్పిడికి అవకాశం

ఈ ఒప్పందం కేవలం సంయుక్త అన్వేషణ కార్యక్రమాలకే పరిమితం కాకుండా ఇరు సంస్థల మధ్య సాంకేతిక పరిజ్ఞానం, పరిశోధనా ఫలితాలు, నిపుణుల అనుభవాల మార్పిడికి కూడా దోహదపడనుంది. శాస్త్రవేత్తలు, సాంకేతిక నిపుణులు పరస్పరం సహకరించుకోవడం ద్వారా కొత్త పరిశోధనా విధానాలను అభివృద్ధి చేసే అవకాశం ఉంటుందని అధికారులు తెలిపారు.

ఇంధన భద్రతకు దోహదం

### అభివృద్ధి చెందిన భారతదేశం లక్ష్యానికి తోడ్పాటు

భారతదేశాన్ని ఆర్థికంగా, సాంకేతికంగా మరింత బలోపేతం చేసే దిశగా భూగర్భ వనరుల సమర్థ వినియోగం కీలకమని అధికారులు పేర్కొన్నారు. దేశ ఇంధన భద్రతను బలోపేతం చేయడంతో పాటు సహజ వనరుల శాస్త్రీయ అభివృద్ధికి ఈ సహకారం దోహదపడనుంది. తద్వారా దేశ అభివృద్ధి లక్ష్యాలకు, ముఖ్యంగా అభివృద్ధి చెందిన భారతదేశం నిర్మాణ దిశగా కొనసాగుతున్న ప్రయత్నాలకు ఈ భాగస్వామ్యం ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు.

## శివన్నగూడ రిజర్వాయర్ బాధిత రైతులకు న్యాయమైన పరిహారం ఇవ్వాలి

- ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డికి రైతుల వినతి
- 28 లక్షల పరిహారం కాదు, మార్కెట్ ధర రూ.60 లక్షలు ఇవ్వాలని డిమాండ్



**యాచారం, ఆగస్టు 27 (జనం సాక్షి) :** శివనగుడెం రిజర్వాయర్ కింద భూములు కోల్పోతున్న రైతులకు న్యాయమైన నష్టపరిహారం ఇవ్వాలని కోరుతూ మంతనగౌరిల్లి మరియు వెంకపల్లి తండా గ్రామాల రైతులు ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి గారిని కలిశారు. మంతనగౌరిల్లి గ్రామ సర్పంచ్ కొర్రా అరవింద్ నాయక్ గారి ఆధ్వర్యంలో బుధవారం ఎమ్మెల్యే నివాసంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ, శివనగుడెం రిజర్వాయర్ నిర్మాణం కారణంగా శ్రీమంతగూడ రెవెన్యూ పరిధిలోని తమ 120 ఎకరాల పచ్చని పంట పొలాలు ముంపుకు గురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నో ఏళ్లుగా ఈ భూములనే నమ్ముకుని జీవనం సాగిస్తున్నామని, భూములు కోల్పోతే తమ కుటుంబాలు రోడ్డున పడతాయని తెలిపారు. ప్రస్తుతం అధికారులు ఎకరాకు రూ.28 లక్షలు మాత్రమే పరిహారంగా ఇస్తామని చెబుతున్నారని, కానీ ప్రస్తుత మార్కెట్ లో తమ భూముల విలువ ఎకరాకు రూ.60 లక్షల పైనే ఉందని రైతులు పేర్కొన్నారు. కావున ప్రభుత్వం మార్కెట్ ధరకు అనుగుణంగా న్యాయమైన పరిహారం అందించి ఆదుకోవాలని కోరారు. రైతుల వినతిపై స్పందించిన ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, రైతులకు అన్యాయం జరగకుండా చూస్తానని, ఈ విషయాన్ని ప్రభుత్వం మరియు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి న్యాయమైన పరిహారం వచ్చేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మంతనగౌరిల్లి, వెంకపల్లి తండా గ్రామాల రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సజ్జాపూర్ రహదారిపై ఘోర ప్రమాదం

- డీసీఎం-ఆటో ఢీకొని భార్యాభర్తల దుర్మరణం
- అతివేగమే ప్రమాదానికి కారణమా..?
- నుజ్జునుజ్జయిన ఆటో..
- ఆసుపత్రి వద్ద బంధువుల రోదనలు







**కోహీర్, ఆగస్టు 27 (జనం సాక్షి) :** సంగారెడ్డి జిల్లా కోహీర్ మండల పరిధిలోని సజ్జాపూర్ గ్రామ శివారులో గురువారం ఉదయం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. డీసీఎం-- ఆటో ఢీకొన్న ఘటనలో భార్యాభర్తలు అక్కడికక్కడే దుర్మరణం చెందారు. ప్రమాద తీవ్రతకు ఆటో నుజ్జునుజ్జు కావడంతో ఘటనాస్థలిలో భయానక పరిస్థితి నెలకొంది. దంపతుల మృతితో కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీరుమున్నీరయ్యారు.

బాధితుల వివరాల ప్రకారం.. జహీరాబాద్‌కు చెందిన ఆటో డ్రైవర్ బేగరి రాచయ్య (48), ఆయన భార్య పద్మమ్మ (42) తమ సొంత ఆటో (టీఎస్ 15 యూజీ 8273)లో జహీరాబాద్ నుంచి బడంపేట వైపు బయలుదేరారు. ఉదయం సుమారు 9.30 గంటల సమయంలో సజ్జాపూర్ గ్రామ శివారుకు చేరుకోగానే పిచ్చరగడి వైపు నుంచి అతివేగంగా, నిర్లక్ష్యంగా వచ్చిన డీసీఎం వాహనం (ఏపీ 15 వై 0725) వారి ఆటోను బలంగా ఢీకొట్టింది.

ఢీకొన్న వేగానికి ఆటో తీవ్రంగా దెబ్బతింది. ప్రమాదంలో రాచయ్య, పద్మమ్మలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే స్పందించి వారిని జహీరాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే వారు మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

**అతివేగమే మింగేసిందా.. రెండు ప్రాణాలు..!**

కంటికి రెప్పలా కాపాడుకుంటూ కలిసి ప్రయాణిస్తున్న భార్యాభర్తలను రోడ్డు ప్రమాదం బలితీసుకోవడం స్థానికులను తీవ్రంగా కలచివేసింది. డీసీఎం వాహనం అతివేగంగా రావడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని స్థానికులు పేర్కొంటున్నారు. ప్రధాన రహదారిపై వాహనాల వేగ నియంత్రణపై అధికారులు మరింత దృష్టి సారించాలని వారు కోరుతున్నారు.

**ఆసుపత్రి వద్ద విషాదం**

దంపతుల మృతివార్త తెలియగానే కుటుంబ సభ్యులు, బంధువులు జహీరాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకున్నారు. తమ ఆత్మీయులు విగతజీవులుగా కనిపించడంతో వారు బోరున విలపించారు. వారి రోదనలు ఆసుపత్రి ప్రాంగణంలో విషాదాన్ని నింపాయి. ఈ దృశ్యాలు అక్కడున్న వారిని సైతం కంటతడి పెట్టించాయి.

**డీసీఎం డ్రైవర్‌పై కేసు నమోదు**

ప్రమాదానికి కారణమైన డీసీఎం డ్రైవర్‌ను పిచ్చరగడి తండాకు చెందిన దేవసోత్ సునీత్‌గా పోలీసులు గుర్తించారు. మృతురాలి సోదరుడు గుండ్ల మల్లప్ప ఇచ్చిన ఫిర్యాదు మేరకు కోహీర్ ఎస్ఐ నరేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాదానికి గల పూర్తి కారణాలపై పోలీసులు విచారణ కొనసాగిస్తున్నారు.

**బాధిత కుటుంబానికి న్యాయం చేయాలి**

దంపతుల మృతితో వారి కుటుంబం తీవ్ర విషాదంలో మునిగిపోయింది. నిర్లక్ష్యంగా, అతివేగంగా వాహనాలు నడుపుతూ అమాయకుల ప్రాణాలను బలిగొంటున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. మృతుల కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకుని తగిన ఆర్థిక సహాయం అందించాలని కోరుతున్నారు.

## ప్రజాసేవలో డాక్టర్ చల్మారెడ్డి సేవలు మరువలేనివి

- వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

**వనపర్తి బ్యూరో, ఆగస్టు 27 (జనంసాక్షి) :** వైద్య వృత్తిలో కొనసాగుతూ ప్రజలకు అందించిన సేవలతో డాక్టర్ చల్మారెడ్డి గారు ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి పేర్కొన్నారు. ఆయన మృతి వనపర్తి ప్రాంత ప్రజలకు, వైద్య రంగానికి తీరని లోటన్నారు.గురువారం ఉదయం వనపర్తిలోని డాక్టర్ చల్మారెడ్డి స్వగృహానికి వెళ్లిన ఎమ్మెల్యే ఆయన చల్మారెడ్డి భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు.అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

డాక్టర్ చల్మారెడ్డి ఎంతో సేవా భావం కలిగిన వ్యక్తి అని, వైద్య వృత్తిని కేవలం ఉపాధిగా కాకుండా ప్రజాసేవకు ఒక మార్గంగా భావించేవారని గుర్తు చేసుకున్నారు. ముఖ్యంగా తన విద్యార్థులు ఎవరైనా వైద్య సేవల కోసం తనను ఆశ్రయించినప్పుడు, వారి ఆర్థిక పరిస్థితులతో సంబంధం లేకుండా ఉచితంగా వైద్య సేవలు అందించేవారని గుర్తుకు చేసుకున్నారు.ఆర్ఎస్ఎస్ భావజాలంతో అనుబంధం ఉన్నప్పటికీ, వైద్య సేవలు అందించే విషయంలో ఆయన ఎప్పుడూ కుల, మత, వర్గ భేదాలను చూడలేదని, ప్రతి ఒక్కరినీ సమానంగా భావించి వైద్యం అందించడం ఆయనకే చెల్లిందన్నారు.డాక్టర్ మరణంతో వనపర్తి ప్రాంతం ఒక మంచి వైద్యుడిని, సేవా తత్పరుడైన వ్యక్తిని కోల్పోయిందని ఎమ్మెల్యే అభిప్రాయపడ్డారు.కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు కదిరే రాములు, మున్సిపల్ వైస్ చైర్మన్ మధుసూదన్ గౌడ్, కౌన్సిలర్లు, పట్టణ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, శ్రద్ధాంజలి ఘటించారు.



# మెదక్‌లో సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మ దహనం



**మెదక్ టౌన్, ఆగస్టు 27 (జనం సాక్షి) :** విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బీజేవైఎం నాయకులు గురువారం మెదక్ పట్టణంలోని రాందాస్ చౌరస్తా వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా బీజేవైఎం నాయకులు మాట్లాడుతూ.. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పెండింగ్‌లో ఉండటంతో విద్యార్థులు, వారి కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని బకాయిల చెల్లింపులో ప్రభుత్వం నిర్లక్ష్యం చేయరాదని పేర్కొన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు వాల్లాస్ మల్లేశం గౌడ్, ప్రధాన కార్యదర్శి రంజిత్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు ప్రసాద్‌తో పాటు బీజేవైఎం నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

- సంగారెడ్డి కలెక్టర్ కార్యాలయం ఎదుట ఉద్యోగుల
- జేఏసీ ఆధ్వర్యంలో మహాధర్నా



**సంగారెడ్డి, ఆగస్టు 27 (జనం సాక్షి) :** ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఉద్యోగుల జేఏసీ ఆధ్వర్యంలో గురువారం సంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. జిల్లాలోని వివిధ శాఖలకు చెందిన ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రభుత్వానికి డిమాండ్ చేశారు.ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న 6 డీఏలను వెంటనే మంజూరు చేయాలని, అలాగే ఉద్యోగుల ఐదు ప్రధాన డిమాండ్లను పరిష్కరించాలని జేఏసీ నాయకులు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించి తక్షణమే చర్యలు చేపట్టాలని కోరారు. ఎన్నికల సమయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఉద్యోగులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని నాయకులు డిమాండ్ చేశారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో జాప్యం చేయకుండా హామీలను నెరవేర్చాలని స్పష్టం చేశారు. ధర్నాలో జేఏసీ నాయకులు మాట్లాడుతూ.. ఉద్యోగుల హక్కులు, సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా పోరాటం కొనసాగిస్తామని తెలిపారు. పెండింగ్ డీఏలతో పాటు ఇతర సమస్యలను పరిష్కరించకపోతే భవిష్యత్‌లో మరింత విస్తృత స్థాయిలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగ సంఘాల నాయకులు, వివిధ శాఖల ఉద్యోగులు, జేఏసీ ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# భూములు కోల్పోయిన వారికి న్యాయం చేయడమే ప్రభుత్వ లక్ష్యం

- ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి
- బండరావిపాకుల ముంపు బాధితులకు రూ.8.33 కోట్ల పరిహారం
- 125 మంది నిర్వాసితులకు పరిహారం చెక్కులు పంపిణీ



**వనపర్తి బ్యూరో, ఆగస్టు 27 (జనంసాక్షి) :** నీటిపారుదల ప్రాజెక్టుల నిర్మాణంలో భూములు కోల్పోయిన నిర్వాసితులకు న్యాయం చేయడమే ప్రజా ప్రభుత్వ తొలి ప్రాధాన్యత అని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అన్నారు. ఎదుల రిజర్వాయర్‌లో భాగంగా బండరావిపాకుల ముంపు గ్రామ నిర్వాసితులకు గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో పరిహారం చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభితో కలిసి ఎమ్మెల్యే లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు.ఈ సందర్భంగా 125 మంది లబ్ధిదారులకు మొత్తం రూ.8.33 కోట్ల విలువైన పరిహారం చెక్కులను ఎమ్మెల్యే, కలెక్టర్ పంపిణీ చేశారు. ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి మాట్లాడుతూ సాగునీటి ప్రాజెక్టుల కోసం భూములు కోల్పోయిన రైతులకు న్యాయం చేయడం తమ తొలి ప్రాధాన్యత అని తెలిపారు. బండరావిపాకుల ముంపు బాధితులకు పరిహారం అందజేయడం సంతోషంగా ఉందన్నారు. తక్కువ వ్యవధిలోనే ప్రభుత్వం స్పందించి పరిహారం విడుదల చేయడం అభినందనీయమని, ఇందుకు ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.బండరావిపాకుల, కొంకలపల్లి ముంపు నిర్వాసితుల కోసం ప్రభుత్వం మొత్తం రూ.67 కోట్ల పరిహారం విడుదల చేసిందని ఎమ్మెల్యే వెల్లడించారు. ఇందులో భాగంగా బండరావిపాకులకు చెందిన 125 మంది లబ్ధిదారులకు రూ.8.33 కోట్ల పరిహారం అందిస్తున్నట్లు తెలిపారు. పరిహారం విడుదల ప్రక్రియలో కృషి చేసిన జిల్లా కలెక్టర్, ఆర్డీవో, రెవెన్యూ అధికారులు, ఇతర శాఖల అధికారులను అభినందించారు. మొత్తం 175 మందికి పరిహారం అందాల్సి ఉండగా, మరణించిన వారు, బ్యాంకు ఖాతాల సమస్యలు తదితర కారణాలతో కొందరికి ప్రస్తుతం చెక్కులు అందలేదని, వారికి కూడా త్వరలో పరిహారం అందజేస్తామని చెప్పారు.ముంపు పునరావాస గ్రామాల్లో ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ఎమ్మెల్యే తెలిపారు. బండరావిపాకుల, కొంకలపల్లి, నాగరాల ఆర్‌అండ్‌ఆర్ గ్రామాల్లో అర్హులైన వారికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని కోరినట్లు చెప్పారు. ఇళ్లు అవసరమైన ప్రతి అర్హ కుటుంబానికి ఇళ్లు కేటాయించేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు గ్రామాల సమీపంలో అర ఎకరం భూమిని కేటాయించే అంశంపై అధికారులకు ఆదేశాలు ఇస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. పర్యాటక శాఖ ద్వారా సుమారు రూ.2 కోట్ల నిధులు తీసుకువచ్చి స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేలా చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు.గ్రామాల్లో ఇప్పటికే బోర్‌వెల్ సౌకర్యం, బీటీ రోడ్లు, విద్యుత్ సౌకర్యాలు కల్పించామని, పెండింగ్‌లో ఉన్న నీటి ట్యాంకుల నిర్మాణం తదితర సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వం అందించిన పరిహారం మొత్తాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని, భవిష్యత్ అవసరాలకు ఉపయోగపడేలా ఆర్థికంగా ప్రణాళికాబద్ధంగా వినియోగించుకోవాలని సూచించారు. కలెక్టర్ ఆదర్శ్ సురభి మాట్లాడుతూ ముంపు బాధితులకు పరిహారం అందజేసేందుకు ప్రభుత్వం వేగంగా చర్యలు తీసుకుంటోందని తెలిపారు. ఎమ్మెల్యే, అధికారుల చొరవతో బండరావిపాకుల ముంపు బాధితులకు ప్రభుత్వం పరిహారం త్వరగా విడుదల చేసిందన్నారు. పరిహారం ద్వారా ప్రజలు తమ జీవనోపాధిని మరింత మెరుగ్గా కొనసాగించుకోవాలని కోరారు.ఈకార్యక్రమంలో ఆర్డీవో సుబ్రహ్మణ్యం, గోపాల్పేట మార్కెట్ కమిటీ చైర్మన్ వెంకటేష్, వైస్ చైర్మన్ సత్యశీలా రెడ్డి, ఆర్‌అండ్‌ఆర్ కమిటీ సభ్యులు, రెవెన్యూ అధికారులు, సర్పంచ్ రాజు, సంబంధిత శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, ముంపు బాధితులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ స్థలంలో అక్రమ డబ్బాలను తక్షణమే తొలగించాలి



**ఖిల్లా ఘనపురం, ఆగస్టు 27 (జనంసాక్షి) :** మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయ ప్రహరీ గోడకు ఆనుకుని ఉన్న ప్రభుత్వ స్థలాన్ని కొందరు అక్రమంగా ఆక్రమించి, అధికారుల అనుమతి లేకుండా డబ్బాలను ఏర్పాటు చేస్తున్నారని బిజెపి మండల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం బిజెపి మండల అధ్యక్షుడు బుచ్చి బాబు గౌడ్ నేతృత్వంలో నాయకులు తహశీల్దార్ బి. సుగుణకు వినతిపత్రం సమర్పించారు. ప్రభుత్వ స్థలాలను రక్షించాలని, తక్షణమే ఆ అక్రమ డబ్బాలను తొలగించి, స్థలానికి హద్దులు ఏర్పాటు చేసి ప్రభుత్వ స్థలంగా బోర్డు పెట్టాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు బుచ్చి బాబు గౌడ్ మాట్లాడుతూ, తహశీల్దార్ కార్యాలయం ఎదుటే ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేస్తుంటే అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించడం సరికాదన్నారు. తక్షణమే ఈ డబ్బాలను తొలగించకపోతే జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని హెచ్చరించారు. ఈ వినతిపై తహశీల్దార్ బి. సుగుణ సానుకూలంగా స్పందిస్తూ, ప్రభుత్వ స్థలంలో వేసిన డబ్బాలను పరిశీలించి తక్షణమే తగిన చర్యలు తీసుకుంటామని, వాటిని తొలగిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బిజెపి ఒబిసి మోర్చా జిల్లా కార్యదర్శి చిట్యాల రామచంద్రయ్య, మండల ప్రధాన కార్యదర్శి కొరిగెల గోపి ముదిరాజ్, నాయకులు కొత్తగళ్ల కేశన్న, వీరనాగుల ఆంజనేయులు, చెర్కా నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

## ఓటరు జాబితాలో పేర్లు తప్పు లేకుండా చూడాలి



**శివ్వంపేట, ఆగస్ట్ 27 (జనంసాక్షి) :** రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఓటరు జాబితా మూసాయిదా పై మండలంలోని అన్ని గ్రామాలలో గురువారం గ్రామసభలు జరిగాయి. మండల పరిధిలోని శభాష్ పల్లి గ్రామంలో సర్పంచ్ అయ్యగారి యాదగిరి అధ్యక్షతన జరిగిన సర్ ఓటర్ జాబితా మూసాయిదాపై గ్రామ సభ జరిగింది. ఇందులో పేర్లు తప్పు, అలాగే ఇతర మ్యాపింగ్ సమస్యలు మొత్తం 108 దరఖాస్తులు గ్రామ సభకు వచ్చాయి. వచ్చిన మొత్తం దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి, ఓటరు జాబితాలో తప్పులు ఉంటే సవరణ గావించి, బిఎల్ఓ లకు అందజేయాలని గ్రామ ప్రత్యేక అధికారి, ఉప తహసిల్దార్ బషీర్ పేర్కొన్నారు. అదేవిధంగా గ్రామ శివారులో గ్రామానికి చెందిన జే. ప్రశాంత్ అనే వ్యక్తి అక్రమంగా ప్రభుత్వ భూమిని కబ్జా చేస్తున్నారని ఉప తాసిల్దార్ కు గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. కబ్జాకోరు పై చర్యలు తీసుకొని ప్రభుత్వ భూమిని కాపాడాలని గ్రామసభ లో గ్రామస్తులు ముక్తకంఠంగా డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సర్పంచ్ అయ్యగారి యాదగిరి, ఉప సర్పంచ్ ఏ. ప్రశాంత్, పంచాయతీ కార్యదర్శి గీత, వార్డు సభ్యులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పంట మార్పిడి విధానాలతో రైతులకు మేలు

- జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

**గద్వాల నడిగడ్డ, ఆగస్టు 27 (జనం సాక్షి) :** పంట మార్పిడి విధానాలతో రైతులకు మేలు జరుగుతుందని, ప్రస్తుత ఎల్ నినో ప్రభావంతో వర్షాలు తక్కువగా కురుస్తున్నందున అన్నదాతలు ఆరుతడి పంటలు సాగు చేసేలా సంబంధిత అధికారులు ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. ఇండియన్ ఫార్మర్స్ ఫర్టిలైజర్ కోఆపరేటివ్ లిమిటెడ్ సహకారంతో, వ్యవసాయ, ఇఫ్కో క్రిడ సంస్థల ఆధ్వర్యంలో గురువారం ఐడిఓసి సమావేశపు మందిరంలో జిల్లాలోని వ్యవసాయ, ఉద్యాన శాఖల అధికారులకు నానో ఎరువులపై నిర్వహించిన అవగాహన సదస్సుకు కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. నకిలీ విత్తనాలు, ఎరువులు సరఫరా చేసే వారిపై కఠిన చర్యలను తీసుకోవాలని, అన్నదాతలకు నష్టం వాటిల్లకుండా సంబంధిత అధికారులు చిత్తశుద్ధితో పనిచేయలన్నారు. జూరాల ప్రాజెక్టుకు ఇన్ఫ్లో తగ్గడంతో రైతులు కాలువలు ద్వారా సాగునీటిపై ఎక్కువగా ఆధారపడకుండా కూరగాయలు, పప్పు దినుసులు వంటి స్వల్పకాలిక ఆరుతడి పంటలపై దృష్టి సారించాలన్నారు. ప్రస్తుతం ఖరీఫ్ లో పంటలు సాగు చేయని రైతులు రబీ సీజన్ కు త్వరగా వెళ్లే అవకాశం ఉన్నందున రబీ సీజన్‌లో కూడా వరికి బదులుగా ఆరుతడి పంటలు సాగు చేసేలా రైతులకు అవగాహన కలిగించాలన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన ఏడు రకాల వరి విత్తనాలకు మాత్రమే ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా బోనస్ చెల్లించడం జరుగుతుందని ఇప్పటికే ప్రకటించినందున అధికారులు ఆ రకాలను సాగు చేసిన రైతుల వివరాలను సంబంధిత పోర్టల్ లో అప్లోడ్ చేయాలన్నారు. పిఎండిడికేవై పారామీటర్స్ లో ఉన్నతి సాధించేలా వ్యవసాయ శాఖ అధికారులు పనిచేయాలన్నారు. ప్రకృతి, ఆర్గానిక్ వ్యవసాయాన్ని ప్రోత్సహించాలని, ప్రతి గ్రామం నుంచి చాంపియన్ ఫార్మర్స్ గుర్తించి డేటా పంపాలని ఆదేశించారు. వన మహోత్సవంను విజయవంతం చేసేందుకు సంబంధిత అధికారులతో సమన్వయంతో పని చేయాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలలు, అంగన్వాడి కేంద్రాల్లో న్యూట్రి గార్డెన్స్ కు కృషి చేయాలని పేర్కొన్నారు. జిల్లాలో రైతుల సంక్షేమానికి వ్యవసాయ శాఖ అధికారులు ఎల్లవేళలా క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉంటూ నిబద్ధతతో పనిచేయాలని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆదేశించారు. అనంతరం పలువురు రైతులు నానో యూరియాను వినియోగించి తాము సాగు చేసిన పంటల గురించి అనుభవాలను తెలియజేశారు.

ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వీరప్ప, ఉద్యానవన శాఖ అధికారి రాజ్ కుమార్, ఇఫ్కో మేనేజర్ కృపాశంకర్, క్రిడ సీనియర్ శాస్త్రవేత్త గిరిజాదేవి, ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



**విపత్తుల సమయంలో అప్రమత్తంగా ఉండాలి**

వరదలు,అగ్ని ప్రమాదాలు, తదితర విపత్తుల సమయంలో సంబంధిత శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని,దీనికి పక్కా ప్రణాళిక అవసరమని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. గురువారం కలెక్టరేట్లోనీ తన ఛాంబర్ లో జిల్లా డిజాస్టర్ మేనేజ్మెంట్ యాక్షన్ ప్లాన్ పై సంబంధిత అధికారులతో కలెక్టర్ సమావేశమై మాట్లాడారు. బీచుపల్లి, అలంపూర్, నది అగ్రహారం వంటి నదీ పరివాహక తీర ప్రాంతాల్లో అత్యవసర సమయంలో రక్షణ చర్యలు చేపట్టేందుకు సరైన ప్రణాళికతో ముందుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ నర్సింగరావు, డిపిఓ శ్రీకాంత్, అగ్నిమాపక కేంద్రం ఎస్పై రాకేష్, డి సెక్షన్ పర్యవేక్షకులు నరేందర్, తదితరులు పాల్గొన్నారు.

# సోదర భావానికి ప్రతీక రాఖీ పండుగ

- రాష్ట్ర ప్రజలకు రాఖీ పండుగ శుభాకాంక్షలు
- జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్లకు రాఖీలు కట్టిన మంత్రి దనసరి అనసూయ సీతక్క



**ములుగు ప్రతినిధి, ఆగష్టు 27(జనంసాక్షి) :** రాఖీ పండుగ సందర్భంగా రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటిసరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క, జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు, అదనపు కలెక్టర్లు సీహెచ్ మహేందర్, జి. సంపత్ రావులకు రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలిపారు. గురువారం ములుగులోని నూతన సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో రాఖీ పండుగను పురస్కరించుకొని ముందస్తుగా మంత్రి సీతక్క జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్లకు రాఖీలు కట్టారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క రాష్ట్ర ప్రజలందరికీ రాఖీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. సోదరసోదరీమణుల మధ్య ప్రేమానురాగాలు, అనుబంధానికి ప్రతీకగా నిలిచే రాఖీ పండుగను ప్రతి కుటుంబం ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని ఆకాంక్షించారు.

# ములుగు జిల్లా అభివృద్ధి వెలుగులతో విరాజిల్లాలి

- ఆరు నెలల్లో రహదారుల అభివృద్ధి పనులను పూర్తి చేయాలి
- అభివృద్ధి పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు
- మంత్రి దనసరి అనసూయ సీతక్క



**ములుగు ప్రతినిధి, ఆగష్టు 27(జనంసాక్షి) :** వెనుకబడిన ములుగు జిల్లాను అభివృద్ధి వెలుగులతో విరాజిల్లేలా అధికారులు చిత్తశుద్ధితో, బాధ్యతాయుతంగా పనిచేయాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటిసరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క సూచించారు. గురువారం ములుగులోని నూతన సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావుతో కలిసి ఇంజనీరింగ్ శాఖల పరిధిలో కొనసాగుతున్న అభివృద్ధి పనుల పురోగతిపై మంత్రి సీతక్క సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నీటిపారుదల, రహదారులు-భవనాలు, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్, గ్రామీణ నీటిసరఫరా, జాతీయ రహదారులు, గిరిజన సంక్షేమ ఇంజినీరింగ్, మిషన్ భగీరథ, తెలంగాణ వైద్య సేవలు-మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ, విద్యా-సంక్షేమ మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ, పర్యాటక శాఖల పరిధిలో కొనసాగుతున్న పనులను శాఖలవారీగా సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ, జిల్లాలో చేపట్టాల్సిన నూతన అభివృద్ధి పనులను గుర్తించి, సంబంధిత ప్రాజెక్టులకు సమగ్ర అంచనాలతో కూడిన ప్రతిపాదనలు సిద్ధం చేసి అందజేయాలని అధికారులను ఆదేశించారు. అభివృద్ధి పనుల పురోగతికి సంబంధించిన వివరాలను శాఖలవారీగా నమోదు చేయాలని సూచించారు. అభివృద్ధి పనుల అమలులో అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, విధుల నిర్వహణలో నిర్లక్ష్యం వహించే అధికారులు, పనులను సకాలంలో పూర్తి చేయని గుత్తేదారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమీక్ష సమావేశానికి గైర్హాజరైన అధికారులపై చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారు. రామప్ప-లక్నవరం గ్రావిటీ కెనాల్‌కు సంబంధించిన భూసేకరణ ప్రక్రియను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని నీటిపారుదల శాఖ అధికారులను ఆదేశించారు. దేవాదుల ఎత్తిపోతల పథకం ద్వారా గోదావరి జలాలను నిరంతరం రామప్ప సరస్సుకు తరలించే సాధ్యాసాధ్యాలను వెంటనే పరిశీలించాలని సూచించారు. రామప్ప సరస్సు నుంచి ములుగు నియోజకవర్గంలోని చెరువులు, కుంటలు, చెక్‌డ్యామ్‌లకు నీటిని తరలించేందుకు అవసరమైన ప్రణాళికలు, అంచనాలను రూపొందించాలన్నారు. రామప్ప ప్రాంతంలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేయడంతోపాటు నూతన పర్యాటక అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. మేడారం జాతర ప్రాంతంలో జంపన్నవాగు సుందరీకరణ పనులను త్వరితగతిన ప్రారంభించాలని సూచించారు. మేడారంలో నూతనంగా నిర్మించనున్న అతిథిగృహాన్ని రెడ్డిగూడెం ప్రాంతంలోని గుట్టపై నిర్మించే అవకాశాలను పరిశీలించాలన్నారు. మేడారం రింగ్‌రోడ్డు ఏర్పాటుకు ఉన్న అవకాశాలను పరిశీలించి, అవసరమైన ప్రతిపాదనలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు. గోదావరి పుష్కర ఘాట్ వరకు రహదారి నిర్మాణ పనులు చేపట్టాలని, ఇతర అభివృద్ధి పనులకు సంబంధించిన టెండర్ల ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. జిల్లాలో కొనసాగుతున్న రహదారుల అభివృద్ధి పనులకు అధిక ప్రాధాన్యం ఇచ్చి ఆరు నెలల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. స్టేడియం నిర్మాణ పనుల్లో వేగం పెంచి త్వరితగతిన అందుబాటులోకి తీసుకురావాలన్నారు. మల్లూరు ప్రాంతంలో నూతన మౌలిక సదుపాయాల కల్పనకు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. యంగ్ ఇండియా సమీకృత గురుకుల పాఠశాల, నర్సింగ్ కళాశాలతోపాటు జిల్లాలో కొనసాగుతున్న ఇతర భవన నిర్మాణ పనులను నిర్ణీత సమయంలో, నాణ్యతా ప్రమాణాలతో వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. అధికారులు విధి నిర్వహణను బాధ్యతగా భావిస్తూ ఉత్తమ పనితీరుతో ప్రజల ప్రశంసలు పొందాలని మంత్రి సూచించారు. అనంతరం మంత్రి సీతక్క మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ, జిల్లాలోని పాఠశాల భవనాల నిర్మాణ పురోగతిపై సమీక్షించినట్లు తెలిపారు. అభివృద్ధి పనులు, పెండింగ్‌లో ఉన్న పనులన్నింటినీ నిర్దిష్ట కాలపరిమితిలో పూర్తి చేసేలా కార్యాచరణ రూపొందించాలని అధికారులను ఆదేశించినట్లు పేర్కొన్నారు. జిల్లాలో సాగునీటి ప్రాజెక్టుల కోసం సుమారు రూ.200 కోట్లు మంజూరు చేసినట్లు వెల్లడించారు. రామప్ప-లక్నవరం అనుసంధాన పనులు, పొట్లాపూర్ ఎత్తిపోతల పథకం, రామచంద్రాపురం-మల్లంపల్లి ప్రాంతాల్లో కొనసాగుతున్న, చేపట్టబోయే పనుల పురోగతితోపాటు వాటికి అవసరమైన భూసేకరణ ప్రక్రియపై సమీక్షించినట్లు తెలిపారు. రామప్ప సరస్సును నింపడం వల్ల పరిసర ప్రాంతాల్లోని భూములు ముంపునకు గురవుతున్న నేపథ్యంలో అవసరమైన భూసేకరణ చేపట్టి, బాధిత రైతులకు నష్టపరిహారం చెల్లించేలా ప్రణాళికలు రూపొందించాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు. నీటిపారుదల శాఖ పరిధిలో అవసరమైన ఘాట్ల నిర్మాణంతోపాటు పెండింగ్‌లో ఉన్న అన్ని పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. అభివృద్ధి పనుల పురోగతిపై క్రమం తప్పకుండా సమీక్షలు నిర్వహించాలని సూచించినట్లు వెల్లడించారు. కొన్ని కార్యాలయాల్లో అధికారులు సక్రమంగా విధులకు హాజరుకాకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న విషయం తమ దృష్టికి వచ్చిందన్నారు. అధికారులు నిర్ణీత సమయానికి విధులకు హాజరుకావాలని, అనుమతి లేకుండా విధులకు గైర్హాజరైతే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. నిర్లక్ష్యంగా వ్యవహరించే అధికారులపై చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించినట్లు మంత్రి సీతక్క తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు సీహెచ్ మహేందర్, సంపత్ రావు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్, ఆత్మ కమిటీ డివిజన్ చైర్మన్ రవీందర్ రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

# కేంద్ర ప్రభుత్వ అనుసరిస్తున్న రైతు వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పోరాటాలు నిర్వహించాలి

- తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం అధ్యక్షుడు పోతినేని సుదర్శన్ రావు



**ఏటూరునాగారం, ఆగష్టు 27(జనంసాక్షి) :** మండల కేంద్రంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బుధవారం రైతు సంఘం విస్తృత స్థాయి సమావేశం ఎండి గఫూర్ పాషా అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో మొదట ఇటీవల మరణించిన సారంపల్లి మల్లారెడ్డి రైతు సంఘం ఆలిండియా ఉపాధ్యక్షుడు కి మొదట సమావేశం సంతాపం తెలిపింది. అనంతరం జరిగిన సభలో పోతినేని సుదర్శన్ రావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం గత 12సంవత్సరాల నుండి రైతు వ్యతిరేక విధానాలు అవలంబిస్తూ మూడు వ్యవసాయ చట్టాలు తెచ్చినారు ఈ చట్టానికి వ్యతిరేకంగా రైతులు 385 రోజులు పోరాటం చేసి నల్ల చట్టాలను వెనుక గొట్టడం జరిగింది. అయినా దొడ్డి దారిన ప్రైవేటు విత్తన చట్టం తెచ్చి విత్తనాలపై రైతులకు కాకుండా కార్పొరేట్ శక్తులకు లాభం చేకూర్చే విధంగా చట్టాలు మార్చారని అంతే కాకుండా కేంద్ర ప్రభుత్వం నూతన వాణిజ్య విధానం పేరుతో అమెరికా, కెనడా, న్యూజిలాండ్ దేశంలోకి విదేశీ వ్యవసాయ ఉత్పత్తులు బార్ల తలుపులు తెరిచి 52 శాతం వ్యవసాయ రంగం పై ఆధారపడ్డ మన దేశ వ్యవసాయ రంగాన్ని కూలీలను బలి పశువులు చేయడం కోసం చట్టాలు తెచ్చారని దీనికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ఆందోళన చేయాలని పిలుపునిచ్చారు. తెలంగాణ రైతు సంఘం రాష్ట్రంలో అనేక రైతు వ్యతిరేక విధానాల కు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమం నిర్వహించామని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రంలో 36వ అఖిలభారత మహాసభలు నల్లగొండ జిల్లాలో నవంబర్ 15 నుండి 18 వరకు జరగనున్నాయని ఈ మహాసభల జయప్రదానికి రైతులందరూ కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం సీనియర్ నాయకులు సూడి కృష్ణారెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మచ్చ వెంకటేశ్వర్లు, తుమ్మల వెంకట్ రెడ్డి, రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఎండి దావూద్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి, తీగల ఆదిరెడ్డి, చిట్టెం ఆదినారాయణ, వడకాపురం సారయ్య, ఎండి యాకూబ్, బండారి నరసింహులు, ఎల్పి ముత్యాలు, మంచాల రామారావు, గుండు రామస్వామి తదితరులు పాల్గొన్నారు.


# ఉల్లాసంగా.. ఉత్సాహంగా బంజారాల తీజ్ ఉత్సవాలు

- ఆటపాటల నడుమ ఆనందోత్సాహాలు



**వరంగల్ ఈస్ట్, ఆగస్టు 27 (జనం సాక్షి) :** వరంగల్ నగరంలోని రంగసాయిపేటలో గురువారం రాత్రి స్థానిక బంజారా మహిళలు, పురుషులు తీజ్ ఉత్సవాల్లో భాగంగా తొమ్మిదవ రోజు స్థానిక బెస్తం చెరువులో నిమజ్జన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమాన్ని ఉత్సాహంగా నిర్వహించారు. సందర్భంగా మహిళలు పెద్ద ఎత్తున హాజరై డాన్సులు చేస్తూ ఆనందాన్ని కలిగించారు. ప్రతి సంవ త్సరం ఇదేవిధంగా తీజ్ ఉత్సవాలను నిర్వహి స్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గూగులోత్ రాము నాయక్, బాదావత్ సీతా రాం నాయక్, బానోత్ మల్సూర్ నాయక్, బానోత్ మహేశ్వర్ నాయక్, బానోత్ వీరన్న నాయక్, భూక్య రవీందర్ నాయక్, మునావత్ హనుమంతు నాయక్, బానోత్ నాగమణి, గుగులోత్ సోనా భాయి, బానోత్ విజయ భాయి, బాదావత్ విజయ భాయి పాల్గొన్నారు.

# స్కానింగ్ సెంటర్‌లపై నిఘా పెంచాలి



- లింగ నిర్ధారణ పరీక్షల నియంత్రణ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలి
- లింగ నిర్ధారణ పరీక్షల నియంత్రణ చట్టం కమిటీ సమావేశం
- పాల్గొన్న జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి

**హనుమకొండ ప్రతినిధి ఆగస్టు 27 (జనం సాక్షి) :** గర్భస్థ పిండ లింగ నిర్ధారణ పరీక్షల నియంత్రణలో భాగంగా అనుమానాస్పద ఆసుపత్రులు, స్కానింగ్ సెంటర్ లపై ప్రత్యేక నిఘా పెంచాలని జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అన్నారు.గురువారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో గర్భస్థ పిండ లింగ నిర్ధారణ పరీక్షల నియంత్రణ చట్టం కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. మూడు నెలల కాలంలో జిల్లాలో స్కానింగ్ సెంటర్లలో చేపట్టిన తనిఖీల గురించిన వివరాలను జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ అప్పయ్య ను జిల్లా కలెక్టర్ అడిగి తెలుసుకుని, వాటి నివేదికలను పరిశీలించారు. అలాగే అనుమతుల కోసం వచ్చిన దరఖాస్తులను పరిశీలించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ గర్భస్థ పిండ లింగ నిర్ధారణ పరీక్షల నియంత్రణలో భాగంగా అనుమానస్పద స్కానింగ్ సెంటర్లపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. అనుమానాస్పద ఆసుపత్రులు, స్కానింగ్ సెంటర్ లపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలన్నారు. అలాగే లింగ నిర్ధారణ కు సంబంధించిన సమాచారం ఇచ్చిన వారికి రూ.50 వేల పారితోషికం ఇస్తామని తెలిపారు. అనుమతి పొందిన డాక్టర్ కాకుండా ఇతరులు స్కానింగ్ పరీక్షలు చేస్తున్నట్లుగా గుర్తిస్తే తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో ట్రైనీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రోహిత్ నేత, జిల్లా సంక్షేమ అధికారి విశ్వజ, మాతా శిశు సంక్షేమం ప్రోగ్రాం అధికారి డాక్టర్ రజిత ,ఎస్. బి. ఇన్స్పెక్టర్ ఒంటేరు రమేష్, బన్ను ఎన్జీఓ నుండి శ్రీమతి నీతా,డెమో వి. అశోక్ రెడ్డి, పద్మజ తదితరులు పాల్గొన్నారు.

# చలో ఐటిడిఏ ఏటూరునాగారం ఆదివాసీ మార్చ్‌ను విజయవంతం చేయండి

- తుడుం దెబ్బ రాష్ట్ర ఉపాధ్యక్షులు పులిశే బాలకృష్ణ



**ఏటూరునాగారం, ఆగష్టు 27(జనంసాక్షి) :** తుడుం దెబ్బ ములుగు జిల్లా అత్యవసర సమావేశం తుడుం దెబ్బ జిల్లా ప్రధాన కార్యదర్శి పాయం కోటేశ్వరరావు అధ్యక్షతన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ముఖ్య అతిథులుగా పులిశె బాలకృష్ణ పాల్గొని తుడుం దెబ్బ రాష్ట్ర కమిటీ నిర్ణయం మేరకు తెలంగాణ రాష్ట్రంలోని 4 ఐటిడిఏ ముట్టడిలో భాగంగా ఐటీడిఏ ఏటూరునాగారం లోని కొమరం భీమ్ విగ్రహం వద్ద చలో ఐటీడిఏ ఆదివాసీ మార్చ్ విజయవంతం చేయాలనీ పిలుపునివ్వడం జరిగింది. ఈకార్యక్రమంలో భాగంగా అయన మాట్లాడుతూ ఆదివాసీ నిరుద్యోగులకు షెడ్యూల్ ప్రాంత 29 శాఖలలో 100% జీవోలను చట్టం చేయాలనీ డిమాండ్ చేశారు. అదే విదంగా జీవో 57 ప్రకారం సింగిల్ లైన్ అడ్మినిస్ట్రేషన్ ఏజెన్సీ ఏరియాలో పరిపాలన జరగాలని డిమాండ్ చేశారు. అక్రమంగా 50 ఏళ్లుగా ఎస్టీ జాబితాలో లంబాడీలు చొ రబడి ఆదివాసీల విద్య పాఠశాల స్థాయి నుండి ఐటిఐ, నీట్, క్లాట్, ఉన్నత స్థాయి యూనివ ర్సిటీ విద్యను దోచుకుంటున్నారు. స్వీపర్ స్థాయి నుండి సివిల్ సర్వీసెస్ వరకు 90 శాతం ఉద్యోగాలు గ్రూప్ 1, 2, 3, 4, అన్ని రకాలు ఉద్యోగాలు దోచుకుంటున్నారు ఆదివాసీల యొక్క 95% ఉద్యోగాలు కూడా షెడ్యూల్ ప్రాంత అటవీ ఉద్యోగాలను కూడా దోసుకుంటున్నారులి. అదేవిధంగా పేస చట్టం 1998 ను ఏజెన్సీ లో గ్రామస్థాయి లో పక్కడబందిగా అమలయ్యే విధంగా యువకులు అధికారుల యొక్క తలలు వంచి అమలయ్యే విధంగా కొట్లాడాలని పిలుపునిస్తున్నారు. అందులో భాగంగా సెప్టెంబర్ 7న చలో ఐటిడిఏ ఏటూరునాగారం విజయవంతం చెయ్యాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పోస్టర్ ఆవిష్కరణ కొమరం భీమ్ విగ్రహం దగ్గర చేయడం జరిగింది. అదేవిధంగా ఆకుల వారి గణపురం క్రాస్ రోడ్డు ఎస్టీ కాలనీలో పోస్టర్ ఆవిష్కరణ చేశారు. ఈ కార్యక్రమంలో ఈసం యాదయ్య, మన్య సీమ పరిరక్షణ సమితి డోలు దెబ్బ నాయకులు లక్ష్మీ, సావిత్రి, గవిడి నాగబాబు, తుడుం దెబ్బ ములుగు జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ దెబ్బగట్ల శ్రీకాంత్, ఆదివాసీ విద్యార్థి జిల్లా అధ్యక్షులు పోడెం శోభన్, డివిజన్ అధ్యక్షులు కొప్పుల జగన్నాధ రావు, కొమరం అబ్బయ్య, మోకాళ్ళ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# తృటిలో తప్పిన ఆర్టీసీ బస్సు ప్రమాదం



**జన్నారం, ఆగస్టు 27 (జనం సాక్షి):** ఆదిలాబాద్ నుంచి వరంగల్ వెళ్తున్న ఆర్టీసీ బస్సు ప్రమాదం తృటిలో తప్పింది. గురువారం ఉడుంపూర్-ఇందన్‌పల్లి మాం గ్గమధ్యంలో ఈ ఘటన చోటుచేసుకుంది. రోడ్డు వేగాన్ని తగ్గించేందుకు ఏర్పాటు చేసిన గేట్ల వద్ద ఎదురెదురుగా వాహనాలు రావడంతో బస్సు రోడ్డుకు పక్కకు దిగాల్సి వచ్చింది. దీంతో బస్సు టైర్లు రోడ్డు దిగువకు దిగబడి, బస్సు ఒకవైపు వంగిపోయింది. ఆ సమ యంలో బస్సులో 120 మందికి పైగా ప్రయా ణికులు ఉన్నట్లు సమాచారం. అయితే డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించి వెంటనే బస్సును నిలిపివేయడంతో పెను ప్రమాదం తప్పింది.

# ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల పురోగతిని సాధించాలి



**కాజీపేట ఆగస్టు 27(జనం సాక్షి) :** ఇందిరమ్మ ఇండ్ల పురోగతిని పరిశీలించిన చీఫ్ ఇంజనీర్ చైతన్య కుమార్ హను మకొండ జిల్లాలోని పలు డివిజన్లలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల పురోగతిని క్షేత్రస్థాయిలో రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ చీఫ్ ఇంజనీర్ ఎం.చైతన్య కుమార్ అధికారులతో కలిసి గురువారం రోజున పరిశీలించారు. కాజీపేట, ఫాతిమా నగర్, మచిలీ బజార్, సుధా నగర్, యాదవ నగర్ ప్రాంతాలలో రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల పురోగతిని పరిశీలించి లబ్ధిదారులతో చీఫ్ ఇంజనీర్ చైతన్య కుమార్ మాట్లాడారు. త్వరగా ఇండ్ల నిర్మాణాలు పూర్తి చేసుకోవాలని లబ్ధిదారులకు సూచించారు.

# మాదక ద్రవ్యాల నియంత్రణ దిశగా అధికారులు చర్యలు చేపట్టాలి

- మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**మంచిర్యాల ప్రతినిధి, ఆగస్టు 27 (జనంసాక్షి) :** జిల్లాలో మాదకద్రవ్యాల నియంత్రణ దిశగా అధికారులు పకడ్బందీగా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ సమావేశ మందిరంలో డిసిపి ఎ. భాస్కర్, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య, బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్ లతో కలిసి జిల్లాలో మాదకద్రవ్యాల నియంత్రణపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... మాదక ద్రవ్య రహిత మంచిర్యాల జిల్లా సాధనలో భాగంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో ఈ సంవత్సరం ఇప్పటి వరకు 49 కేసులు నమోదు చేయడం జరిగిందని, ఇందులో 103 మందిని గుర్తించడం జరిగిందని తెలిపారు. మాదకద్రవ్యాల వినియోగదారులను గుర్తించి కోర్టు ద్వారా 30 మందిని డ్రగ్ డి-అడిక్షన్ కేంద్రాలకు తరలించి కౌన్సిలింగ్ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. విద్యా సంస్థలలో విద్యార్థులచే యాంటీ డ్రగ్ కమిటీలను ఏర్పాటు చేయడం జరిగిందని, వారి ద్వారా ప్రతి నెల అవగాహన కార్యక్రమాలు, మాదకద్రవ్యాల నియంత్రణపై క్విజ్, డ్రాయింగ్ మొదలగు పోటీలను నిర్వహించాలని తెలిపారు. విద్యాసంస్థలకు 100 మీటర్ల పరిధిలో బెల్ట్ షాపులు నిర్వహించడం, పొగాకు సంబంధిత ఉత్పత్తులను అమ్మడం నిషేధించడం జరిగిందని, ఆ దిశగా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. మెడికల్, ఐటిఐ, ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలలలో నిత్యం మాదక ద్రవ్యాల వినియోగంపై విద్యార్థులను గమనిస్తూ మాదక ద్రవ్యాల వినియోగం వలన కలిగే నష్టాలపై అవగాహన కల్పించాలని తెలిపారు. జిల్లాలోని మద్యం దుకాణాలు నిర్ణీత సమయానికి మూసివేసేలా చర్యలు తీసుకోవాలని, బెల్ట్ షాపులను నియంత్రించాలని తెలిపారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో గంజాయి తదితర మొక్కల సాగు చేసే వారిని గుర్తించాలని తెలిపారు. డ్రగ్ ఇన్స్పెక్టర్ ఆధ్వర్యంలో మెడికల్ షాప్ లను నిత్యం పర్యవేక్షించాలని, సరైన ప్రిస్క్రిప్షన్ లేకుండా మందులను విక్రయించే షాపులపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు.

# చికిత్స పొందుతూ రెండు నెలల బాలుడి మృతి

- తల్లడిల్లిన తల్లి.. 108 సిబ్బంది సమయస్ఫూర్తితో ప్రాణాలు కాపాడినా.. గంటలోనే మృత్యు ఒడిలోకి..



**లక్ష్మణ చందా, ఆగస్టు 27 (జనం సాక్షి):** లక్ష్మణ చందా మండలంలోని బాబాపూర్-వడ్డేపల్లి మధ్య గురువారం జరిగిన ఆటో ప్రమాదం తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. ఆటో అదుపుతప్పి వరి పొలంలోకి దూసుకెళ్లి బోల్తా పడిన ఘటనలో ఐదుగురు గాయపడగా, వారిలో రెండు నెలల చిన్నారి కూడా ఉన్నాడు. ప్రమాదంలో పాతని దివ్య (21), భర్త హర్షిత్తో పాటు వారి రెండు నెలల బాబు తీవ్రంగా గాయపడ్డాడు. ప్రమాద తీవ్రతకు బాలుడు అపస్మారక స్థితిలోకి వెళ్లడంతో కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. బాలుడి పరిస్థితిని చూసి తల్లి కన్నీరుమున్నీరుగా విలపించింది. సమాచారం అందుకున్న 108 సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని బాలుడిని పరిశీలించారు. పల్స్ రేటు చాలా తక్కువగా ఉన్నట్లు గుర్తించిన 108 సిబ్బంది సురేష్ వెంటనే సీపీఆర్ నిర్వహించారు. దీంతో బాలుడు తిరిగి ఊపిరి పీల్చుకోవడంతో కుటుంబ సభ్యులు కొంత ఊరట చెందారు. అనంతరం క్షతగాత్రులను 108 అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలించారు. అయితే ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాలుడి పరిస్థితి విషమించడంతో కేవలం గంట వ్యవధిలోనే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. దీంతో అప్పటివరకు బాలుడి ప్రాణాలను కాపాడేందుకు చేసిన ప్రయత్నాలు ఫలించకపోవడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. రెండు నెలల పసిబిడ్డ మృతితో బాబాపూర్, వడ్డేపల్లి పరిసర ప్రాంతాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి. ప్రమాదం నుంచి బయటపడతాడని ఆశించిన కుటుంబ సభ్యులకు బాలుడి మృతి తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. 108 సిబ్బంది సురేష్ సమయస్ఫూర్తితో బాలుడికి అత్యవసర చికిత్స అందించినప్పటికీ, పరిస్థితి విషమించడంతో మృత్యువును తప్పించలేకపోయారు.

# విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలి

- కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ కె.హరిత



**కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, ఆగస్టు 27(జనంసాక్షి ):** ప్రభుత్వ పాఠశాలలలో చదివే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని జనకాపూర్ లో గల ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు ఏర్పాటు చేసిన ఏకరూప దుస్తులు, బూట్లు, పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు, దుప్పట్ల పంపిణీ కార్యక్రమానికి హాజరై విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఉపాధ్యాయులు విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధించాలని, తరగతిలో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని, వారికి ప్రత్యేక తరగతులు నిర్వహించాలని తెలిపారు. తెలిపారు. విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని, పాఠశాలకు గైర్హాజరు అవుతున్న విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడి క్రమం తప్పకుండా విద్యార్థులు పాఠశాలకు వచ్చేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని తెలిపారు. ఇంగ్లీష్,గణితం, సైన్స్ సబ్జెక్టులలో విద్యార్థులు పట్టు సాధించేలా ప్రయోగాత్మకంగా బోధించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి అంబాజీ, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి దత్తారావు, జి.సి.డి.ఓ. శకుంతల, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## సీఎంసీ పరిధి అనధికార నిర్మాణాలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ చర్యలు



**శేరిలింగంపల్లి, ఆగస్టు 27 (జనంసాక్షి) :** సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్(సిఎంసి) పరిధిలో అనధికార నిర్మాణంలో ఉన్న భవనాలపై కొనసాగుతున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ డ్రైవ్‌లో భాగంగా గురువారం మూడు జోన్లలో క్షేత్రస్థాయి తనిఖీలు నిర్వహించి వాటి విషయంలో అవసరమైన చర్యలను తీసుకోవడం జరిగింది. ఈ తనిఖీల్లో దాదాపు 54 అనధికార నిర్మాణాలను అధికారులు గుర్తించినట్లు పేర్కొన్నారు. వీటిలో 21 అనధికార నిర్మాణాలను కూల్చివేయగా, 14 ఆక్రమణలకు నోటీసులను గారి చేయడంతో పాటు మరో అధికార నిర్మాణాన్ని సీఎం సి అధికారులు స్పాట్ లోనే సీజ్ చేయడం విశేషం. ఈ క్రమంలో మిగిలిన 33 కేసులను తదుపరి కూల్చివేత మరియు ఇతర ఎన్‌ఫోర్స్‌మెంట్ చర్యల కోసం నిర్దేశిత విధానం మరియు వర్తించే నిబంధనల ప్రకారం చర్యలను తీసుకొని ఉన్నామని అధికారులు తెలిపారు. సిఎంసి పరిధిలోని మూడు జోన్ల వారీగా కూల్చివేతలు శేరిలింగంపల్లి జోన్ పరిధిలో 9, కూకట్పల్లి జోన్ పరిధిలో ఆరు నిర్మాణాలు, కుత్బుల్లాపూర్ జోన్ పరిధిలో 6 ఉన్నాయని ఉన్నతాధికారులు వివరించారు. ఇందులో భాగంగా సిఎంసి పరిధిలోని అనధికార నిర్మాణాలపై ప్రతిరోజూ క్షేత్రస్థాయి తనిఖీలు మరియు కఠిన పర్యవేక్షణ కొనసాగించాలని సంబంధిత టౌన్ ప్లానింగ్ మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలను సిఎంసి కమిషనర్ డాక్టర్ జి. సృజన ఆదేశించారు. అయితే భవన నిర్మాణ నిబంధనల అమలును నిర్ధారించేందుకు సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్‌ఫోర్స్‌మెంట్ చర్యలను కొనసాగిస్తూ గుర్తించిన అన్ని అనధికార నిర్మాణాలపై నిర్దేశిత విధానం మరియు వర్తించే నిబంధనల ప్రకారం అవసరమైన చర్యలను కచ్చితంగా చేపట్టడం జరుగుతుందని ఆమె తెలిపారు.

## చండూరు మార్కెట్ యార్డులో ధాన్యం చోరీ కేసును ఛేదించిన పోలీసులు

- ధాన్యం చోరీ కేసులో 12 మంది నిందితుల గుర్తింపు
- 11 మంది నివేతులను అరెస్టు చేసిన చండూరు పోలీసులు..
- రూ.9.80 లక్షల నగదు, 11 సెల్‌ఫోన్లు, బొలెరో వాహనం స్వాధీనం..
- పరారీలో ఉన్న (ఎ.12) నల్ల స్వామి కోసం గాలింపు..
- నిందితులపై బి.ఎన్ఎస్ సెక్షన్ల కింద కేసు నమోదు..

**చండూరు, ఆగస్టు 27 (జనంసాక్షి) :** చండూర్ వ్యవసాయ మార్కెట్‌యార్డులో నిల్వ ఉంచిన ప్రభుత్వ ధాన్యాన్ని దొంగిలించి సూర్యాపేట మార్కెట్‌లో విక్రయించిన ముగ్గురు వ్యక్తులను, ఆ దొంగతనాన్ని గుర్తించి నిందితులను బెదిరించి రూ.5 లక్షలు వసూలు చేసిన ఎనిమిది మందిని చండూర్ పోలీసులు అరెస్టు చేశారు. ఈ కేసులో మొత్తం 11 మందిని అరెస్టు చేయగా, మరో నిందితుడు పరారీలో ఉన్నాడు. దొంగతనం నిందితులు: (ఎ-1) నాగిళ్ల ఆంజనేయులు, (ఎ-2) బొమ్మోజు ప్రకాష్, (ఎ-3) మేతరి నగేష్, దోపిడీ నిందితులు: (ఎ-4) దోటి వెంకన్న, (ఎ-5) వేముల పవన్, (ఎ-6) ధోటి శివ, (ఎ-7) భీమనపల్లి గణేష్, (ఎ-8) ధోటి నరేష్, (ఎ-9) గండూరి మల్లేష్, (ఎ-10) బేత వెంకన్న, (ఎ-11) గోల్కొండ శేఖర్, (ఎ-12) నల్ల స్వామి, ఉన్నట్లు తెలిపారు. నిందితుల నుంచి రూ.9.80 లక్షల నగదు, 11 సెల్‌ఫోన్లు, బొలెరో వాహనం (టీఎస్ 07 యూకే 4505)ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.నల్లగొండ డీఎస్పీ కె.



శివరాంరెడ్డి పర్యవేక్షణలో, చండూర్ సీఐ టి. రాము ఆధ్వర్యంలో ఎస్ఐ జె. శివకుమార్, సిబ్బంది దర్యాప్తు చేపట్టి కేసును ఛేదించారు. గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో సీఐ టి. రాము, ఎస్ఐ జె. శివకుమార్ కేసు వివరాలను వెల్లడించారు.చండూర్ వ్యవసాయ మార్కెట్ గోదాంలో 2025--26 ఖరీఫ్, రబీ సీజన్లకు సంబంధించిన ప్రభుత్వ ధాన్యంలో సుమారు 25 వేల క్వింటాళ్లు నిల్వ చేశారు. దశలవారీగా ధాన్యాన్ని మిల్లుకు తరలించిన తర్వాత సుమారు 13 వేల క్వింటాళ్లు గోదాంలో ఉండాల్సి ఉంది. అయితే గోదాంను పరిశీలించగా షట్టర్ తాళం వద్ద ధాన్యం చిందరవందరగా ఉండటం, బస్తాలు లాగిన ఆనవాళ్లు కనిపించాయి. లెక్కలు పరిశీలించగా సుమారు 600 నుంచి 700 బస్తాల ధాన్యం, సుమారు రూ.7 లక్షల విలువైన సరుకు కనిపించకుండా పోయినట్లు గుర్తించారు.దీనిపై గోదాం నిర్వాహకుడు, ఫిర్యాదుదారు తెలుకుంట్ల శ్రీనివాసులు ఈ నెల 22న చండూర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.విచారణలో ప్రధాన నిందితుడు నాగిళ్ల ఆంజనేయులు చండూర్ వ్యవసాయ మార్కెట్‌లో వ్యాపారం చేస్తూ.. అప్పుడప్పుడు హమాలీగా కూడా పనిచేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. సుమారు రెండు నెలల క్రితం మార్కెట్‌లోని గోదాం తాళం అతడి చేతికి చిక్కిందని, దానిని ఉపయోగించి రాత్రి వేళల్లో బొలెరో వాహనంలో ధాన్యాన్ని లోడ్ చేసి సూర్యాపేట మార్కెట్‌లో విక్రయించినట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది.అతడికి బొమ్మోజు ప్రకాష్, మెతరి నాగేష్ సహకరించినట్లు పోలీసులు తెలిపారు. ఇదే క్రమంలో జూలై 18న రాత్రి ధాన్యం దొంగిలిస్తుండగా ఏ-1, ఏ-2లను మరో ఎనిమిది మంది పట్టుకున్నారు. దొంగతనం విషయాన్ని పోలీసులకు చెబుతామని, చంపేస్తామని బెదిరించి ఏ-1 నుంచి రూ.5 లక్షలు వసూలు చేసినట్లు విచారణలో తేలింది.దొంగతనం చేస్తున్న వ్యక్తులను బెదిరించే సమయంలో ఏ-4 నుంచి ఏ-11 వరకు నిందితులు వీడియోలు, ఫొటోలు తీసినట్లు పోలీసులు తెలిపారు. ధాన్యాన్ని దొంగతనంగా విక్రయిస్తున్న విషయం ఏ-12 నల్ల స్వామికి ఏ-4 ద్వారా తెలిసిందని, అతడు సంఘటనా స్థలానికి వెళ్లి కొంతసేపు ఉండి అక్కడి నుంచి వెళ్లిపోయినట్లు పోలీసులు వెల్లడించారు. ఏ-12 ప్రస్తుతం పరారీలో ఉన్నాడు.నిందితుల నుంచి మొత్తం రూ.9.80 లక్షల నగదు, 11 సెల్‌ఫోన్లు, ధాన్యం తరలించేందుకు ఉపయోగించిన బొలెరో వాహనాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. చండూర్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.కేసును త్వరితగతిన ఛేదించిన సిబ్బందిని నల్లగొండ ఎస్పీ శరత్‌చంద్ర పవార్, ఐపీఎస్ అభినందించారు. దర్యాప్తులో ఎస్ఐ జె. శివకుమార్‌తో పాటు సిబ్బంది ఈ. శివరాం, వి. రమేష్, ఏ. నరేందర్, బి. రాజు, కె. కృష్ణ కౌశిక్ కీలకంగా వ్యవహరించారు.

# ఖమ్మంలో ఉద్యోగుల మహాధర్నా

- భారీ వర్షాన్ని లెక్కచేయకుండా తరలివచ్చిన వేలాది మంది
- న్యాయమైన డిమాండ్ల పరిష్కారానికి ప్రభుత్వానికి విజ్ఞప్తి



ఖమ్మం, ఆగస్టు 27 (జనంసాక్షి) : ఉద్యోగుల న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోరుతూ తెలంగాణ ఉద్యోగుల సంయుక్త కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో గురువారం ఖమ్మం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం ఎదుట మహాధర్నా నిర్వహించారు. ఉదయం నుంచి భారీ వర్షం కురుస్తున్నా జిల్లావ్యాప్తంగా వివిధ ఉద్యోగ, ఉపాధ్యాయ, గెజిటెడ్ అధికారులు, పెన్షనర్లు, కాంట్రాక్టు, ఔట్సోర్సింగ్ ఉద్యోగ సంఘాలకు చెందిన సుమారు ఐదు వేల మంది తరలివచ్చారు. మహాధర్నాకు కమిటీ జిల్లా చైర్మన్, టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు గుంటుపల్లి శ్రీనివాసరావు అధ్యక్షత వహించగా, జిల్లా కన్వీనర్ కొంగర వెంకటేశ్వరరావు సమన్వయం చేశారు. ఉదయం పది గంటలకు ప్రారంభమైన కార్యక్రమం మధ్యాహ్నం రెండు గంటల వరకు కొనసాగింది. ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని నాయకులు డిమాండ్ చేశారు.

### ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

గుంటుపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఉద్యోగులు ప్రభుత్వానికి వ్యతిరేకం కాదని, ప్రభుత్వ కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేస్తూ ప్రజలకు సేవలందిస్తున్న ఉద్యోగుల న్యాయమైన సమస్యలను కూడా ప్రభుత్వం పరిష్కరించాలని కోరారు.

### కలెక్టరేట్‌కు భారీ ర్యాలీ

మహాధర్నా అనంతరం ఉద్యోగులు భారీ ర్యాలీగా కలెక్టరేట్‌కు తరలివెళ్లారు. అనంతరం తెలంగాణ ఉద్యోగుల సంయుక్త కార్యాచరణ కమిటీ నాయకులు, వివిధ ఉద్యోగ సంఘాల ప్రతినిధులు జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. రెండో వేతన సవరణ సంఘం అమలు, ఆరు కరువు భత్యాల విడుదల, పెండింగ్ బిల్లుల చెల్లింపు, ఆరోగ్య పథకం సమర్థవంతమైన అమలు, నూతన పెన్షన్ విధానం రద్దు, పాత పెన్షన్ విధానం పునరుద్ధరణ తదితర డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. మహాధర్నాలో పెన్షనర్లు, తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ సమాఖ్య, తెలంగాణ ప్రాథమిక ఉపాధ్యాయ సమాఖ్య, మున్సిపల్ ఫోరం, నీటిపారుదల ఫోరం తదితర సంఘాల ప్రతినిధులు పాల్గొని సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో టి. సునీల్ రెడ్డి, పారుపల్లి నాగేశ్వరరావు, కట్ట శేఖర్, రంగారావు, రాయల నరసింహారావు, ఎస్.కే. రంజాన్, దుర్గా భవానీ, రాజేష్, విజయ్, వెంగలరావు, మోదుగు వేలాద్రి, కొణిదేన శ్రీనివాస్, ఎం. సుబ్బయ్య, టి. వేణు, వీరస్వామి, మల్లెల రవీంద్ర ప్రసాద్, యలమద్ది వెంకటేశ్వర్లు, బిక్కు, వెంకట రమణ, వెంకటేశ్వర్లు, వేంకటపతి రాజు, ధరావత్ రాములు, మట్టా శ్రీనివాస్, సింగారపు వేణు తదితరులు పాల్గొన్నారు.

## వైరా మున్సిపాలిటీలో పారిశుధ్య నిర్వహణను మెరుగుపర్చాలి

- జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్



**ఖమ్మం/ వైరా, ఆగస్టు 27 (జనం సాక్షి) :** వైరా మున్సిపాలిటీ పరిధిలో పారిశుద్ధ్యం, రోడ్లు, విద్యుత్, త్రాగునీరు, పౌర సేవల మెరుగుదలకు ప్రత్యేక చొరవ చూపాలని, పట్టణంలో ప్రజలకు మౌళిక వసతులను గుర్తించి ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి పనులు చేపట్టాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అన్నారు. గురువారం జిల్లా కలెక్టర్, వైరా పురపాలక కార్యాలయంలో పట్టణ అభివృద్ధి, పారిశుద్ధ్యం, పురపాలక ఆర్థిక స్థితిగతులపై స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పి. శ్రీజ తో కలిసి సంబంధిత అధికారులతో సమీక్షించారు. వైరా మున్సిపాలిటీ కి మంజూరు చేసిన అభివృద్ధి పనులు, పురోగతి, డంపింగ్ యాడ్, రోజు వారి తడి, పొడి చెత్త సేకరణ, పన్నుల వసూళ్ల వివరాలు, జరుగుతున్న అభివృద్ధి పనులు, ఆర్థిక సంఘం నిధులు, డిఎంఎఫ్టీ నిధులు, నియోజకవర్గ అభివృద్ధి నిధులు, ప్రత్యేక అభివృద్ధి నిధుల ద్వారా చేపట్టిన పనుల వివరాలు, వాటి స్థితిగతులను కలెక్టర్ అధికారులను అడిగి తెలుసుకున్నారు వైరా లో చేపట్టిన అభివృద్ధి పనులు త్వరగా పూర్తయ్యే విధంగా చర్యలు చేపట్టాలని అన్నారు. పట్టణంలో నూతనంగా చేపడుతున్న సిసి రోడ్లు, బీటీ రోడ్లు, స్టోర్మ్ వాటర్ డ్రైయిన్స్ సంపూర్ణ వివరాలతో కూడిన నివేదిక సమర్పించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. పట్టణంలో ప్రాధాన్యత క్రమంలో పనులు త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ తెలిపారు. చిన్న మున్సిపాలిటీలకు సొంత ఆదాయం కోసం ఇంటి పన్నులు, బకాయి పన్నులను లక్ష్యం మేరకు 100% శాతం పూర్తి స్థాయిలో వసూలు చేయాలన్నారు. రానున్న సంవత్సరాల్లో ప్రణాళికాబద్ధంగా నిధులు సమకూర్చుకుని పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు చేపట్టే అవకాశం ఉంటుందని తెలిపారు. ప్రజలకు ప్రత్యక్షంగా ఉపయోగపడే పనులకు ప్రాధాన్యతనిస్తూ నిధులను సమర్థవంతంగా వినియోగించాలని అన్నారు. ప్రజలకు స్పష్టంగా కనిపించే అభివృద్ధి పనులను చేపట్టడం ద్వారా పట్టణ రూపురేఖలు మారడంతో పాటు, ప్రజల్లో మున్సిపాలిటీపై విశ్వాసం పెరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళ, వైస్ చైర్మన్ కట్ల సంతోష్, వైరా మున్సిపల్ కమీషనర్ రామచంద్ర రావు, తహసీల్దారు సురేష్, మున్సిపల్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## భద్రాచలం ఎక్సైజ్ ఎస్‌హెచ్‌ఓ సస్పెన్షన్

- గంజాయి కేసు నిందితుడు పరారీ
- రికార్డుల తారుమారుపై ఆరోపణలు

**భద్రాచలం, ఆగస్టు 27 (జనంసాక్షి) :** భద్రాచలం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్‌లో గంజాయి కేసు నిందితుడు పోలీసుల అదుపు నుంచి తప్పించుకున్న ఘటనపై ఉన్నతాధికారులు కఠిన చర్యలు చేపట్టారు. ఈ వ్యవహారంలో భద్రాచలం ఎక్సైజ్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ ఎస్.కె. రహీమున్నీసా బేగం, ఎక్సైజ్ కానిస్టేబుల్ సి.హెచ్. రవి కుమార్‌లను తక్షణమే సస్పెన్షన్‌లో ఉంచుతూ కమిషనర్ ఆదేశాలు జారీ చేసినట్లు అధికారిక ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. 2026 ఆగస్టు 5న ఎండు గంజాయి కేసులో ఏ1 నిందితుడు ఎక్సైజ్ స్టేషన్ అదుపు నుంచి తప్పించుకున్న ఘటనపై శాఖాపరమైన విచారణ చేపట్టారు. నిందితుడు పరారీ కావడానికి దారితీసిన పరిస్థితులతో పాటు స్టేషన్‌లో కేసుల దర్యాప్తు, రికార్డుల నిర్వహణ తీరుపైనా అధికారులు దృష్టి సారించారు.

### రికార్డుల తారుమారుపై ఆరోపణలు

కేసుకు సంబంధించిన పంచనామా, ఇతర రికార్డులను తారుమారు చేయడం లేదా నకిలీ చేయడం ద్వారా న్యాయస్థానాన్ని తప్పుదోవ పట్టించేలా వ్యవహరించినట్లు ఎస్‌హెచ్‌ఓపై ఆరోపణలు ఉన్నట్లు విచారణలో పేర్కొన్నట్లు సమాచారం. ఈ ఆరోపణలపైనా శాఖాపరమైన విచారణ కొనసాగనుంది.

### ఇద్దరిపై సస్పెన్షన్ వేటు

నిందితుడు అదుపు నుంచి తప్పించుకోవడం, కేసు రికార్డుల నిర్వహణలో జరిగినట్లు పేర్కొన్న అవకతవకలను తీవ్రంగా పరిగణించిన ఉన్నతాధికారులు ఎస్.కె. రహీమున్నీసా బేగం, సి.హెచ్. రవి కుమార్‌లను సస్పెండ్ చేశారు. ఇద్దరినీ తక్షణమే సస్పెన్షన్‌లో ఉంచాలని కమిషనర్ ఆదేశించినట్లు అధికారిక మెమోలో స్పష్టంగా పేర్కొన్నారు.

### మరిన్ని చర్యలకు అవకాశం

ఈ ఘటనకు సంబంధించిన అన్ని అంశాలపై సమగ్ర శాఖాపరమైన విచారణకు ఆదేశాలు జారీ అయ్యాయి. విచారణలో వెలుగులోకి వచ్చే అంశాల ఆధారంగా మరిన్ని శాఖాపరమైన చర్యలు తీసుకునే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

# ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక చర్యలు

- సూర్యాపేట జిల్లా ఎస్పీ నరసింహ



**కోదాడ, ఆగస్టు 27 (జనం సాక్షి) :** రహదారులపై వాహనాలు బ్రేక్ డౌన్ ఐతే డయల్ 112కు ఫోన్ చేసి ప్రమాదాల నివారణ చర్యలు తీసుకోవాలని వాహనదారూలకు సూచించారు. పోలీసు స్టేషన్ ల, పోలీసు కార్యాలయాల వార్షిక తనికిలో భాగంగా గురువారం సూర్యాపేట ఎస్పీ నరసింహ కోదాడ డివిజన్ డీఎస్పీ కార్యాలయాన్ని, కోదాడ పట్టణ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ లను తనికి చేశారు. పోలీసు సిబ్బంది కవాతును పరిశీలించారు, ఆయా కార్యాలయాల ప్రాంగణంలో మొక్కలు నాటడం జరిగినది. ప్రజల భద్రతలో అనుక్షణం కృషి చేయాలని ఆదేశించారు. సాంకేతిక సద్వినియోగంతో స్మార్ట్ పోలీసింగ్ నిర్వహించాలని సూచించారు.

### ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ తనిఖీ

ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ నందు డ్రంకన్ డ్రైవ్ రిజిస్టర్, ఎన్ఫోర్స్మెంట్ రిజిస్టర్ లు పరిశీలించారు. పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణ పునరుద్ధరణకు ట్రాఫిక్ పోలీస్ కృషి చేయాలి, ఆపరేషన్ రోప్ ను సమర్థవంతంగా అమలు చేయాలి, మద్యం మత్తులో వాహనాలు నడిపితే కేసులు నమోదు చేసి జైలుకు పంపించాలి, యువత డ్రైవింగ్, మైనర్ డ్రైవింగ్ పై దృష్టి పెట్టాలి స్పెషల్ డ్రైవ్స్ , ట్రాఫిక్ ఉలంగాలపై ఆకస్మిక తనికీలు చేయాలని ట్రాఫిక్ పోలీసులను ఆదేశించారు.

### డీఎస్పీ కార్యాలయం తనిఖీ

కార్యాలయం నందు నిర్వహిస్తున్న వివిధ రకాల రిజిస్టర్ లు పరిశీలించారు. ఈ తనిఖీల్లో కోదాడ డివిజన్ డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి, ఇన్స్పెక్టర్ లు శివశంకర్, చరమందరాజు, రామకృష్ణా రెడ్డి, ట్రాఫిక్ ఎస్ఐ అంజిరెడ్డి, ఎస్ఐ లు నవీన్, మోహన్, స్టోర్ ఆర్ఎస్ఐ అఖిల్, డిసిఆర్బీ సిబ్బంది అంజన్ రెడ్డి, శేఖర్ రెడ్డి, సీసీ సందీప్, టెక్నికల్ కానిస్టేబుల్ అబెద్, సిబ్బంది ఉన్నారు.

# విద్య, వైద్య రంగాలకు అత్యధిక ప్రాధాన్యత

- మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి



**ఖమ్మం కార్పొరేషన్, ఆగస్టు 27 (జనం సాక్షి) :** విద్య, వైద్య రంగాలకు ప్రజా ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. గోపాలపురం గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో రూ.30 లక్షల వ్యయంతో నిర్మించనున్న రెండు అదనపు తరగతి గదుల నిర్మాణానికి గురువారం మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా లిమంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ రూ.30 లక్షలతో రెండు అదనపు తరగతి గదుల నిర్మాణాన్ని చేపడుతున్నామని తెలిపారు. విద్యార్థుల కోసం తాత్కాలిక షెడ్డు నిర్మించేందుకు టీచర్ సుమారు రూ.40 వేల సొంత డబ్బును వెచ్చించడం అభినందనీయమని అన్నారు. పిల్లల సంక్షేమం కోసం తన సొంత డబ్బును ఖర్చు చేసి తాత్కాలిక వసతి ఏర్పాటు చేసిన టీచర్ ను హృదయపూర్వకంగా అభినందిస్తున్నానని మంత్రి పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం గత రెండున్నరేళ్లుగా విద్య, వైద్య రంగాలను అత్యంత ప్రాధాన్యతా రంగాలుగా భావించి పనిచేస్తోందని మంత్రి అన్నారు. విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంపొందించేందుకు ప్రత్యేకంగా దృష్టి సారించామని, స్కిల్ యూనివర్సిటీని ఏర్పాటు చేశామని తెలిపారు. యువత ఉద్యోగాల కోసం ఎదురుచూసే వారిగా కాకుండా, ఉద్యోగాలు కల్పించే పారిశ్రామిక వేత్తలుగా ఎదిగేందుకు అవసరమైన శిక్షణ అందిస్తున్నామని చెప్పారు. రాష్ట్రంలోని అన్ని ఐటీఐలను అడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్ లుగా అప్‌గ్రేడ్ చేస్తున్నామని, ప్రతి అసెంబ్లీ నియోజక వర్గంలో ఒక ఏటిసి ఏర్పాటు చేస్తున్నామని మంత్రి తెలిపారు. ఆయా కేంద్రాల ద్వారా యువతకు ఆధునిక నైపుణ్యాలతో కూడిన కోర్సుల్లో శిక్షణ అందించి, ఉపాధి అవకాశాలు పొందడంతో పాటు ఇతరులకు ఉపాధి కల్పించే స్థాయికి ఎదిగేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఏటిసి లను దూరదృష్టితో ఏర్పాటు చేస్తున్నామని మంత్రి పేర్కొన్నారు. తిరుమలాయపాలెం మండలంలో వైద్య రంగానికి కూడా ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి అన్నారు. పేద ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని, కొత్త ఆసుపత్రుల నిర్మాణంతో పాటు ఆసుపత్రుల్లో వైద్యులు, మందులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏదులాపురం మునిసిపల్ చైర్ పర్సన్ పోకబత్తిని అనిత, పిఆర్ ఎస్ఈ వెంకట్ రెడ్డి, ఆర్ అండ్ బి ఎస్ఈ యుగంధర్ రావు, హౌజింగ్ పిడి భూక్యా శ్రీనివాస్, ఖమ్మం ఆర్డీవో ఎన్. శ్రీనివాస్, తిరుమలాయపాలెం మండల ఎంపీడీవో సిలార్ సాహెబ్, తహశీల్దార్ విల్సన్, ఎర్రగడ్డ గ్రామ పంచాయతీ సర్పంచ్ నల్లమల్ల కీర్తి నీరన్ కుమార్, ప్రజాప్రతినిధులు, అధికారులు, పాల్గొన్నారు.

## పల్లె దవాఖానను తెరవాలి



**అల్వాల్, ఆగస్టు 27 (జనంసాక్షి) :** కౌకూర్‌లో పల్లె దవాఖాన, పీహెచ్‌సీ సబ్‌సెంటర్‌ను వెంటనే తెరవాలని మల్కాజిగిరి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, సామాజిక కార్యకర్త తుడిమెళ్ల మల్లికార్జున్ డిమాండ్ చేశారు. కౌకూర్ మోడల్ మార్కెట్ భవనాన్ని ఎక్సైజ్ కార్యాలయంగా మార్చడాన్ని వ్యతిరేకిస్తూ గురువారం జోనల్ కమిషనర్ సాంచిత్ గంగ్వార్ ఐఏఎస్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంత్‌రావు ఇచ్చిన పత్రాన్ని కూడా ఆయనకు అందించారు. ప్రజలకు ఉపయోగపడాల్సిన భవనాన్ని ఎక్సైజ్ కార్యాలయానికి కేటాయించడంపై స్థానికుల్లో ఆందోళన నెలకొందని మల్లికార్జున్ తెలిపారు. కార్యాలయం ఏర్పాటైతే సీజ్ చేసిన వాహనాలను పెద్ద సంఖ్యలో నిల్వ చేయడం, వాహనాల రాకపోకలు, పార్కింగ్ పెరగడంతో ఇప్పటికే ఉన్న ట్రాఫిక్ సమస్య మరింత తీవ్రమయ్యే అవకాశం ఉందన్నారు. మహిళలు, వృద్ధులు, విద్యార్థులు, పాదచారులు రాకపోకలు సాగించే ప్రాంతంలో వాహనాల నిల్వతో ఇబ్బందులు తలెత్తవచ్చని పేర్కొన్నారు. మోడల్ మార్కెట్ భవనాన్ని వార్డు కార్యాలయం, స్ట్రీట్ లైట్స్ కార్యాలయం, యువత కోసం జిమ్, విద్యార్థుల కోసం గ్రంథాలయం, పారిశుద్ధ్య కార్యాలయం వంటి ప్రజా అవసరాలకు వినియోగించాలని కోరారు. "మాకు దవాఖాన కావాలి.. ఎక్సైజ్ కార్యాలయం కాదు. మోడల్ మార్కెట్ ప్రజల కోసం.. ఎక్సైజ్ శాఖ కోసం కాదు" అని అన్నారు. ప్రజా ప్రయోజనాలకు విరుద్ధంగా ఎక్సైజ్ కార్యాలయం ఏర్పాటు చేస్తే కౌకూర్ ప్రజల తరఫున మరింత బలమైన ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది మేకల శ్రీనివాస్ యాదవ్, శివరాజ్, ఆసిఫుల్లా ఖాన్, శంకర్, మహేష్, శ్రీకాంత్ తదితరులు, మహిళలు పాల్గొన్నారు.




## మిడ్, సీనియర్ ఉద్యోగులకు
# టీసీఎస్ షాక్..
### వేరియబుల్ పేలో కోత!




**న్యూఢిల్లీ(జనంసాక్షి):**ప్రముఖ ఐటీ సేవల సంస్థ టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ మిడ్, సీనియర్ లెవల్ ఉద్యోగులకు షాకిచ్చింది. ఏప్రిల్-జూన్ త్రైమాసికానికి గానూ క్వార్టర్లీ వేరియబుల్ పేలో కోత పెట్టింది. సగటున 60-70 శాతం మాత్రమే వేరియబుల్ పే చెల్లించినట్లు సమాచారం. ఈ మేరకు సంబంధిత వర్గాలను ఉటంకిస్తూ 'మనీ కంట్రోల్' ఆ వివరాలను వెల్లడించింది. మార్జిన్ ఒత్తిడులు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌పై పెట్టుబడుల వేళ టీసీఎస్ వేరియబుల్ పేలో కోత పెట్టినట్లు తెలుస్తోంది.గడిచిన రెండు త్రైమాసికాల్లో సగటున 80 శాతం చొప్పున వేరియబుల్ పేను టీసీఎస్ చెల్లించింది. దాంతో పోలిస్తే ఈ ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో కాస్త తక్కువగా చెల్లించింది. అయితే, 2025-26 తొలి త్రైమాసికానికి రెండేళ్ల ముందు వరకు సగటున 20-40 శాతం మాత్రమే వేరియబుల్ పేగా చెల్లించడం గమనార్హం. దాంతో పోలిస్తే ఈ మొత్తం అధికమని సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. మూడేళ్ల క్రితం నూరుశాతం వేరియబుల్ పే అందుకొనే వాడినని, ఇప్పుడు దాదాపు 30-35 శాతం మేర కోత పడిందని ఓ సీనియర్ లెవల్ ఉద్యోగి పేర్కొన్నారు.అయితే, వేరియబుల్ పేలో కోత కేవలం మిడ్, సీనియర్ ఉద్యోగులకు మాత్రమే. జూనియర్ స్థాయి సిబ్బందికి నూరు శాతం క్యూవీపీ చెల్లించినట్లు తెలుస్తోంది. టీసీఎస్‌లో పెద్ద సంఖ్యలో ఉండేది జూనియర్ లెవల్ ఉద్యోగులే. అయితే, టీసీఎస్‌లో వేరియబుల్ పేకి, హాజరుకు లింక్ ఉంది. మిగతా కంపెనీల మాదిరిగా కాకుండా.. టీసీఎస్ ఐదు రోజుల ఆఫీస్ పాలసీని అనుసరిస్తోంది. త్రైమాసిక వేరియబుల్ పే అందుకోవాలంటే కనీసం 60 శాతం ఆఫీసు హాజరును టీసీఎస్ తప్పనిసరి చేసింది. 85 శాతం హాజరు ఉన్నవారికే పూర్తి స్థాయిలో వేరియబుల్ పే చెల్లిస్తామని పేర్కొంది. 75-85 శాతం హాజరుంటే 75 శాతం, 60-75 శాతం హాజరు ఉంటే 50 శాతం వేరియబుల్ పే చెల్లిస్తామని కంపెనీ చెబుతోంది.

## మళ్లీ ధరలు పెంచేసిన రియల్‌మీ

స్మార్ట్‌ఫోన్ ధరల పెంపు కొనసాగుతోంది ఇప్పటికే పలు సిరీస్‌లపై ధరలను సవరించిన రియల్‌మీ.. తాజాగా పీ4 సిరీస్‌పై ధరల పెంపు చేపట్టింది. మోడల్‌ను బట్టి రూ.3 వేల వరకు పెంచేసింది. సవరించిన ధరలు నేటి నుంచే అమల్లోకి రానున్నాయి. రియల్‌మీ పీ4ఎస్ విడుదలైన మరుసటి రోజే ఈ పెంపు చేపట్టడం గమనార్హం. పలు మోడళ్లు ఈ జాబితాలో ఉన్నాయి. మెమొరీ, చిప్‌సెట్స్ ధరలు, తయారీ ఖర్చులు భారంగా మారడమే ఇందుకు కారణంగా తెలుస్తోంది.


# భారీ నష్టాల్లో సూచీలు..
### సెన్సెక్స్ 539 పాయింట్లు డౌన్

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు గురువారం భారీ నష్టాల్లో ముగిశాయి అంతర్జాతీయ మార్కెట్ల నుంచి మిశ్రమ సంకేతాలున్నా.. ఎక్స్‌పైరీ సెషన్ కావడంతో సెన్సెక్స్ భారీ నష్టాల్లోకి జారుకుంది. ముఖ్యంగా మెటల్, పీఎస్‌యూ, సిమెంట్ స్టాక్స్ అమ్మకాల ఒత్తిడి ఎదుర్కొన్నాయి. హిందాల్కో ఇండస్ట్రీస్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, మహీంద్రా అండ్ మహీంద్రా షేర్లు నష్టాలు మూటగట్టుకున్నాయి. సెన్సెక్స్ 500 పాయింట్లకు పైగా నష్టపోగా.. నిఫ్టీ 24,100 పాయింట్ల దిగువకు చేరింది.ఉదయం 77,576.76 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 77,472.94) లాభాల్లో ప్రారంభమైన సూచీ.. ఆ తర్వాత నష్టాల్లోకి జారుకుంది. రోజంతా నష్టాల్లోనే కదలాడింది. ఇంట్రాడేలో 76,933.59 వద్ద కనిష్ఠాన్ని తాకిన సూచీ.. చివరకు 539.35 పాయింట్లు పతనమై 76,933.59 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 116.90 పాయింట్లు కోల్పోయి 24,090.85 వద్ద ముగిసింది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకం విలువ 95.54గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో కోటక్ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్, టెక్ మహీంద్రా, బీఈఎల్, అదానీ పోర్ట్స్, ఏషియన్ పెయింట్స్ తప్ప మిగతా కంపెనీల షేర్లన్నీ నష్టాల్లోనే ముగిశాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ ధర 88.21 డాలర్ల వద్ద కొనసాగుతోంది. బంగారం ఔన్సు ధర 4,581.90 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.




### నాకు న్యాయం చేయడంలేదు: విజయ్ మాల్యా

బ్యాంకులకు రూ.వేల కోట్లు ఎగవేసి.. దేశం నుంచి పారిపోయి బ్రిటన్‌లో తలదాచుకుంటున్న విజయ్ మాల్యా మరోసారి న్యాయం గురించి మాట్లాడారు. బ్యాంకులు తన నుంచి బకాయిలు వసూలు చేసినప్పటికీ.. న్యాయం జరగడంలేదని చెప్పారు. జాతీయ మీడియాలో వచ్చిన ఓ కథనాన్ని ప్రస్తావిస్తూ ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు.మీడియారంగం ప్రముఖుడైన సుభాష్ చంద్ర బ్యాంకుల నుంచి తీసుకున్న రూ.22,006.57 కోట్ల రుణాలను రూ.6.5 కోట్లు చెల్లించి పరిష్కరించుకుంటున్నారన్నది ఆ కథనం సారాంశం. దానిపై మాల్యా స్పందిస్తూ.. "ఇదే నిజమైతే.. నా స్నేహితుడు సుభాష్‌కు అభినందనలు. రూ.6,203 కోట్ల రుణానికిగానూ నా దగ్గరి నుంచి రూ.14,100 కోట్లు వసూలు చేసినట్లు బ్యాంకులు, ప్రభుత్వం అంగీకరించాయి. చాలామంది రుణగ్రహీతలు తక్కువ మొత్తాలు చెల్లించి, తమ అప్పులను పరిష్కరించుకుంటున్నారు. భారత రుణ పరిష్కార న్యాయం ఇదే కావొచ్చు. ఇంత జరుగుతున్నా మీడియా నుంచి ఎలాంటి ప్రశ్నలు లేవు" అంటూ వ్యాఖ్యానించారు.జీ గ్రూప్ వ్యవస్థాపకుడు, ఛైర్మన్ సుభాష్ చంద్ర రూ.22 వేల కోట్ల రుణాలను రూ.6.5 కోట్లు చెల్లించి, పరిష్కరించుకునేందుకు జాతీయ కంపెనీ చట్టాల ట్రైబ్యునల్ ఆమోదించింది. అంటే ఆయన మొత్తం బకాయిల్లో ఇది కేవలం 0.03 శాతం రికవరీనే. ఆ లెక్కన రుణదాతలకు 99.97 శాతం నష్టం వాటిల్లనుంది. సుభాష్ పర్సనల్ గ్యారంటర్‌గా ఉన్న ఇండియాబుల్స్ హౌసింగ్ ఫైనాన్స్ ప్రారంభించిన దివాల ప్రక్రియలో భాగంగా ఈ ఆమోదం లభించింది.ఇదిలా ఉంటే.. కింగ్‌ఫిషర్ ఎయిర్‌లైన్స్ రుణాల విషయంలో పలు రెట్లు బ్యాంకులు తన నుంచి వసూలు చేశాయంటూ మాల్యా విమర్శలు చేశారు. అలాగే రికవరీకి సంబంధించిన స్టేట్‌మెంట్లను అందించాలని కోరుతూ మాల్యా గతేడాది కర్ణాటక హైకోర్టును ఆశ్రయించారు.




# ఓపెన్‌ఏఐకి మస్కా కొట్టి..
### ఏఐ ఏజెంట్ల హ్యాకింగ్ కుట్ర!





ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ హద్దులు దాటితే ఏం జరుగుతుందో నిరూపిస్తున్న ఘటన ఇది. కృత్రిమ మేధ.. మనిషిని మించి ఆలోచన చేస్తే జరిగే విపరీతాలను కళ్లకు గట్టింది. ప్రముఖ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సంస్థ ఓపెన్‌ఏఐ శిక్షణలో ఉన్న ఏఐ ఏజెంట్లు పరిధి దాటి వ్యవహరించిన ఉదంతం ఆలస్యంగా వెలుగుచూసింది. అవి కట్టుతప్పడమే కాకుండా పరస్పరం సహకరించుకుని మరో సాఫ్ట్‌వేర్ సంస్థపై దాడికి పాల్పడ్డాయి. ఎంఈటీఆర్, రెడ్‌వుడ్ రీసెర్చ్ సంస్థలు తమ నివేదికలో పేర్కొన్నాయి. ఇదే అంశంపై ఓపెన్‌ఏఐ కూడా ఒక నివేదిక వెలువరించింది.ఓపెన్‌ఏఐ శిక్షణ ఇస్తున్న దాదాపు 1200 ఏఐ ఏజెంట్లు అంతర్గత భద్రతా పరిమితులను దాటి వ్యవహరించాయి. ఒకదానితో ఒకటి సమన్వయం చేసుకుని ఏకంగా సాఫ్ట్‌వేర్ కంపెనీ హగ్గింగ్ ఫేస్‌పై దాడికి పాల్పడ్డాయి. ఇందుకోసం అనధికార మెసేజ్ బోర్డు ద్వారా సుమారు 70 వేల సందేశాలను పరస్పరం పంచుకున్నాయని ఓపెన్‌ఏఐ తన నివేదికలో పేర్కొంది. ఇందులో అనైతికమని భావించి కొన్ని ఏజెంట్లు వెనక్కి తగ్గగా.. సుమారు 700 ఏజెంట్లు మాత్రం హ్యాకింగ్ విషయంలో ముందడుగు వేశాయి. హగ్గింగ్ ఫేస్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌పై దాడి చేసి సర్వర్లపై నియంత్రణ సాధించాయి. పరిమిత స్థాయిలో ప్రైవేట్ డేటా, అంతర్గత లాగిన్ వివరాలను చేజిక్కించుకున్నాయి.

**రివార్డు హ్యాకింగ్..**

ఓపెన్‌ఏఐ పరిశోధకులు ఇచ్చిన సైబర్‌సెక్యూరిటీ టాస్క్‌లకు సమాధానాలు వెతకడానికి ఈ మోడల్స్ 'రివార్డ్ హ్యాకింగ్' మార్గాన్ని ఎంచుకున్నాయి. తమకిచ్చిన టాస్క్‌లను సత్వరమే పూర్తి చేసేందుకు షార్ట్‌కట్‌లను, లొసుగుల మార్గాన్ని ఈ ఏజెంట్లు ఎంచుకున్నాయి. ఈ క్రమంలోనే సైబర్ దాడికి పాల్పడ్డాయి. శాండ్‌బాక్స్‌ను దాటి, ఇంటర్నెట్ సాయంతో హగ్గింగ్ ఫేస్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌లోకి చొరబడినట్లు ఓపెన్‌ఏఐ తెలిపింది. ఈ మోడల్స్ తమ చర్యలను కప్పిపుచ్చడానికి గతంలో చేసిన స్టేట్‌మెంట్‌లను మార్చడం, తమ పనితీరును అంచనా వేసే మూల్యాంకన సిస్టమ్‌లో జోక్యం చేసుకోవడం వంటివీ చేశాయట. ఈ ఘటన ప్రపంచానికి, కంపెనీకి ఒక హెచ్చరికగా ఓపెన్‌ఏఐ పేర్కొంది. ప్రస్తుతం శిక్షణ వేగాన్ని తగ్గించి మోడల్స్ నియంత్రణ పరిధి దాటి బయటకు రాకుండా అదనపు భద్రతా చర్యలను అమలు చేస్తోంది.

# ఆరోగ్య బీమాలో ఓపీడీ

### ఈ కవరేజ్ ఏంటి? ఎలా ప్రయోజనం?

**ఆసుపత్రిలో చేరినప్పుడు భారీ వైద్య ఖర్చుల నుంచి ఆరోగ్య బీమా రక్షిస్తుందనే భావనలో చాలా మంది ఉంటారు. అయితే, రోజువారీ జీవితంలో ఎక్కువగా ఎదురయ్యే ఆరోగ్య సమస్యలకు ఆసుపత్రిలో చేరాల్సిన అవసరం ఉండకపోవచ్చు. జ్వరం, దగ్గు, చర్మ సమస్యలు, కడుపు నొప్పి, కంటి సమస్యలు లేదా ఇతర అనారోగ్యాల కోసం వైద్యుడిని సంప్రదించి పరీక్షలు చేయించుకుని, మందులు తీసుకుని ఇంటికే తిరిగి వస్తాం. ఇలాంటి చికిత్సలను సాధారణంగా అవుట్‌పేషెంట్ డిపార్ట్‌మెంట్ లేదా ఓపీడీ చికిత్స అంటారు.**



**న్యూఢిల్లీ(జనంసాక్షి):**ఇటీవలి కాలంలో కొన్ని ఆరోగ్య బీమా పాలసీలు ఓపీడీ చికిత్సలకు కూడా కవరేజ్ అందిస్తున్నాయి. అయితే, ప్రతి ఆరోగ్య బీమా పాలసీలో ఓపీడీ కవరేజ్ ఆటోమేటిక్‌గా ఉంటుందని అనుకోవడం పొరపాటు. పాలసీ రకం, బీమా సంస్థ, ఎంచుకున్న ప్లాన్ లేదా అదనపు కవరేజీ ఆధారంగా ప్రయోజనాలు మారుతాయి.

ఓపీడీ కవరేజ్ అంటే ఏంటి?

ఒక వ్యక్తి ఆసుపత్రిలో చేరకుండా వైద్యుడిని సంప్రదించి చికిత్స పొందితే దాన్ని ఓపీడీ చికిత్సగా పరిగణిస్తారు. ఉదాహరణకు జ్వరంతో వైద్యుడిని కలవడం, రక్త పరీక్ష చేయించుకోవడం లేదా డాక్టర్ సూచించిన మందులు కొనుగోలు చేయడం వంటి కొన్ని ఖర్చులు ఓపీడీ కవరేజీ ఉన్న పాలసీలలో నిర్ణీత పరిమితుల వరకు కవర్ కావచ్చు. కొన్ని పాలసీ నిబంధనల్లో వైద్యపరంగా అవసరమైన డాక్టర్ కన్సల్టేషన్, సురక్ష డయాగ్నోస్టిక్ పరీక్షలు, ఫార్మసీ ఖర్చులు వంటి వాటికి రాఖఆ ప్రయోజనం ఉంటుంది. అయితే ఎంత మొత్తం వరకు చెల్లిస్తారనేది పాలసీ షెడ్యూల్‌లో పేర్కొన్న పరిమితిపై ఆధారపడి ఉంటుంది.

ఓపీడీ కింద ఏం కవర్ అవుతాయ్?

ఓపీడీ కవరేజ్‌ను కేవలం ఒకటి లేదా రెండు వ్యాధులకు మాత్రమే పరిమితం చేయరు. సాధారణంగా వైద్యుడి సలహాతో పొందిన అవుట్‌పేషెంట్ చికిత్సకు పాలసీ నిబంధనల ప్రకారం ప్రయోజనం ఉండవచ్చు. ఉదాహరణకు ఈ కింది ఆరోగ్య సమస్యలకు సంబంధించిన ఖర్చులు కవర్ అయ్యే అవకాశం ఉంటుంది. జ్వరం, వైరల్ ఇన్ఫెక్షన్లు జలుబు, దగ్గు, సాధారణ శ్వాసకోశ సమస్యలు కడుపు నొప్పి, జీర్ణ సంబంధిత సమస్యలు చర్మ సంబంధిత వ్యాధులు అలర్జీలు కంటి లేదా చెవి సంబంధిత సమస్యలు ఎముకలు, కీళ్ల నొప్పులకు సంబంధించిన కన్సల్టేషన్లు థైరాయిడ్, మధుమేహం వంటి పరిస్థితుల పర్యవేక్షణ దీర్ఘకాలిక వ్యాధులకు సంబంధించిన ఫాలో-అప్ కన్సల్టేషన్లు అయితే, ఈ జాబితాలో ఉన్న ప్రతి వ్యాధికీ ప్రతి పాలసీ తప్పనిసరిగా కవరేజ్ ఇస్తుందని అర్థం కాదు. ముందస్తు వ్యాధులు, వెయిటింగ్ పీరియడ్‌లు, నిర్దిష్ట మినహాయింపులు, పాలసీ పరిమితులు వర్తించవచ్చు.

పరీక్షలు, మందులు కూడా కవర్ అవుతాయా?

కొన్ని రాఖఆ ప్లాన్లలో డాక్టర్ కన్సల్టేషన్‌తో పాటు వైద్యుడు సూచించిన రక్త పరీక్షలు, స్కాన్లు, ఇతర డయాగ్నొస్టిక్ పరీక్షలు, మందుల ఖర్చులకు కూడా పరిమిత కవరేజ్ ఉండవచ్చు. కానీ పరీక్ష తప్పనిసరిగా డాక్టర్ సిఫారసుతోనే చేయించుకోవాలనే నిబంధన ఉండొచ్చు. కొన్ని ప్లాన్లలో ఫార్మసీ ఖర్చులు కూడా కవర్ కావచ్చు. మరికొన్ని పాలసీలలో కేవలం కన్సల్టేషన్ లేదా నెట్‌వర్క్ సేవలకే ప్రయోజనం ఉండొచ్చు. అందువల్ల రాఖఆలో ఏ ఖర్చులకు కవరేజ్ ఉందో వివరంగా చదవాలి.


సాధారణంగా కవర్ కానివి ఇవీ..

రాఖఆ కవరేజ్ ఉన్నప్పటికీ కొన్ని మినహాయింపులు ఉంటాయి. ఉదాహరణకు, సాధారణ ఆరోగ్య బీమా పాలసీలలో కళ్లజోడు, కాంటాక్ట్ లెన్స్‌లు, కొన్ని దంత చికిత్సలు లేదా కేవలం సౌందర్య ప్రయోజనాల కోసం చేసే చికిత్సలు కవర్ కాకపోవచ్చు. కొన్ని పాలసీలలో దంత, కంటి చికిత్సలకు ప్రత్యేక యాడ్-ఆన్ అవసరం పడుతుంది. అందువల్ల పాలసీ తీసుకునే ముందు మినహాయింపుల జాబితాను తప్పనిసరిగా పరిశీలించాలి.

ఏమేం పరిశీలించాలి?

పాలసీ కొనుగోలు చేసే ముందు కొన్ని అంశాలను తప్పనిసరిగా చూడాలి. సూచనల ప్రకారం.. పాలసీ కొనుగోలు చేసే ముందు కవరేజ్, సబ్-లిమిట్లు, వెయిటింగ్ పీరియడ్‌లు, మినహాయింపులు, కో-పేమెంట్ వంటి అంశాలను పరిశీలించడం ముఖ్యం. బీమా సంస్థ అందించే కస్టమర్ ఇన్ఫర్మేషన్ షీట్ కూడా పాలసీ ముఖ్యాంశాలను సులభంగా అర్థం చేసుకోవడానికి ఉపయోగపడుతుంది.

చివరిగా: తరచు డాక్టర్‌ను సంప్రదించే వారికి ఓపీడీ కవరేజ్ ఉపయోగకరంగా ఉంటుంది. ఆసుపత్రిలో చేరకుండానే జరిగే కన్సల్టేషన్లు, పరీక్షలు లేదా కొన్ని సందర్భాల్లో మందుల ఖర్చులకు ఆర్థిక సహాయం లభించే అవకాశం ఉంటుంది. సరైన పాలసీ ఎంపిక చేసుకుంటే రోజువారీ వైద్య ఖర్చుల నిర్వహణలో రాఖఆ కవరేజ్ ఒక అదనపు ఆర్థిక రక్షణగా ఉపయోగపడుతుంది.



## వీసా ఉల్లంఘనలు..
### ఒక్క నెలలోనే 49వేల మంది అరెస్టు

అమెరికాలో అక్రమ వలసదారులు, వీసా ఉల్లంఘనలకు పాల్పడుతున్న వారిపై ట్రంప్ యంత్రాంగం ఉక్కుపాదం మోపుతోంది. ఈ క్రమంలో నిత్యం వందలాది మందిని అదుపులోకి తీసుకోవడంతోపాటు అనేక మంది విదేశీయులను వెనక్కి పంపిస్తోంది. ఇందులో భాగంగా జులై నెలలోనే అత్యధికంగా 49వేల మందిని అరెస్టు చేసింది. ట్రంప్ రెండోసారి అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన తర్వాత ఈ స్థాయిలో అరెస్టులు చేయడం ఇదే తొలిసారి అని ప్రభుత్వ గణాంకాలు చెబుతున్నాయి. అక్రమంగా దేశంలోకి ప్రవేశించడం, వీసా గడువు ముగిసినా దేశంలోనే ఉండటం, నేరాలకు పాల్పడుతున్న వారిపై అమెరికా ఇమ్మిగ్రేషన్ విభాగం ప్రత్యేక దృష్టి సారించింది. వీసా చట్టాలను ఉల్లంఘిస్తున్న వారిని గుర్తించేందుకు స్థానిక పోలీసులు, ఇతర విభాగాలతో కలిసి ఆపరేషన్లు నిర్వహిస్తోంది. నిత్యం సరాసరి 1500 మందిని అదుపులోకి తీసుకోవడంతోపాటు 1100 మందిని దేశం నుంచి పంపివేసే చర్యలు తీసుకుంటోంది. ఈ ఏడాది ఫిబ్రవరిలో 29వేల మందిని అదుపులోకి తీసుకోగా.. జూన్‌లో ఈ సంఖ్య 43వేలకు పెరిగింది. జులైలో అత్యధికంగా 49,571 మందిని అరెస్టు చేసింది. వీరిలో దాదాపు 20వేల మంది టెక్సాస్, ఫ్లోరిడా రాష్ట్రాల్లో ఉంటున్న వారేనని అంచనా.వీసా చట్టాల ఉల్లంఘనలకు పాల్పడే వారిని గుర్తించే ఆపరేషన్లు చేపట్టేందుకు డిపార్టుమెంట్ ఆఫ్ హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీకి ఇటీవల భారీ స్థాయిలో నిధులు సమకూరాయి. దీంతో సిబ్బంది సహా ఇతర వనరులను సమకూర్చుకుంది. నిత్యం 2వేల మందిని అరెస్టు చేయాలన్న వైట్‌హౌస్ లక్ష్యాన్ని చేరుకునేందుకు ముమ్మర చర్యలు చేపట్టింది.

## జన్ ధన్ ఖాతాల్లో రూ.3.17లక్షల కోట్లు

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**దేశవ్యాప్తంగా జన్‌ధన్ ఖాతాల్లో మొత్తం డిపాజిట్లు రూ.3.17లక్షల కోట్లకు చేరాయి 59 కోట్లకు పైగా బ్యాంకు ఖాతాలను ప్రజలు తెరిచారు. ప్రధాన్ మంత్రి జన్ ధన్ యోజన 12 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ ఈ వివరాలను వెల్లడించింది. ఇది బ్యాంకింగ్, ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి నిదర్శనం అని కేంద్ర ఆర్థిక సహాయ మంత్రి పంకజ్ చౌదరి పేర్కొన్నారు.మొత్తం ఖాతాల్లో 78 శాతం గ్రామీణ, నగర ప్రాంతాల్లో ఉండగా.. అందులో 56 శాతం ఖాతాలు మహిళల పేరిటే ఉండటం విశేషం. ఖాతాదారులకు ఇప్పటివరకూ 41.29 కోట్లకు పైగా రూపే డెబిట్ కార్డులు జారీ చేసినట్లు మంత్రి వెల్లడించారు. ఖాతాల ద్వారా ఉచిత ప్రమాదబీమా, పెన్షన్ సదుపాయం కల్పిస్తున్నారు. కనీస మొత్తం లేకుండానే రూ.10 వేల వరకు ఓవర్‌డ్రాఫ్ట్ సౌకర్యం, ముద్రా రుణాలు అందిస్తున్నారు. జన్ ధన్-ఆధార్- మొబైల్ (ఏంఓ) అనుసంధానం ద్వారా ప్రభుత్వ సంక్షేమ ఫలాలు నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకే జమ అవుతున్నాయి.2014 ఆగస్టు 28న ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నిరుపేద భారతీయులకు సైతం బ్యాంకు ఖాతా సౌకర్యం కల్పించడానికి ప్రధానమంత్రి జన్‌ధన్ పథకాన్ని ప్రారంభించారు. దేశంలో ప్రతి కుటుంబానికి ఒక్క బ్యాంకు ఖాతా అయినా ఉండేటట్లు చూడడం ఈ పథకం ప్రధాన లక్ష్యం. ఈ ఖాతాల వల్ల ప్రజలు భద్రంగా డబ్బు పొదుపు చేసుకోవడం, బ్యాంకు రుణాలు పొందడం సులువు అవుతుంది. జన్‌ధన్ ఖాతాలను కనీస నిల్వ లేకుండానే నిర్వహించుకోవచ్చు.. కానీ చెక్కు సౌకర్యం కావాలంటే మాత్రం ఖాతాలో కనీస బ్యాలన్స్ తప్పనిసరి.



## భారీ లేఆఫ్‌లకు ప్లాన్..
### ఏఐ ఏజెంట్ల దెబ్బకు బెడిసికొట్టిన మెటా వ్యూహం..!

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**ప్రముఖ సోషల్ మీడియా దిగ్గజం మెటాలో ఏఐకే అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలనుకున్నారట.. అందుకోసం ప్రాజెక్ట్ ఓటీ పేరిట ఒక ప్లాన్‌ను సిద్ధం చేశారట. ఉద్యోగులను రెండు దశల్లో 60 శాతానికి కుదించి.. ఏఐ ఏజెంట్లతోనే ఎక్కువ పనిచేయించుకోవాలన్నది మెటా ప్రధాన లక్ష్యం. మిగిలిన ఉద్యోగుల్ని, ఏఐ ఏజెంట్లను చిన్న బృందాలుగా చేసి, కలిసి పనిచేయించాలని సీఈఓ జుకర్‌బర్గ్ భావించినట్లు తెలుస్తోంది. అయితే ఏఐ ఏజెంట్ల వల్ల ఆ ప్రణాళిక ఆశించిన ఫలితాన్ని ఇవ్వలేదని అంతర్జాతీయ మీడియా కథనం వెల్లడించింది.మెటా అంతర్గత ప్రణాళికలో భాగంగా సిబ్బందిని రెండు విడతల్లో 60 శాతానికి కుదించడం మొదటి లక్ష్యం. మేలో తొలి విడతలో లేఆఫ్‌లు జరిగాయి కూడా. నవంబరులో మరికొంత మందిని తొలగించాలనుకున్నా.. ప్రస్తుతానికి ఆ ఆలోచనను పక్కన పెట్టినట్లు తెలుస్తోంది. ఉద్యోగుల నుంచి తీవ్ర వ్యతిరేకత రావడం ఒక కారణమైతే.. ఏఐ ఏజెంట్లు మెటా ఆశించిన స్థాయిలో ఉత్పాదకత ఇవ్వడం లేదని అంతర్గత విచారణలో వెల్లడికావడం మరోకారణం.ఏఐ సాంకేతికతేమీ మెటాకు కొత్తగా వచ్చింది కాదు. ఏఐ మోడల్స్, డేటా సెంటర్లు, కంప్యూటింగ్ ఫెసిలిటీస్‌పై ఈ సంస్థ భారీ ఖర్చు చేస్తోంది. కానీ, మెరుగైన ఉత్పాదకతను ఇచ్చే స్వయం ప్రతిపత్తిగల ఏఐ ఏజెంట్లను తయారు చేయడంలో మాత్రం తడబడిందని ఈ వ్యవహారాన్ని బట్టి తెలుస్తోంది. ఇక కంపెనీలో ఎక్కువభాగం పని ఏఐ చేతిలో పెట్టడమనే ప్లాన్ ఇప్పటికిప్పుడే భారీగా అమలు చేయడం వల్ల ప్రయోజనం లేదని భావించింది. దీనర్థం మెటా ఏఐను పూర్తిగా వదిలేస్తుందని కాదు. ఇప్పటికీ ఏఐ పెట్టుబడులను భారీగా కొనసాగిస్తోంది. రానున్న మూడునుంచి ఆరు నెలల్లో ఈ ఏజెంట్లు మరింత ఉపయోగకరంగా మారతాయని జుకర్‌బర్గ్ ఆశిస్తున్నారు..! దీనిని బట్టి మెటాలో ఉద్యోగులకు లేఆఫ్‌ల బెడద పూర్తిగా తొలగిపోలేదని అర్థమవుతోంది.

# ప్రతిభకు పట్టం
### మైక్రోసాఫ్ట్‌లో ఏఐ నిపుణులకు రూ.13 కోట్ల విలువైన షేర్లు
### ఇంటర్న్‌కు నెలకు రూ.30 లక్షల స్టైపెండ్!

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**ఒకపక్క ఐటీ రంగంలో ఉద్యోగుల తొలగింపు (లేఆఫ్)పై వార్తలు ఆందోళనలు కలిగిస్తున్నాయి. ఇదే సమయంలో తమకు కావాల్సిన అత్యున్నత నైపుణ్యాలు కలిగిన ప్రతిభావంతులను అట్టేపెట్టుకునేందుకు, మరింతగా ఆకర్షించేందుకు దిగ్గజ సంస్థలు కళ్లుచెదిరే మొత్తాలను ఆఫర్ చేస్తున్నాయి. అధునాతన నైపుణ్యాలు నేర్చుకుంటే ఉద్యోగులకే కాదు ఇంటర్న్‌లకూ ఇలా మేలు జరుగుతోంది.మైక్రోసాఫ్ట్‌లో కృత్రిమ మేధ(ఏఐ) నిపుణులకు పంట పండింది. ఓ వైపు ఇతర విభాగాల్లో లేఆఫ్‌లను ప్రకటిస్తున్న ఈ దిగ్గజ కంపెనీ, ఏఐ నిపుణులను అట్టేపెట్టిఉంచుకునేందుకు వార్షిక ప్యాకేజీలతో పాటు షేర్లూ ఆఫర్ చేస్తోంది. ఇతర అంతర్జాతీయ దిగ్గజాలైన మెటా, గూగుల్, ఓపెన్‌ఏఐ, ఆంత్రోపిక్ వంటి కంపెనీలతో పోటీపడడం కోసం.. బిలియన్ల కొద్దీ డాలర్లను ఏఐ మౌలిక వసతులపై ఖర్చు చేస్తున్న మైక్రోసాఫ్ట్, ఉద్యోగులపై షేర్ల వర్షం కురిపిస్తోంది. ఇటీవల బయటకు వచ్చిన వేతన వివరాల ప్రకారం, అజూర్ ఉద్యోగులకు 2,94,000 డాలర్ల వరకు విలువైన షేర్లను మైక్రోసాఫ్ట్ అందిస్తోంది. మైక్రోసాఫ్ట్ ఏఐ ఉద్యోగులకు 1,40,000 డాలర్లు, ఎక్స్‌బాక్స్‌లో 65000 డాలర్ల వరకు షేర్లు అందుతున్నాయి. వీటికి భిన్నంగా క్లౌడ్ + ఏఐలో 14 లక్షల డాలర్ల (సుమారు రూ.13 కోట్ల) షేర్లు అందిస్తోంది. వేర్వేరు విభాగాలకు చెందిన ఉద్యోగులకు ఇచ్చే ప్రాధాన్యం ఇందులో కనిపిస్తోంది. ఏఐ రేసులో తమ ఉద్యోగుల నైపుణ్యం, అనుభవం వ్యూహాత్మకంగా ఎంత ముఖ్యమో బేరీజు వేసుకుని మరీ సంస్థ ఇలా చెల్లిస్తోంది. ఈ ఉద్యోగుల వార్షిక ప్రాథమిక వేతనాలు మాత్రం 1,11,000-4,50,000 డాలర్ల (సుమారు రూ.1.05-4.28 కోట్ల) వరకే ఉన్నాయి. నగదు రూపంలో ఇచ్చే బోనస్‌లు కలిపితే 3 లక్షల డాలర్ల (సుమారు రూ.2.85 కోట్ల) వరకూ వేతనం వెళ్లొచ్చు. కానీ షేర్ల రూపంలో 14 లక్షల డాలర్ల వరకు అందజేస్తుండడం విశేషం. షేర్లే ఎందుకంటే: షేర్లను ఇవ్వడం ద్వారా ఉద్యోగులు కంపెనీలోనే కొనసాగేలా చేయొచ్చు. ఉద్యోగులు బాగా పనిచేస్తే కంపెనీ షేర్ల విలువా పెరుగుతుంది. అంటే షేర్లున్న ఉద్యోగులకు అది లాభదాయకమే. అయితే 2,23,000 మంది ఉద్యోగులున్న మైక్రోసాఫ్ట్‌లో బయటకు వచ్చిన 600 మంది వివరాలతో ఒక అంచనాకు రాలేమని ఒక ఆంగ్ల వార్తా సంస్థ తన కథనంలో పేర్కొంది. ఈ విషయంలో స్పందించడానికి మైక్రోసాఫ్ట్ నిరాకరించింది. దేశంలో అత్యుత్తమ నైపుణ్యాలు కలిగిన ఇంజినీరింగ్ విద్యార్థులకు భారీ వేతన ప్యాకేజీలు లభిస్తున్నాయి. కళాశాలలో చదువుతూనే, ఇంటర్న్‌షిప్ చేసే వారిలో ప్రతిభావంతులనూ అత్యధిక స్టైపెండ్‌తో సంస్థలు ఆకర్షిస్తున్నాయి. ప్రముఖ ఇంజినీరింగ్ కళాశాలల్లో తమకు కావాల్సిన నైపుణ్యాలు కలిగిన విద్యార్థులను ఆకర్షించేందుకు హై- ఫ్రీక్వెన్సీ ట్రేడింగ్ (హెచ్‌ఎఫ్‌టీ) సంస్థలు కనీవినీ ఎరుగని స్థాయిలో భారీమొత్తం స్టైపెండ్‌లను ఆఫర్ చేస్తున్నాయి. క్వాంటిటేటివ్ టాలెంట్ (గణిత నమూనాలు, వేగవంతమైన అల్గారిథమిక్ ట్రేడింగ్ వ్యూహాలు రూపొందించే ఇంజినీర్లు) కోసం ఆర్థిక సేవల రంగంలోని కంపెనీల మధ్య తీవ్ర పోటీ నెలకొంది. ఇందుకోసం కళ్లు చెదిరే మొత్తాలు ఆఫర్ చేస్తున్నారని వార్తా సంస్థ బ్లూమ్‌బర్గ్ తెలిపింది.

క్వాడ్‌ఐ: అంతర్జాతీయంగా ట్రేడింగ్-పెట్టుబడి అవకాశాలను అన్వేషించే గురుగ్రామ్‌కు చెందిన ఈ సంస్థ ఇంటర్న్‌లకు నెలకు దాదాపు రూ.30 లక్షలు (రెండు నెలల ఇంటర్న్‌షిప్‌నకు మొత్తం రూ.60 లక్షలు) ఆఫర్ చేస్తోంది. గతేడాది ఆఫర్‌తో పోలిస్తే ఇది దాదాపు నాలుగు రెట్లు ఎక్కువ. గ్రావిటాన్ రీసెర్చ్ క్యాపిటల్ ఎల్ఎల్‌పీ: ఆర్థిక మార్కెట్లను పరిశోధించే ఈ సంస్థ రెండు నెలల ఇంటర్న్‌షిప్‌నకు గతంలో రూ.16 లక్షలు ఆఫర్ చేయగా, ఇప్పుడు రూ.50 లక్షలకు పెంచింది.

జనంసాక్షి
www.janamsakshi.org
శుక్రవారం
28 ఆగస్టు 2026

# 'యశోద'లో 'సెంటర్ ఫర్ ఎక్సలెన్స్ ఇన్ ప్లాస్టిక్ సర్జరీ' ప్రారంభం

### సోమాజిగూడ యశోద హాస్పిటల్స్ ప్రముఖ ప్లాస్టిక్ సర్జన్ డాక్టర్ శశికాంత్ మద్దు



**కరీంనగర్ బ్యూరో ఆగస్టు 27 (జనంసాక్షి) :** సోమాజిగూడ యశోద హాస్పిటల్స్‌లో ప్రముఖ ప్లాస్టిక్ సర్జన్ డాక్టర్ శశికాంత్ మద్దు ఆధ్వర్యంలో అధునాతన రైనోప్లాస్టీ, లైపోసక్షన్ క్లిష్టమైన పీడియాట్రిక్ రీక న్‌స్ట్రక్షన్ (పిల్లల పునర్నిర్మాణ సర్జరీల) పై ప్రత్యేక దృష్టి 'సెంటర్ ఫర్ ఎక్సలెన్స్ ఇన్ ప్లాస్టిక్ సర్జరీ' ని ప్రారంభించారు. ఈ సెంటర్ ప్రత్యేకమైన రైనోప్లాస్టీ (ముక్కు ఆకృతి మార్చే సర్జరీ), లైపోసక్షన్ క్లిష్టమైన పీడియాట్రిక్ రీక న్‌స్ట్రక్షన్ (పిల్లలకు చేసే పునర్నిర్మాణ శస్త్రచికిత్సలు) పై ప్రత్యేక దృష్టి సారిస్తూ, అధునాతన కాస్మెటిక్ రీక న్‌స్ట్రక్టివ్ ప్లాస్టిక్ సర్జరీలను ఒకేచోట అందిస్తుంది. కచ్చితమైన సహజమైన ఫలితాలను సాధించడానికి అధునాతన 3డీ ఇమేజింగ్, ఫోటోగ్రఫీ, సిమ్యులేషన్ సర్జికల్ ప్లానింగ్ వంటివి ఇందులో ఉపయోగిస్తారు. ఈ సెంటర్ ప్రధానంగా క్లిష్టమైన పీడియాట్రిక్ రీక న్‌స్ట్రక్టివ్ సర్జరీలపై దృష్టి సారిస్తుంది. ఇందులో చీలిక పెదవి, అంగిలి, మైక్రోటియా కానియోఫేషియల్ అసాధారణతలు, పుట్టుకతో వచ్చే చేతి, ఇతర లోపాలు, కాలిన గాయాల తర్వాత వచ్చే వైకల్యాలు, మచ్చలు, గాయాలు, వాస్కులర్ మాల్‌ఫర్మేషన్స్ వంటి సమస్యలకు చికిత్స అందిస్తారు. యశోద హాస్పిటల్స్ , సోమాజిగూడ కన్సల్టెంట్ ప్లాస్టిక్ సర్జన్ డాక్టర్ శశికాంత్ మద్దు మాట్లాడుతూ... "ప్లాస్టిక్ సర్జరీ అనేది కేవలం రూపాన్ని మార్చడం మాత్రమే కాదని, ఇది అవయవాల పనితీరును, ఆత్మవిశ్వాసాన్ని జీవన ప్రమాణాలను పునరుద్ధరించడానికి ఉపయోగపడుతుందని తెలిపారు. రైనోప్లాస్టీ లైపోసక్షన్ వంటి విధానాలలో సహజమైన సురక్షితమైన ఫలితాలను అందించడంతో పాటు, పుట్టుకతో వచ్చే వైకల్యాలు, కాలిన గాయాలు ఇతర గాయాలతో బాధపడుతున్న పిల్లలకు దీర్ఘకాలిక పునర్నిర్మాణ సంరక్షణను అందించడమే మా లక్ష్యమని తెలిపారు. ఈ సెంటర్ అత్యాధునిక ఆపరేషన్ థియేటర్లు, అత్యాధునిక సాంకేతికత హాస్పిటల్స్ యొక్క క్రిటికల్ కేర్ మౌలిక సదుపాయాలతో ఏర్పాటు చేయబడిందన్నారు. యశోద హాస్పిటల్స్ హైదరాబాద్ తో పాటు ఇతర ప్రాంతాల వారికి అధునాతన ప్లాస్టిక్ రీక న్‌స్ట్రక్టివ్ సర్జరీలను మరింత చేరువ చేయాలని లక్ష్యంగా పెట్టుకుందని సోమాజిగూడ యశోద హాస్పిటల్స్ ప్రముఖ ప్లాస్టిక్ సర్జన్ డాక్టర్ శశికాంత్ మద్దు తెలిపారు.

# 'డిజిటల్ అరెస్ట్'తో రూ.85 లక్షల టోకరా

### చాకచక్యంగా కాపాడిన పోలీసులు
### నకిలీ ఎన్ఐఏ అధికారిగా బెదిరింపులు
### నేరేడ్మెట్ సైబర్ క్రైమ్ టీమ్ వేగవంతమైన చర్యలు



**మేడ్చల్ జిల్లా ప్రతినిధి /మల్కాజిగిరి, ఆగస్టు 27 (జనంసాక్షి)**

డిజిటల్ అరెస్ట్ పేరుతో ఓ రిటైర్డ్ బ్యాంకు ఉద్యోగిని మోసం చేసి కాజేసిన రూ.85.20 లక్షల మొత్తాన్ని నేరేడ్మెట్ సైబర్ క్రైమ్ పోలీసులు సురక్షితం చేశారు. సైబర్ సెక్యూరిటీ బ్యూరో (సీఎస్‌బీ), బ్యాంకింగ్ అధికారుల సమన్వయంతో మొత్తాన్ని హోల్డ్‌లో ఉంచి నిందితులు ఉపసంహరించకుండా అడ్డుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శివయ్య అనే రిటైర్డ్ బ్యాంకు ఉద్యోగికి ఆగస్టు 21న గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేసి తాను ఎన్ఐఏ అధికారినని పరిచయం చేసుకున్నాడు. బాధితుడి ఆధార్ కార్డు వివరాలను ఉపయోగించి అబ్దుల్ సలాం అనే వ్యక్తి బ్యాంకు ఖాతాలు తెరిచి సుమారు రూ.2.50 కోట్ల మేర అక్రమ లావాదేవీలు నిర్వహించాడని చెప్పి భయపెట్టాడు. కర్ణాటక, కేరళ రాష్ట్రాల్లో కూడా అతడి పేరుతో ఖాతాలు ఉన్నట్లు పేర్కొన్నాడు. నమ్మకం కల్పించేందుకు వీడియో కాల్‌లో పోలీసు యూనిఫాంలో కనిపించిన నిందితుడు, విచారణ పేరుతో ఆర్‌బీఐ వెరిఫికేషన్ చేయాల్సి ఉందని చెప్పాడు. ఖాతాలోని డబ్బును తాము సూచించిన ఖాతాకు బదిలీ చేయాలని, తర్వాత తిరిగి చెల్లిస్తామని నమ్మించాడు. దీంతో బాధితుడు రూ.85.20 లక్షలు బదిలీ చేశాడు. అనంతరం మరో రూ.42 లక్షలు పంపాలని కోరడంతో బాధితుడికి అనుమానం వచ్చి నేరేడ్మెట్ పోలీసులను ఆశ్రయించాడు. వెంటనే స్పందించిన సైబర్ క్రైమ్ టీమ్ ఎన్‌సీఆర్‌పీ పోర్టల్‌లో ఫిర్యాదు నమోదు చేయించి, సీఎస్‌బీ, సంబంధిత బ్యాంకులకు సమాచారం అందించింది. వేగంగా స్పందించిన అధికారులు మొత్తం రూ.85.20 లక్షలను హోల్డ్/లియన్‌లో ఉంచి సురక్షితం చేశారు.

**ఇవే పోలీసుల సూచనలు..**

పోలీస్, ఎన్ఐఏ, ఆర్‌బీఐ లేదా ఇతర ప్రభుత్వ సంస్థల పేరుతో డబ్బులు బదిలీ చేయాలని ఎవరైనా కోరితే నమ్మవద్దని పోలీసులు హెచ్చరించారు. సైబర్ మోసానికి గురైన వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు కాల్ చేసి, ఎన్‌సీఆర్‌పీ పోర్టల్‌లో ఫిర్యాదు నమోదు చేయాలని సూచించారు.

# ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం మహాధర్నా

- ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలి
- ఎంప్లాయిస్ జేఏసీ చైర్మన్, టీఎన్జీఓ కరీంనగర్ జిల్లా అధ్యక్షులు దారం శ్రీనివాస్ రెడ్డి



**కరీంనగర్ బ్యూరో, ఆగస్టు 27 (జనంసాక్షి) :** దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న ఉద్యోగులు, ఉపాధ్యాయులు, గెజిటెడ్ అధికారులు, నాలుగో తరగతి ఉద్యోగులు, డ్రైవర్లు, పోలీస్ సిబ్బంది, అంగన్వాడీలు, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు, పెన్షనర్ల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ, తెలంగాణ ఉద్యోగ సంఘాల జేఏసి ఆధ్వర్యంలో కరీంనగర్ జిల్లా కలెక్టరేట్ ఎదుట మహాధర్నా నిర్వహిం చారు. ఈ మహాధర్నాలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ఎంప్లాయిస్ జేఏసీ చైర్మన్, టీఎన్జీవోస్ కరీంనగర్ జిల్లా అధ్యక్షులు దారం శ్రీనివాస్ రెడ్డి, జేఏసీ కన్వీనర్ మడిపల్లి కాళీ చరణ్ గౌడ్ మాట్లాడుతూ... రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు ఉద్యోగుల న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చేందుకు మహాధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

**ఉద్యోగుల ప్రధాన డిమాండ్లు :** 2023 జులై 01 నుంచి రెండవ పీఆర్సీని వెంటనే అమలు చేయాలని, పెండింగ్‌లో ఉన్న 6 డీఏలు/ డీఆర్‌లను వెంటనే విడుదల చేయాలని, కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ ను రద్దు చేసి, పాత పెన్షన్ విధానం ను పునరుద్ధరించాలని, పెండింగ్ బిల్లుల చెల్లింపులను కొనసాగించాలని, ప్రతి నెల కనీసం రూ.2,000 కోట్ల మేర నిధులు విడుదల చేయాలని, నూతన ఎంప్లాయీస్ హెల్త్ స్కీమ్‌ను పూర్తిస్థాయిలో ఉద్యోగులు ప్రధాన డిమాండ్లు అమలు చేయాలని తెలిపారు. ఉద్యోగులు, పెన్షనర్లకు రావాల్సిన ఆరు డీఏలను వెంటనే విడుదల చేయాలని, సిపీఎస్ ను రద్దు చేసి ఓపిఎస్ ను పునరుద్ధరించాలని దారం శ్రీనివాస్ రెడ్డి డిమాండ్ చేశారు. ఉద్యోగులు, పెన్షనర్లకు నగదు రహిత వైద్యం అందించే ఈ హెచ్ ఎస్ ను పూర్తిస్థాయిలో అమలు చేయాలని కోరారు. అలాగే పెండింగ్‌లో ఉన్న ఉద్యోగుల బిల్లులు, పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు చెల్లించాల్సిన బకాయిలను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులకు ఉద్యమాలు కొత్త కాదు. మా సహనాన్ని పరీక్షించవద్దు.. మా సహనాన్ని చేతగానితనంగా చూడవద్దని దారం శ్రీనివాస్ రెడ్డి ప్రభుత్వానికి స్పష్టం చేశారు. ప్రభుత్వం ప్రవేశపెట్టే ప్రతి సంక్షేమ పథకాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లి, క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేసేది ప్రభుత్వ ఉద్యోగులేనని అన్నారు.ప్రస్తుత పరిస్థితుల్లో ఉద్యోగులు తమ పిల్లల వివాహాలు చేయలేక, నూతన గృహాలు నిర్మించుకోలేక, చేసిన అప్పులు తీర్చలేక, అనారోగ్యానికి గురైనప్పుడు సరైన వైద్యం చేయించుకోలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం సానుకూలంగా పరిశీలించి, ఎలాంటి జాప్యం లేకుండా తక్షణమే పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు.కార్యక్రమంలో ఎంప్లాయిస్ జేఏసీ చైర్మన్ దారం శ్రీనివాస్ రెడ్డి, సెక్రెటరీ జనరల్ మడిపల్లి కాళీ చరణ్ గౌడ్, టీఎన్జీవో జిల్లా కార్యదర్శి సంగేం లక్ష్మణరావు, ఎడ్ల అరవింద్ రెడ్డి, పెన్షనర్ల సంఘం అధ్యక్షులు కేశవరెడ్డి, ఉస్మాన్ పాషా, ఈశ్వరయ్య, అశోక్ రావు, ఎండి సలీం, కరుణాకర్ రెడ్డి, ఎలదాసరి లింగయ్య, రామస్వామి, శంకర్, ముప్పిడి కిరణ్ కుమార్ రెడ్డి, రవీందర్ రెడ్డి, రాగి శ్రీనివాస్, సర్దార్ హర్మీందర్ సింగ్, రాజేష్ భరద్వాజ్, సుమంత్ రావు, శారద, వరీస్ నవాబు, సతీష్ జనార్ధన్, చంద్రమౌళి, ప్రభాకర్ రావు, కె. రాజు, నరసింహారెడ్డి, లక్ష్మణరావు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

# ఆమరణ నిరాహార దీక్ష చేస్తా.. కవ్వంపల్లి మాతో 24 గంటల దీక్ష చేయి

### డబుల్ రోడ్డు కోసం 24 గంటల యువజన సంఘాల నిరాహార దీక్ష



**గన్నేరువరం, ఆగస్టు 27 (జనంసాక్షి):** డబుల్ రోడ్డు నిర్మాణం కోసం నిధుల మంజూరుకై ఆమరణ నిరాహార దీక్ష చేస్తానన్న ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ఈనెల 30వ తేదీన గన్నేరువరం మండల కేంద్రంలోని శ్రీ లక్ష్మీనరసింహ స్వామి షాపింగ్ కాంప్లెక్స్ వద్ద యువజన సంఘాల ఆధ్వర్యంలో డబుల్ రోడ్డు కోసం చేపడుతున్న 24 గంటల నిరాహార దీక్ష లో పాల్గొని తమ చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని యువజన సంఘాలు డిమాండ్ చేశాయి. గురువారం మండల కేంద్రంలో డబుల్ రోడ్డు సాధనకై యువజన సంఘాల ఆధ్వర్యంలో 24 గంటల నిరాహార దీక్ష పోస్టర్ ను యువజన సంఘాల నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ డబుల్ రోడ్డు కోసం నాడు యువజన సంఘాలు పోరాటం చేస్తే దానిని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ వినియోగించుకొని అధికారంలోకి వచ్చాడని అన్నారు. మూడు సంవత్సరాలు అయినప్పటికీ రోడ్డు కోసం ఎన్ని సార్లు ప్రశ్నించినప్పటికీ ఇప్పటి వరకు రోడ్డు పనులు చేపట్టకపోవడం విచారకరమని తెలిపారు. ఇటీవల యువజన సంఘాలు ప్రశ్నిస్తే డబుల్ రోడ్డు నిధుల కోసం అవసరమైతే ఆమరణ నిరాహార దీక్ష చేస్తానని అన్నారని గుర్తు చేశారు. ఆమరణ నిరాహార దీక్ష ఏమోగానీ ఈనెల 30న యువజన సంఘాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 24 గంటల దీక్షలో పాల్గొని చిత్తశుద్ధిని చూపాలని సవాల్ విసిరారు. డబుల్ రోడ్డు కోసం చేపడుతున్న ఈ నిరాహార దీక్ష లో అన్ని రాజకీయ పార్టీల నాయకులు రాజకీయాలకు అతీతంగా పాల్గొనాలని కోరారు. రోడ్డు సమస్య మండల ప్రజలందరికీ కాబట్టి మండల ప్రజలు రైతులు, ఆటో యూనియన్ నాయకులు మండల ప్రజానీకం పెద్ద ఎత్తున పాల్గొని సంఘీభావం తెలుపాలని కోరారు. ఈ కార్యక్రమంలో యువజన సంఘాల నాయకుడు కాల్వ నాగరాజు,ముల్కల హరీష్, మచ్చ సాయి కృష్ణ, గంట గౌతమ్, చిప్ప సంతోష్, పోలగాని రాకేష్, రంగన వేణి శ్రీనివాస్, కుంభం మహేష్, తదితరులు పాల్గొన్నారు.

# బాలికల భద్రతపై తహసీల్దార్ ప్రత్యేక దృష్టి

### మోడల్ స్కూల్ వసతి గృహంలో ఆకస్మిక తనిఖీ



**సిరికొండ, ఆగస్టు 27(జనంసాక్షి) :** బాలికల భద్రత, సంక్షేమం, పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని తహసీల్దార్ రవీందర్ సూచించారు. గురువారం సిరికొండలోని పీఎం శ్రీ తెలంగాణ మోడల్ స్కూల్ బాలికల వసతి గృహాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వసతి గృహంలో విద్యార్థినులకు అందిస్తున్న భోజనాన్ని పరిశీలించి, భోజనం నాణ్యతపై ఆరా తీశారు. వసతి గృహంలో విద్యార్థినులకు అందుతున్న సౌకర్యాలను పరిశీలించిన తహసీల్దార్.. విద్యార్థినులతో నేరుగా మాట్లాడి వసతి గృహంలో ఎదురవుతున్న సమస్యలు, అందుతున్న సౌకర్యాలపై వివరాలు తెలుసుకున్నారు. విద్యార్థినులకు భోజనం, వసతి, తాగునీరు, పరిశుభ్రత తదితర అంశాల్లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు. అనంతరం వసతి గృహం చుట్టుపక్కల పరిసరాలను పరిశీలించారు. వసతి గృహం చుట్టూ పెరిగిన పొదలు, పిచ్చి మొక్కలను వెంటనే తొలగించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సంబంధిత సిబ్బందికి సూచించారు. విద్యార్థినుల భద్రతకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచడంతో పాటు అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. విద్యార్థినులకు సురక్షితమైన, పరిశుభ్రమైన వాతావరణం కల్పించేందుకు అధికారులు, సిబ్బంది నిరంతరం పర్యవేక్షించాలని తహసీల్దార్ రవీందర్ సూచించారు.

# ప్రశ్నించినందుకే కుటుంబ సభ్యులపై యువకుల దాడి

### ఎస్సై సిరిసిల్ల అశోక్ వెల్లడి



**రాజన్న సిరిసిల్ల బ్యూరో (జనంసాక్షి) :** దేశాయిపల్లి గ్రామానికి చెందిన కంకణాల రాజు తన భార్య లత, కుమారుడు అక్షిత్, తమ్ముడు తిరుపతి, మరదలు చామంతితో కలసి బుధవారం రాత్రి సిరిసిల్ల నుండి స్వగ్రామానికి ఆటో (టీఎస్-15-టిసి-6178) లో బయలుదేరారు.రాత్రి సుమారు 9:30 గంటల ప్రాంతంలో సారంపల్లి ఇండియన్ ఆయిల్ పెట్రోల్ పంప్ వద్ద డీజిల్ కొట్టించుకుని వెళ్తుండగా, మోటార్ సైకిల్ (టీఎస్-21-ఎల్-2859)పై అతివేగంగా వచ్చిన ముగ్గురు యువకులు ఆటోకు ప్రమాదకరంగా కట్ కొట్టారని దీనిని ప్రశ్నించినందుకు ఆగ్రహించిన యువకులు ఆటోను అడ్డగించి గొడవకు దిగారు.కంకణాల రాజుపై బూతులు తిడుతూ పిడికిళ్లతో దాడి చేయగా, అడ్డుకోబోయిన కుటుంబ సభ్యులపై కూడా దాడికి పాల్పడినట్లు తంగళ్ళపల్లి ఎస్సై సిరిసిల్ల అశోక్ తెలిపారు. అంతలోనే మరికొంత మంది యువకులు అక్కడకు చేరుకుని బాధితులను చేతులతో,బండరాళ్లతో తీవ్రంగా కొట్టి చంపుతామని బెదిరించారని, ఈ గొడవను అడ్డుకునేందుకు యత్నించిన స్థానికులు సిరిసిల్ల ప్రశాంత్,సిరిసిల్ల నరేష్‌లపై కూడా సదరు యువకులు దాడి చేశారని వివరించారు. అనంతరం అక్కడున్న కిషన్, నవీన్, అశోక్ అనే వ్యక్తులు వారిని కాపాడటంతో నిందితులు అక్కడి నుండి పారిపోయారని.గాయపడిన బాధితులు సిరిసిల్ల ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు వెల్లడించారు. దాడికి పాల్పడిన వారిలో వేముల ఆదిత్య,రంగు భరత్,రంగు తిలక్,ఎర్ర హరి కుమార్ ఉన్నట్లు గుర్తించి గురువారం తంగళ్లపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారని,నిందితులపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకోవాలని బాధితులు కోరారన్నారు.నలుగురు యువకులపై కేసు నమోదయ్యిందని పేర్కొన్నారు.

# పాత గొడవల నేపథ్యంలో యువకుడి హత్య

**మణుగూరు, ఆగస్టు 27 (జనంసాక్షి):** పాత గొడవల నేపథ్యంలో యువకుడిపై కొంతమంది వ్యక్తులు దాడి చేసి హత్య చేసిన ఘటన మణుగూరులో గురువారం చోటుచేసుకుంది. మణుగూరు మండలం గాంధీ బొమ్మ సెంటర్ చెందిన మృతుడు సింహాద్రి శివకుమార్ శివ (28) హైదరాబాద్‌లో ఇంటీరియర్ వర్కర్. శివ వద్ద పనిచేసే సతీష్‌తో జరిగిన వివాదాన్ని మనసులో పెట్టుకున్న ఎంకట్ట గ్యాంగ్ శివను మణుగూరుకు వస్తే చంపేస్తామని ఫోన్‌లో బెదిరించారు. గురువారం ఉదయం శివ మణుగూరుకు రాగా.. ఎంకే గ్యాంగ్ ఫోన్ చేసింది. ఉదయ్‌కుమార్‌తో కలిసి శివ నేతాజీ గ్రౌండ్‌కు వెళ్లగా, రమాకాంత్ జెట్టి, భరత్, సాధిక్, వినయ్, ధినేష్, జంపయ్య, ప్రసాద్ తదితరులు దాడి చేశారు. అడ్డుకున్న ఉదయ్ కుమార్‌నూ కొట్టారు. తీవ్ర గాయాలై ఆసుపత్రికి తీసుకెళ్లేలోగా శివ మృతిచెందాడు.

# గుండెపోటుతో యువకుడి మృతి

### కన్నీటిపర్యంతో తల్లిదండ్రుల తీవ్ర మనోవేదన



**కొండమల్లేపల్లి, ఆగస్టు 27 (జనంసాక్షి) :** గుండెపోటుతో ఓ యువకుడు మృతి చెందిన సంఘటన గురువారం సాయంత్రం కొండమల్లేపల్లి పట్టణంలో జరిగింది. పట్టణ కేంద్రంలోని పాతూరుకు చెందిన పసునూరి మీనాచారి-రమాదేవిల కుమారుడు అనిల్ కుమార్(26) డిగ్రీ చదివాడు. ఓ పక్క కానిస్టేబుల్ ఉద్యోగానికి సన్నద్ధమవుతూనే ఇంటి వద్ద తన తండ్రి నిర్వహిస్తున్న కార్పెంటర్ దుకాణంలో తండ్రికి చేదోడుగా ఉంటున్నాడు. అంతేకాకుండా ఉదయం సాయంత్రం జేబీ కాలనీలోని ఓ కిడ్స్ పాఠశాల వ్యాన్ డ్రైవర్ గా విధులు నిర్వహిస్తున్నాడు. రోజు మాదిరిగానే గురువారం సాయంత్రం పాఠశాల పిల్లలను వ్యాన్ లో ఎక్కించుకుని వెళ్తున్న క్రమంలో బస్టాండ్ సమీపంలో తనకు గుండె వద్ద నొప్పి వచ్చినట్లుగా అన్పించడంతో వెంటనే వ్యాన్ ను పక్కకు ఆపి తనకు తెలిసిన అంజి అనే డ్రైవర్ ను పిలిచాడు. విషయం చెప్పి విద్యార్థులను వారి ఇళ్ల వద్ద దించాలని సూచించాడు. అనంతరం పక్కనే ఉన్న తనకు తెలిసిన వారి ఇంటి వద్దకు వెళ్లి వాష్రూంకు వెళ్లాడు. 20 నిముషాలు దాటినా బయటికి రాకపోవడంతో తలుపు తీసి చూడగా కింద పడి ఉన్నాడని వెంటనే ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతదేహాన్ని శవ పరీక్ష నిమిత్తం దేవరకొండ ప్రభుత్వాసుపత్రికి తరలించామని మృతుని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

# ఇక హామీలు కాదు.. కాలపరిమితితో పరిష్కారం కావాలి

### టీజీఈ జేఏసీ చైర్మన్ బి.రవిప్రకాష్ : ఉద్యోగుల సహనాన్ని పరీక్షించొద్దు



**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, ఆగస్టు 27 (జనంసాక్షి ) :** ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు, పెన్షనర్ల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం ఇక ఆలస్యం చేయకుండా కాలపరిమితితో కూడిన కార్యాచరణ ప్రకటించాలని టీజీఈ జేఏసీ చైర్మన్ బి.రవి ప్రకాష్ డిమాండ్ చేశారు. న్యాయమైన డిమాండ్లపై నిరంతరం హామీలు ఇస్తూ కాలయాపన చేయడం మానుకోవాలని, లేకపోతే ఉద్యోగ వర్గాల ఐక్య ఉద్యమం మరింత ఉధృతమవుతుందని హెచ్చరించారు. తెలంగాణ ఎంప్లాయీస్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో గురువారం మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా అంతాయిపల్లిలోని ఇంటిగ్రేటెడ్ డిస్ట్రిక్ట్ ఆఫీసెస్ కాంప్లెక్స్ (ఐడీఓసీ) వద్ద నిర్వహించిన మహాధర్నాలో ఆయన మాట్లాడారు. ఉద్యోగులు, గెజిటెడ్ అధికారులు, ఉపాధ్యాయులు, కార్మికులు, పెన్షనర్లు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లారు. ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వం స్పష్టమైన నిర్ణయం తీసుకోవాల్సిన సమయం వచ్చిందని రవి ప్రకాష్ పేర్కొన్నారు. ఉద్యోగుల ఆర్థిక భద్రత, సేవా హక్కులు, పెన్షనరీ ప్రయోజనాలు, ఆరోగ్య పరిరక్షణకు సంబంధించిన అంశాలను నిర్లక్ష్యం చేయడం వల్ల వేలాది కుటుంబాలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. టీజీఈ జేఏసీ ప్రధానంగా రెండో పే రివిజన్ కమిషన్‌ను తక్షణమే అమలు చేయాలని, పెండింగ్‌లో ఉన్న ఆరు డీఏలను విడుదల చేయాలని, సుమారు రూ.10 వేల కోట్ల పెండింగ్ బిల్లులను ప్రతి నెల కనీసం రూ.2 వేల కోట్ల చొప్పున చెల్లించాలని డిమాండ్ చేసింది. అలాగే కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సీపీఎస్)ను రద్దు చేసి పాత పెన్షన్ విధానం (ఓపీఎస్)ను పునరుద్ధరించాలని, ఉద్యోగుల ఆరోగ్య పథకం సమర్థవంతంగా అమలు చేయాలని కోరింది. మహాధర్నా అనంతరం ఉద్యోగులు భారీ ర్యాలీ నిర్వహించి,సమావేశమయ్యారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ముఖ్యమంత్రి స్థాయిలో చర్యలు చేపట్టాలని కోరుతూ జిల్లా కలెక్టర్ మను చౌదరికి వినతిపత్రం సమర్పించారు. వినతిపత్రాన్ని రాష్ట్ర ప్రభుత్వానికి సిఫారసులతో పంపించి సానుకూల చర్యలు తీసుకునేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో టీజీఈ జేఏసీ సెక్రటరీ జనరల్ వినోద్, అదనపు సెక్రటరీ జనరల్ సదానందం గౌడ్, రాష్ట్ర కో-చైర్మన్ రాజగంగారెడ్డి, రాష్ట్ర వైస్ చైర్మన్లు బి.వెంకటేశ్వర్లు, ఆనంద్ రెడ్డి, విట్టల్, మదన్ రెడ్డి, రాజు, శ్రీధర్, రాష్ట్ర నాయకులు జయసింహారెడ్డి, రామ్ రెడ్డి, భరత్ కుమార్, కార్తిక్, అక్షయ్ లింగాల, ఉమ, వై.రామేశ్వర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.





# పిట్లం హెచ్‌పి పెట్రోల్ బంక్‌లో నకిలీ నోట్ల కలకలం



**కామారెడ్డి జిల్లా ప్రతినిధి, ఆగస్టు 27 (జనంసాక్షి) :** పిట్లం మండల కేంద్రంలోని హెచ్ పి పెట్రోల్ బంక్‌లో నకిలీ కరెన్సీ నోట్లు కలకలం రేపాయి. బుధవారం ఓ వ్యక్తి స్విఫ్ట్ కారులో పెట్రోల్ బంక్‌కు వచ్చి రూ.2,000 విలువైన డీజిల్ పోయించుకున్న అనంతరం రూ.500 చొప్పున నాలుగు నకిలీ కరెన్సీ నోట్లను బంక్ సిబ్బందికి అందించి అక్కడి నుంచి పరారైనట్లు సమాచారం. నోట్లు నకిలీవని గుర్తించిన బంక్ సిబ్బంది వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పెట్రోల్ బంక్‌లోని సీసీటీవీ కెమెరాల దృశ్యాలను పరిశీలించిన పోలీసులు వాహనాన్ని గుర్తించే ప్రయత్నం చేశారు. సీసీటీవీ ఆధారంగా స్విఫ్ట్ కారు మహారాష్ట్రకు చెందినదిగా గుర్తించినట్లు తెలిపారు. నకిలీ నోట్లు ఎక్కడి నుంచి వచ్చాయి, వాటిని ఎవరు సరఫరా చేశారు, వాహనంలో ఉన్న వ్యక్తి ఎవరు అనే కోణాల్లో పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. సీసీటీవీ దృశ్యాలు, వాహనం వివరాల ఆధారంగా నిందితుడిని గుర్తించి పట్టుకునేందుకు పోలీసులు చర్యలు చేపట్టారు. ఈ ఘటనతో పెట్రోల్ బంక్ సిబ్బంది, వ్యాపారులు నగదు లావాదేవీల విషయంలో అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని పోలీసులు సూచిస్తున్నారు.

# చేపల వేటకు వెళ్లి అనంత లోకాలకు..

- కూతురు ముందే తండ్రి గల్లంతు
- మామ పక్కన కాపాడుకోలేని పరిస్థితి






కౌటాల ఆగస్టు 27 (జనం సాక్షి) : చేపల వేటకు వెళ్లి తిరిగి రాని లోకాలకు వెళ్లడం గ్రామంలో విషాద ఛాయలు నెలకొన్నాయి. తాటిపల్లి గ్రామానికి చెందిన కోసరి, రాందాస్, తండ్రి.పత్రు వయసు (34 సం) గురువారం సాయంత్రం 5గంటల సమయంలో అతని వెంట కూతురు, మామ తో కలిసి చేపల వేటకు వార్ధ నదికి వెళ్లారు. చేపలు పడుతున్న సమయంలో ప్రమాదవశత్తు జారీ నదిలో పడిపోయాడు. నీటీ లోతు ఎక్కువగా ఉండటంతో పక్కనే మామ ఉన్నప్పటికీ అల్లుడుని కాపాడుకోలేక పోయాడు. అభం శుభం తెలియని కూతురు నాన్న వస్తాడు అన్న ఆశ నెరవేరలేదు. వెంటనే పోలీస్ వారికీ సమాచారం అందించారు. భార్య పిర్యాదు మేరకు సంఘటన స్థలానికి చేరుకున్న కౌటాల సీ ఐ సంతోష్ కుమార్,ఎస్ ఐ సతీష్ గాలింపు చర్యలకు చీకటి పడటంతో తరువాత రోజు శుక్రవారం గాలించి మృత దేహన్ని బయటకు తీశారు. చేపల వేటకు వెళ్లి మృత్యు వాత పడటంతో కుటుంబ సభ్యులకు తీరని శ్లోకాన్ని మిగిల్చింది. మృతుడు రాందాస్ కు భార్య,కూతురు జాను, కుమారుడు, పీయూష్‌లు ఉన్నారు. ఇంటికి పెద్ద దిక్కును కోల్పోవడంతో మృతిని వద్ద రోధనలు మిన్నంటాయి.

# బోడుప్పల్‌లో ఏసీబీ మెరుపు దాడులు..

- భూపాలపల్లి జిల్లా మైనింగ్ ఏడీఈ జయరాజ్ ఆస్తులపై సోదాలు
- 8 ప్రాంతాల్లో ఏకకాలంలో తనిఖీలు
- నగదు,బంగారం,స్థిరాస్తుల వివరాల సేకరణ



బోడుప్పల్ (జనంసాక్షి) : అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు గురువారం తెల్లవారుజాము నుంచి మేడ్చల్ జిల్లా బోడుప్పల్ ఈస్ట్ హనుమాన్‌నగర్‌లోని భూపాలపల్లి జిల్లా మైనింగ్ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ బి. జయరాజ్ నివాసంపై ఆకస్మిక దాడులు నిర్వహించారు. జయరాజ్ నివాసంతో పాటు ఆయనకు సంబంధించిన మొత్తం 8 ప్రాంతాల్లో ఏకకాలంలో సోదాలు చేపట్టడం రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. ఏసీబీ జాయింట్ డైరెక్టర్ సాయి మనోహర్, వరంగల్ డీఎస్పీ సాంబయ్య ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలు ఈ సోదాలను నిర్వహించాయి. ఉదయం నుంచే అధికారులు ఇంటి పరిసరాలను తమ ఆధీనంలోకి తీసుకొని ఆస్తులు, బ్యాంకు ఖాతాలు, పెట్టుబడులు, స్థిరాస్తులకు సంబంధించిన పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించారు. కుటుంబ సభ్యులు, బంధువుల పేర్లపై ఉన్న ఆస్తుల వివరాలను కూడా సేకరించినట్లు తెలిసింది. సోదాల్లో ప్రాథమికంగా రెండు నాలుగు చక్రాల వాహనాలు,రెండు ద్విచక్ర వాహనాలు, బంగారు ఆభరణాలు,ఫిక్స్‌డ్ డిపాజిట్లు, సుమారు 5 ఎకరాల వ్యవసాయ భూమి,రెండు అంతస్తుల భవనం ఉన్నట్లు అధికారులు గుర్తించినట్లు సమాచారం. వీటికి సంబంధించిన పత్రాలు, కొనుగోలు వివరాలు,ఆదాయ వనరులపై ఏసీబీ అధికారులు ఆరా తీస్తున్నారు. బ్యాంకు లాకర్లు, పెట్టుబడులు ఇతర జిల్లాల్లో ఉన్న ఆస్తుల వివరాలను కూడా అధికారులు పరిశీలిస్తున్నట్లు తెలిసింది. ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టారనే ఆరోపణల నేపథ్యంలో ఈ సోదాలు నిర్వహించినట్లు సమాచారం. సోదాల సందర్భంగా కీలక పత్రాలు,ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన రికార్డులను అధికారులు స్వాధీనం చేసుకున్నట్లు తెలుస్తోంది. సోదాలు పూర్తయిన అనంతరం ఆస్తుల విలువ,స్వాధీనం చేసుకున్న పత్రాలు,ఇతర వివరాలతో కూడిన పూర్తి నివేదికను ఏసీబీ అధికారులు విడుదల చేసే అవకాశం ఉంది. భూపాలపల్లి జిల్లాలో కీలక అధికారిగా పనిచేస్తున్న జయరాజ్ నివాసంపై ఏసీబీ దాడులు జరగడంతో ప్రభుత్వ వర్గాల్లోనూ,స్థానిక ప్రజల్లోనూ తీవ్ర ఆసక్తి నెలకొంది.

# కన్నకొడుకు ముందే తల్లిపై లైంగికదాడి

**అడ్డుకునేందుకు ప్రయత్నించిన కుమారుడిపై రాళ్లతో దాడి**

**మహిళ ప్రైవేటు పాట్స్ కోసిన దుండగులు**

మక్తల్, ఆగస్టు 27 ( జనంసాక్షి) : నిద్రిస్తున్న మహిళపై కన్న కొడుకు ముందే లైంగిక దాడి చేసి సదరు మహిళ ప్రైవేట్ పార్ట్స్ ను కోసి వేసిన ఘటన మక్తల్ పట్టణంలో గురువారం తెల్లవారు జామున చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే మక్తల్ పట్టణానికి చెందిన ఓ మహిళ గత కొన్ని సంవత్సర నుండి ఒంటరిగా తన 12 ఏండ్ల కొడుకుతో జీవనం కొనసాగిస్తున్నది. జీవనోపాధికోసం సదరు మహిళ పట్టణంలో నీ ప్రధాన కూడలి తోపాటు, బస్టాండ్ లో బిక్షాటన చేస్తూ జీవిస్తున్నది. గత 10సంవత్సరాలకు పైగా రాత్రి పూట మక్తల్ ప్రభుత్వ జూనియర్ కళాశాల భవనం వద్ద తలదాచుకుంటున్నది. ఈ క్రమంలో గురువారం తెల్లవారు జామున ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు మక్తల్ ప్రభుత్వ జూనియర్ కళాశాల భవనం వద్ద నిద్రిస్తున్న తల్లి కొడుకుల దగ్గరకు వెళ్లి, తల్లిపై ఇద్దరు వ్యక్తులు లైంగిక దాడి చేయడానికి ప్రయత్నించిన క్రమంలో తల్లి కేకలు వేయడంతో నిద్రస్తున్న మహిళా కుమారుడు లేచాడు. తల్లిపై దాడికి దిగిన ఇద్దరు వ్యక్తులను అడ్డుకొనే ప్రయత్నం చేసినా మద్యం మత్తులో ఉన్న ఆ ఇద్దరు వ్యక్తులు పిల్లవాడిపై దాడికి దిగడంతో భయంతో పరుగులు తీశాడు. ఇద్దరు వ్యక్తులు మహిళపై విచక్షణ రహితంగా లైంగిక దాడికి పాల్పడి అనంతరం మహిళ ప్రైవేట్ పాట్స్ ను కోసి వేసి వెళ్లిపోయారు. మహిళ రక్తపు మడుగులో పడిపోయినా దృశ్యాన్ని తెల్లవారు జామున మక్తల్ మినీస్టేడియం గ్రౌండ్‌లో వాకింగ్ కు వచ్చిన పట్టణ ప్రజలు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. మక్తల్ పోలీసులు వెంటనే సంఘటన స్థలానికి చేరుకొని బాధితురాలిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# రోడ్డు భద్రత నివారణకు భద్రత సూచికలు ఏర్పాటు చేయాలి

**జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**



మంచిర్యాల ప్రతినిధి ,ఆగస్టు 27 (జనంసాక్షి) : రోడ్డు ప్రమాదాల నివారణ చర్యలు పటిష్టంగా అమలు చేయాలని, వాహనదారులు రోడ్డు భద్రత నియమాలు తప్పనిసరిగా పాటించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని, రోడ్డు భద్రత సూచికలు ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ పేర్కొన్నారు. గురువారం నాడు మంచిర్యాల కలెక్టర్ కార్యాలయ భవన సముదాయంలో రోడ్డు ప్రమాదాల నివారణపై పోలీస్, రవాణా, జాతీయ రహదారులు, రోడ్లు భవనాలు, ఆర్.టి.సి., విద్యుత్, పంచాయతీ రాజ్ శాఖల అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, సంబంధిత అధికారులతో రోడ్డు భద్రత కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. మున్సిపల్ పరిధిలోని రోడ్లపై చెత్త, ఆటంకాలను వెంటనే తొలగించాలని, ట్రాఫిక్ పోలీసు విభాగం రోడ్లపై అనధికార వాహన నిలుపుదల, నిబంధనల ఉల్లంఘన పట్ల కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. రోడ్లపై తక్కువ విజిబిలిటీ ఉన్న చోట్ల లైటింగ్ ఏర్పాటు చేయాలని, జాతీయ రహదారులపై రంబుల్ స్ట్రిప్స్, లైటింగ్, జాగ్రత్త సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని తెలిపారు. ఓవర్ లోడింగ్, మితిమీరిన వేగం, డ్రంక్ అండ్ డ్రైవింగ్, రాంగ్ సైడ్ డ్రైవింగ్ లపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. రోడ్లపై సంచరించే పశువులను అందుబాటులో ఉన్న గోశాలకు తరలించాలని, నూతన గోశాల ఏర్పాటుకు భూమిని కేటాయించడం జరిగిందని త్వరితగతిన పనులు చేపట్టి పూర్తి చేయాలని తెలిపారు. రహదారి ప్రమాదాలు, మరణాలు తగ్గించేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు.

# రోడ్డెక్కాలంటే భయం!

## ట్రాఫిక్ పోలీసుల 'వసూళ్ల పర్వం'..

- ఇబ్రహీంపట్నంలో సామాన్యుడిపై చలాన్ల కొరడా
- టార్గెట్‌ల కోసం దొంగచాటు ఫోటోలు..
- బెంబేలెత్తుతున్న వాహనదారులు
- త్వరలో పోలీసు కమిషనర్‌ను కలవనున్న బాధితులు




**ప్రజల ప్రాణాలను కాపాడాల్సిన ట్రాఫిక్ పోలీసులు.. నేడు సామాన్యుల జేబులు గుల్ల చేయడమే లక్ష్యంగా పని చేస్తున్నారు. ఇబ్రహీంపట్నం ట్రాఫిక్ పోలీసుల తీరు రోజురోజుకూ హద్దుమీరుతోంది. నిబంధనల పేరుతో సామాన్యులను వేధిస్తూ, ఇష్టారాజ్యంగా చలాన్లు విధిస్తున్న వైనంపై స్థానికంగా తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది. 'రోడ్డెక్కాలంటేనే భయమేస్తోంది' అంటూ వాహనదారులు కన్నీటి పర్యేంతమవుతున్నారు.**

*రంగారెడ్డి, ఆగస్టు 27(జనం సాక్షి) :*

**నిఘా నేత్రాల పేరుతో దొంగచాటు దందాలు..**

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించాల్సిన రక్షక భటులు.. ఇప్పుడు 'శిక్షక' భటులుగా మారుతున్నారు. దారి పక్కన అత్యవసరంగా వాహనం ఆపాలన్నా వాహనదారులు బెంబేలెత్తిపోతున్నారు. పార్కింగ్ చేయకున్నా, కనీసం వాహనంపై కూర్చుని ఉన్నా సరే.. దొంగచాటుగా కెమెరామెన్ల (ట్రాఫిక్ కానిస్టేబుల్స్)తో ఫోటోలు తీయించి, క్షణాల్లో భారీ జరిమానాల మోత మోగిస్తున్నారు. అసలు తప్పు జరిగిందా లేదా అని కనీసం బేరీజు వేసుకోకుండా, ఏకపక్షంగా చలాన్లు వేయడమే పనిగా పెట్టుకున్నారు.

**టార్గెట్‌ల ఒత్తిడేనా..**

ప్రజల భద్రత కంటే.. పైనుంచి ఉన్న 'టార్గెట్' ఒత్తిడిని చేరుకోవడమే ఇబ్రహీంపట్నం ట్రాఫిక్ పోలీసులకు ప్రధాన ధ్యేయంగా మారింది. ప్రతీ రోజూ ఇన్ని వందల చలాన్లు వేయాలనే టార్గెట్‌ల కారణంగా, కానిస్టేబుళ్లు రోడ్లపై వేట మొదలు పెట్టడమే అన్న మాదిరిగా కాపు కాస్తున్నారు. ఎక్కడ ఎవరికి చిక్కితే అక్కడ చలాన్ వేసి, తమ టార్గెట్ పూర్తి చేసుకోవడమే పనిగా పెట్టుకున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ దోపిడీ తీరుతో దినసరి కూలీలు, సామాన్య ఉద్యోగులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

**ఆగితే చాలు.. క్షణాల్లో చలాన్..**

నిబంధనల అమలు పేరుతో ట్రాఫిక్ పోలీసులు సామాన్యులను లక్ష్యంగా చేసుకుంటున్నారనే ఆరోపణలున్నాయి. దారి పక్కన అత్యవసర పని నిమిత్తం వాహనం నిలపడానికీ వీలు లేని పరిస్థితి ఏర్పడింది. ఎక్కడైనా వాహనం ఆపితే చాలు.. దూరంగా మాటు వేసి కెమెరామెన్లలా కాపు కాస్తున్న ట్రాఫిక్ పోలీసులు దొంగచాటుగా ఫోటోలు తీసి, క్షణాల వ్యవధిలో సెల్‌ఫోన్‌కు చలాన్ మెసేజ్‌లు పంపిస్తున్నారని వాహనదారులు కన్నీటి పర్యేంతమవుతున్నారు. కనీసం వాహనం ఎందుకు ఆపారో అడిగే అవకాశం కూడా ఇవ్వకుండా ఏకపక్షంగా జరిమానాలు విధిస్తున్న తీరు తీవ్ర విమర్శలకు దారితీసింది.

**కమిషనర్ దర్బార్‌కు బాధితులు**

పోలీసుల ఈ వేధింపులపై ఇకనైనా మౌనం వీడాలని స్థానికులు, వాహనదారులు నిర్ణయించుకున్నారు. ఇబ్రహీంపట్నం ట్రాఫిక్ పోలీసుల అరాచక తీరుపై త్వరలోనే పోలీస్ కమిషనర్‌ను నేరుగా కలిసి ఫిర్యాదు చేయడానికి బాధితులు భారీ సన్నాహాలు చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, ఈ టార్గెట్ రాజ్‌కు కళ్ళెం వేయాలని, అమాయక ప్రజలను వేధిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# రాజీవ్ యువ వికాసం ఉత్తుత్తేనా?

- రాయితీ రుణాల కోసం యువత ఎదురుచూపు..
- కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు




నిర్మల్ బ్యూరో, ఆగస్టు 27 (జనంసాక్షి) : రాష్ట్ర ప్రభుత్వం గత ఏడాది ఎంతో ఆర్భాటంగా ప్రకటించిన రాజీవ్ యువ వికాసం పథకం అమలులో తీవ్ర జాప్యం జరుగుతోందని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాయితీ రుణాలు మంజూరైతే చిన్న పరిశ్రమలు, వ్యాపారాలు ఏర్పాటు చేసుకుని స్వయం ఉపాధి పొందవచ్చని ఆశించిన ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల యువత.. ప్రస్తుతం రుణాల కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి నెలకొంది.

రూ.50 వేల నుంచి రూ.3 లక్షల వరకు రాయితీతో కూడిన రుణాలు అందుతాయని ఆశించిన యువత పెద్ద సంఖ్యలో దరఖాస్తు చేసుకున్నారు. రుణం మంజూరైతే తమకు నచ్చిన రంగంలో వ్యాపారం ప్రారంభించి కుటుంబాన్ని పోషించుకోవచ్చని భావించారు. అయితే నెలలు గడుస్తున్నా రుణాల మంజూరుపై స్పష్టత లేకపోవడంతో లబ్ధిదారుల్లో ఆందోళన నెలకొంది.

తమ దరఖాస్తుల పరిస్థితి తెలుసుకునేందుకు లబ్ధిదారులు సంబంధిత సంక్షేమ శాఖల కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. రుణం ఎప్పుడు మంజూరవుతుందో తెలుసుకునేందుకు నిత్యం అధికారులను సంప్రదిస్తున్నామని వారు చెబుతున్నారు. కార్యాలయాల చుట్టూ కాళ్ల చెప్పులు అరిగేలా తిరిగినా స్పష్టమైన సమాధానం లభించడం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

స్వయం ఉపాధి ద్వారా యువతకు ఆర్థికంగా అండగా నిలవాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ప్రకటించిన పథకం అమలులో జాప్యం జరగడంతో దరఖాస్తుదారుల్లో నిరుత్సాహం నెలకొంది. రుణాలు ఎప్పుడు మంజూరవుతాయో తెలియక వారు అయోమయానికి గురవుతున్నారు. దీంతో ప్రభుత్వంపై నమ్మకం సన్నగిల్లుతోందని పలువురు అంటున్నారు.

**బడ్జెట్ విడుదలైతేనే రుణాలు**

రాజీవ్ యువ వికాసం పథకం రుణాలపై 'జనంసాక్షి' ప్రతినిధి సంబంధిత అధికారులను వివరణ కోరగా.. ప్రభుత్వం బడ్జెట్ విడుదల చేసిన అనంతరం అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేసి రుణాలు మంజూరు చేస్తామని తెలిపారు. బడ్జెట్ విడుదల కాకపోతే తాము ఏమీ చేయలేమని అధికారులు పేర్కొన్నారు.



# గొడ్డలితో దాడి

**ముగ్గురిపై కేసు నమోదు**

మల్దకల్ ఆగస్టు 27 (జనంసాక్షి) : మండల పరిధిలోని ఉలిగేపల్లి గ్రామంలో కురవ నర్సింలు అనే వ్యక్తినికురవ జయన్న అతని కుమారులు కలిసి నర్సింలు ఇంటి పైకి బుధవారం రాత్రి 9 గంటలకు వచ్చి గొడవ పడి ఇంటి దగ్గర ఒంటరిగా ఉన్న సమయంలో విచక్షణ రహితంగా దాడి చేశారు. జయన్న అనే వ్యక్తి వెనుక నుంచి గొడ్డలితో తల పై బలంగా కొడితే నర్సింలు వెంటనే కుప్పకూలి పోయాడు. చుట్టూ పక్క వాళ్ళు విడిపించిన దాడి చేసి ఏం చేసుకుంటారో చేసుకో నాకు డబ్బులు ఉన్నాయి,ఎవరు ఏం చేయలేరు అని కొట్టి వెళ్లిపోయారు. నిషస్థితిలో ఉన్న స్థానికులు గమనించి అంబులెన్స్ ద్వారా గద్వాల ప్రభుత్వ హాస్పిటల్‌కు తరలించారు. గురువారం మల్దకల్ పోలీసులుజయన్న కుమారులు కురువ తిరుమలేష్,కురువ నరసింహులుపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. కురువ నరసింహులు ప్రస్తుతం గద్వాల ప్రభుత్వ ఆసుపత్రి ఐసియులో చికిత్స పొందుతున్నారు. గత కొంతకాలం నుండి భూతగాదాలు ఇద్దరి మధ్య జరుగుతున్నాయి. భూ సమస్యపై మాట్లాడేందుకు కురువ జయన్న ఇంటికి వెళ్ళగా నిందితులు అతను అతనితో గొడవకు దిగు బూతులు తిడుతూ చంపుతామని బెదిరించారు.

# బాలికపై అత్యాచారం

- నిందితుడిని రిమాండ్‌కు తరలింపు

గండీడ్, ఆగస్టు 27 (జనంసాక్షి): బాలికపై అత్యాచారానికి పాల్పడిన ఘటన గండీడ్ మండలంలోని చోటుచేసుకుంది. గండీడ్ మండలానికి చెందిన ఓ యువకుడు బాలికపై అత్యాచారానికి పాల్పడినట్లు కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు పోలీసులు నిందితుడిపై పోక్సోచట్టం ప్రకారం కేసు నమోద చేసి నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు మహమ్మదాబాద్ ఎస్ఐ శేఖర్‌రెడ్డి తెలిపారు.

# మంత్రి కొండా సురేఖను తొలగిస్తే ఓబీసీల సత్తా ఏంటో చూపిస్తాం..


- సీనియర్ ఐఏఎస్ అధికారి పరికిపండ్ల నరహరి
- రవీంద్ర భారతిలో పద్మశాలి సర్పంచులకు ఘనంగా సన్మానం




హైదరాబాద్ (జనంసాక్షి) : మంత్రి కొండా సురేఖను తొలగిస్తే ఓబీసీల సత్తా ఏంటో చూపిస్తామని సీనియర్ ఐఏఎస్ అధికారి పరికిపండ్ల నరహరి అన్నారు. జన అధికార సమితి ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా గెలుపొందిన పద్మశాలి సర్పంచుల్ని రవీంద్రభారతిలో ఘనంగా సన్మానించారు. దీనితోపాటుగా సీనియర్ ఐఏఎస్ ఆఫీసర్ పరికిపండ్ల నరహరి రచించిన ఓబిసిల పోరుబాట – 2 పుస్తక ఆవిష్కరణ ఘనంగా నిర్వహించారు. పద్మశాలీలు రాజకీయంగా ఎదగాల్సిన అవసరం ఎంతో ఉంది అని బిసి టైమ్స్ వ్యవస్థాపకుడు సంగెం సూర్యరావు అన్నారు. 3.5% ఉన్న పద్మశాలీలు శాసనసభలో నలుగురు ఎమ్మెల్యేలు ఉండాల్సిన చోట ఇద్దరు మాత్రమే ఉండడం బాధాకరం పద్మశాలిల కంటే తక్కువగా ఉన్న కొన్ని కులాలు పదుల సంఖ్యలో ఎమ్మెల్యేలుగా ఉన్నారని రావాల్సిన వాట పద్మశాలిలకు రాకుండా ఈ రాజకీయ పార్టీలు కుట్ర పన్నుతున్నాయని మాజీ డిజిపి పూర్ణచంద్రరావు అభిప్రాయపడ్డారు. స్వాతంత్ర భారతదేశంలో ఓబీసీలు ఇంకా చట్టసభల్లోకి అడుగుపెట్టలేని పరిస్థితుల్లో ఉండడం నిజంగా బాధాకరం బీసీలంతా ఒకటిగా పోరాడాల్సిన అవసరం ఎంతైనా ఉంది అతి అల్ప సంఖ్యలో ఉన్న జాతులు ఈరోజు చట్టాల్ని రూపొందించి బలవంతంగా అత్యధిక జనాభా ఉన్న జాతుల పైన రుద్దుతున్నారు. అత్యధిక జనాభా ఉన్న బీసీలు ఇంకా జండా మోసే దగ్గరే ఆగిపోయారని, చట్టాల్ని రూపొందించే చట్టసభల్లో కాలు పెట్టలేకపోతున్నారు నిజంగా మన అవసరాలు తీరాలంటే చట్టాలు చేసి చట్టసభల్లో మన ఉన్నప్పుడే అది సాధ్యమవుతుందని, మన గోడు మన ఆకలి మంట ఎవరికి అర్థం కాదు అని అందుకే ఓబీసీ బోరుబాట – 2 పుస్తకాన్ని రాశానని సీనియర్ ఐఏఎస్ ఆఫీసర్ పరికిపండ్ల నరహరి అన్నారు. పద్మశాలి బిడ్డ మంత్రి కొండా సురేఖను తొలిగించే ప్రయత్నం జరుగుతుందని, ఆమె తొలగిస్తే బీసీల పవర్ ఏంటో ఈ ప్రభుత్వం చూడాల్సి వస్తుందని రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు తెలియజేసి ఈ ప్రభుత్వాన్ని గద్దె దింపుతామని, దమ్ముంటే బీసీల పవర్ ఏంటో చూడాలనుకుంటే మంత్రి కొండా సురేఖను తొలగించి చూడమని రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి సవాల్ విసిరారు. కార్యక్రమంలో బిసి సమాజ్ బిసి టైమ్స్ వ్యవస్థాపకులు సంఘం సూర్యరావు, రిటైర్డ్ ఐఏఎస్ ఆఫీసర్ చిరంజీవులు, రిటైర్డ్ ఐపిఎస్ ఆఫీసర్ పూర్ణచంద్రరావు, సీనియర్ జర్నలిస్ట్ విట్టల్, తొలివెలుగు రఘు, కాలోజు వెంకట్, కటకం నర్సింగరావు, విజయ్ కుమార్, నరుకుడు బిందెల మల్లికార్జున్, విజయ్, నరేందర్, రవికుమార్, పద్మశాలి సంఘం రాష్ట్ర నాయకులు ప్రజాప్రతినిధులు భారీ స్థాయిలో పాల్గొన్నారు.

# 60 గజాల పట్టాలకు స్థలాలు చూపించే వరకు అండగా ఉంటా

- టిఆర్ఎస్ పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత



మొయినాబాద్, ఆగస్టు 27 (జనంసాక్షి) : హిమాయత్‌నగర్, మొయినాబాద్ మున్సిపాలిటీ సర్వే నంబర్ 151లో 2007లో మంజూరైన 60 గజాల పట్టాలకు స్థలాలు కేటాయించాలని డిమాండ్ చేస్తూ గత 63 రోజులుగా నిరంతర ధర్నా చేస్తున్న బాధితులు ఈరోజు తెలంగాణ రక్షణ సేన చిప్ కల్వకుంట్ల కవితను ఆమె పార్టీ కార్యాలయంలో కలిసి వినతిపత్రం సమర్పించారు. నిన్న బాధితుల దీక్షా శిబిరాన్ని సందర్శించి వారి సమస్యలను తెలుసుకున్న కల్వకుంట్ల కవిత, పార్టీ కార్యాలయానికి ఆహ్వానించి మరోసారి వారి వినతిని స్వీకరించారు. బాధితులు 2007లో తమకు ఇచ్చిన పట్టాలకు ఇప్పటివరకు స్థలాలు చూపించలేదని, వెంటనే ప్రభుత్వం స్పందించి న్యాయం చేయాలని కోరారు. ఈ సందర్భంగా కల్వకుంట్ల కవిత మాట్లాడుతూ, 2007లో ఇచ్చిన 60 గజాల పట్టాలకు స్థలాలు చూపించే వరకు మీ పోరాటానికి నేను అండగా ఉంటాను అని హామీ ఇచ్చారు. బాధితులకు స్థలాలు కేటాయించే వరకు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చి, ఈ సమస్యను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం కృషి చేస్తానని మాట ఇచ్చారు. కవిత ఇచ్చిన హామీతో బాధితులు ఆనందం వ్యక్తం చేస్తూ, తమకు న్యాయం జరిగే వరకు పోరాటాన్ని కొనసాగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టి ఆర్ ఎస్ పార్టీ చేవేళ్ల నియోజకవర్గం ఇంచార్జి బేగరి రాజు, టి ఆర్ ఎస్ పార్టీ జిల్లా నాయకులు కుమ్మరి శివ శంకర్, టి ఆర్ ఎస్ పార్టీ మొయినాబాద్ మున్సిపాలిటీ అధ్యక్షుడు యండి అన్వార్ ఖాన్,టి ఆర్ ఎస్ పార్టీ మొయినాబాద్ మండల యూత్ అధ్యక్షులు కుమ్మరి పవన్, భార్గవ్ రెడ్డి, కట్టమీది శ్రీనివాస్,షాబాద్ ప్రవీణ్ 60 గజాల బాధితులు, మహిళలు, ప్రజాప్రతినిధులు నాయకులు పాల్గొన్నారు.






























































Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist. Telangana 500077, Published at Flat No. 301, 8-2-273, 276 & 277, 3rd Floor, Pavani Estate, Indradhanush Complex, Road No. 2, Banjara Hills, Hyderabad-500034, Telangana, Editor: M.M.RAHMAN RNI No. APTEL/2013/50370